www.andhrajyothy.com

విజయవాడ సిటీ*

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 4-11-2019 | పేజీలు: 12 + 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 | సంచిక (Issue) : 199

శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి తె. 4.58 తదుపరి నవమి; నక్షత్రం: శ్రవణం తె. 3.24 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: శే. ఉ. 7.05; దుర్ముహూర్తం: మ. 12.22-1.07, మ. 2.38-3.23; అమృతఘడియలు: మ. 3.55-5.41; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.19; సూర్యాస్తమయం: 5.39

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nalgonda | Nizamabad | Bangalore and Chennai

జన సైనికులు కదం తొక్కారు. విశాఖ నగర వీధుల్లో పోటెత్తారు. ఇసుక కొరతతో పనులు లేక, ప్రాణాలు తీసుకుంటున్న భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇసుక లేకపోతే అభివృద్ధి కూడా లేదని తెలిపారు. కార్మికుల కష్టం తనను కలచివేసిందన్నారు. వారి ఇబ్బందులు తొలగిపోయేదాకా జనసేన అండగా ఉంటుందని ప్రకటించారు.

ఇసుక ఇవ్వలేనిది..

వర్షాల వల్ల ఇసుక తీయలేకపోతున్నా మంటున్నారు. వర్షాలేమైనా కొత్తా? ఉత్తరప్రదేశ్, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోనూ వరదలు వచ్చాయి. అక్కడ ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులు చచ్చిపోతున్నారా? ఒక్క ఏపీలోనే ఎందుకు చనిపోతున్నారు?

- పవన్ కల్యాణ్

ఇదేమి సర్కార్?

కూల్చివేతల ప్రభుత్వం కూలిపోతుంది!

పట్టించుకోని సర్కారును ప్రజలూ పట్టించుకోరు

ప్రభుత్వం విఫలం... ఇంతమంది రోడ్లెక్కడమే నిదర్శనం

విధాన రూపకల్పనలో వైఫల్యం.. 35 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు కష్టం

ఆత్మహత్యలు ఇక్కడే ఎందుకు?.. చంద్రబాబుపై కోపం కార్మికులపై చూపిస్తారా!

రెండు వారాలు గడువు ఇస్తున్నాం.. పరిష్కరించకుంటే ఉద్యమ కార్యాచరణ

కార్మికులకు 50 వేలు చెల్లించాలి.. మరణించిన వారికి 5 లక్షల పరిహారం: పవన్

విశాఖ లాంగ్ మార్చ్‌కు హాజరైన జనం.. తట్ట, పార చేతబట్టి పవన్ అభివాదం

కులాల రొంపిలో ఏపీ

తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల కోసం అన్ని పార్టీలు ఏకమయ్యాయని పవన్ గుర్తు చేశారు. అలాంటి పరిస్థితి ఏపీలో లేదన్నారు. ఏపీ కులాల్లో ఇరుక్కుపోయిందని, ఇందుకు సిగ్గుపడాలని అన్నారు. భవన నిర్మాణ కార్మికులది కులమా? సీఎం నా కులమైతే ఒకలా, కాకపోతే మరోలా ప్రవర్తిస్తామా? కులాలను దాటి ముందుకెళ్లకపోతే అధోగతిపాలవుతాం" అని తెలిపారు. కర్ణాటకలో ఒక దేవాలయం పునఃప్రారంభానికి వెళితే వందలాది మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. అలాంటిది 35 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల కోసం రోడ్డెక్కితే ఒక్కరిని కూడా తనకు భద్రతగా కేటాయించలేదన్నారు. "భద్రత కల్పించాలని అడగను. కిందపడ్డా... మీద పడ్డా... గుండె ఆగిపోయినా..ముందుకువెళ్లడమే తప్ప.. ఆగిపోను" అని పవన్ ఉద్ఘాటించారు.

ప్రతి వారం కోర్టుకెళ్లే సీఎం మన దురదృష్టం

ఆర్థిక నేరాభియోగాలు ఎదుర్కొంటున్నారు

మరొకరిని శిక్షించే అర్హత ఉంటుందా?

'లాంగ్ మార్చ్'లో పవన్ కల్యాణ్ ఫైర్

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి వచ్చిన వెంటనే మంచి పనులు మొదలుపెడుతుంది. కానీ... వైసీపీ ప్రభుత్వం కూల్చివేతలతో మొదలైంది. ఆ ప్రభుత్వం కూడా కూలిపోతుంది' అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జోస్యం చెప్పారు. ప్రజల ధన, మాన, ప్రాణ సంరక్షణను పట్టించుకోని ప్రభుత్వాన్ని ప్రజలు కూడా వదిలేస్తారని హెచ్చరించారు. వైసీపీలో ప్రజాస్వామ్యం లేదని, ఏక స్వామ్యం మాత్రమే ఉందని పవన్ పేర్కొన్నారు. ఇటువంటి లక్షణాలు ఉంటే ఏ ప్రభుత్వమైనా కూలిపోతుందన్నారు. "ఇది కర్మ సిద్ధాంతం కాదు. చర్యకు ప్రతిచర్య ఉంటుందన్న

మిగతా 9వ పేజీలో...

ఇసుక ఇలా తీస్తారు!

"రెండు నెలలుగా వర్షాలు, వరదలు వస్తుంటే ఇసుక ఎలా తీస్తారు?" అని పదేపదే మంత్రులు సంధిస్తున్న ప్రశ్నకు సమాధానమే ఈ చిత్రం. కర్నూలులో నిండుగా పారుతున్న తుంగభద్ర నదిలోకి ఎద్దుల బండితో దిగి... మధ్యలో మేట వేసిన ఇసుకను తవ్వి బండిమీద వేసుకుని... అత్యంత జాగ్రత్తగా మళ్లీ ఒడ్డుకు చేరుకున్నారు. ఇసుకను సాధించారు! వర్షాకాలం రాకముందే ఇసుకను సిద్ధం చేయాల్సిన సర్కారు 'కొత్త పాలసీ' పేరిట ఆ సంగతి మరిచిపోయింది. ఆ తర్వాత.... వరదల్లోనూ నది నుంచి ఇసుకను తవ్వుకునే ప్రత్యామ్నాయ మార్గాలున్నా పట్టించుకోవడంలేదు.

అంతా నా ఇష్టం!

పైఅధికారుల ఆదేశాలు బేఖాతరు

ఉద్దేశపూర్వకంగానే ఇష్టారాజ్యం

ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా 'వైఎస్సార్ అవార్డు' ఫైలు

సీఎస్ సూచించినా తూచ్

నేరుగా కేబినెట్ ముందుకు!

కేబినెట్ ముందుకు రాని గ్రామ న్యాయాలయాల ఫైలు

ఏఐఎస్ నియమావళికి తూట్లు

అడ్డగోలుగా ఉల్లంఘనలు

అందుకే ప్రవీణ్ ప్రకాశ్‌కు షోకాజ్

వారంలోగా సంజాయిషీకి ఆదేశం

అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సర్వీసు (ఏఐఎస్) అధికారుల నియమావళిని అడ్డగోలుగా ఉల్లంఘిస్తూ... ఉద్దేశపూర్వకంగానే ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ... 'అంతా నేనే... అంతా నా ఇష్టం' అన్నట్లుగా వ్యవహారం! అందుకే... జీఏడీ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీఎం ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌కు 'షోకాజ్ నోటీసు'! తీవ్రస్థాయిలో ఉల్లంఘనలకు పాల్పడినందునే సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. షోకాజ్ ఎందుకు జారీ చేయాల్సి వచ్చిందో నోటీసులో

మిగతా 10వ పేజీలో...

వైసీపీ గూండాల దౌర్జన్యాలను ఎదుర్కొంటాం

10

5 నెలల పాలనలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకత

ఇసుక కొరతతో కార్మికులు బజారుపాలు

జగన్ రాక్షస పాలనపై ఉద్యమిస్తాం: కన్నా

ఢిల్లీలో కమ్ముకున్న కాలుష్య మేఘాలు

బాబోయ్ ఢిల్లీ

12

ప్రమాదకర స్థాయికి వాయు కాలుష్యం

37 విమానాల దారి మళ్లింపు

తాజ్‌మహల్ వద్ద ఎయిర్ ప్యూరిఫయర్

జడ్జిల ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారు

12

వారిపై వేధింపులు బాధిస్తున్నాయి

కాబోయే సీజేఐ బోబ్డే ఆవేదన

సోషల్ మీడియా తీరుపై ఆక్షేపణ

ప్రస్తుతానికి ఏమీ చేయలేమని వ్యాఖ్య

డీపీఆర్‌లు సమర్పించినా..

నాన్చుడే..!

భూ కేటాయింపులపై ఏపీఐఐసీ మీనమేషాలు

పెట్టుబడులపై సానుకూలత కరువు

ప్రోత్సహించకపోగా జాగు ధోరణి

వేరే రాష్ట్రాల వైపు కంపెనీల చూపు

ఉద్యోగాలు, పెట్టుబడులు వెనక్కి!

కనెక్ట్ టు ఆంధ్రా!

'సామాజిక' విరాళాల సేకరణకు కొత్త సంస్థ

చైర్మన్‌గా సీఎం.. వెయ్యి కోట్ల స్వీకరణ లక్ష్యం

అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అసలే ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉంది. స్వయంగా పరిశ్రమలు స్థాపించేందుకు ప్రభుత్వం వద్ద నిధులేవు. ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడిదారులు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొస్తే ఏ ప్రభుత్వమైనా ఎర్రతివాచీతో స్వాగతం పలుకుతుంది. భూముల నుంచి రాయితీల వరకు కావలసినవన్నీ సమకూరుస్తుంది. కానీ మన రాష్ట్రంలో పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ ఏపీఐఐసీ మాత్రం ఈ దిశగా అంత సానుకూలంగా వ్యవహరించడం లేదన్న విమర్శలు

మిగతా 10వ పేజీలో...

మహా రగడ

170 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది

మావాడే సీఎం... శివాజీ పార్కులో ప్రమాణం

బీజేపీతో చర్చలంటూ జరిగితే సీఎం పదవిపైనే

లేదంటే ఎన్సీపీ, కాంగ్రెస్‌తో కలిపి ప్రభుత్వం: సేన

ముంబై, నవంబరు 3: మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. మిత్రపక్షాలైన బీజేపీ, శివసేన మధ్య రగడ ముదురుపాకాన పడింది. ముఖ్యమంత్రి పదవిని చెరో రెండున్నరేళ్లు పంచుకోవాలని పట్టుబడుతున్న శివసేన తన స్వరాన్ని మరింత పెంచింది. శివసేనకు 170 మందికి పైగా ఎమ్మెల్యేల మద్దతు ఉందని ఆ పార్టీ నేత సంజయ్ రౌత్ ప్రకటించారు. బీజేపీతో చర్చలంటూ జరిపితే అది ముఖ్యమంత్రి పదవిపైనే అని స్పష్టం చేశారు. ఆదివారం ముంబైలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేలను బెదిరించి వారి మద్దతు పొందేందుకు నేరగాళ్లను, ప్రభుత్వ సంస్థలను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. "ప్రమాణ స్వీకారం కోసం అతిథి గృహాలు, వాంఖెడె స్టేడియం, మహాలక్ష్మి

మిగతా 12వ పేజీలో...

పరంజ్యోతి

యోగం ముక్తికి మార్గం

యోగమంటే.. భగవంతునితో కలవడం. పరమాత్మతో జీవాత్మ లయం కావడం అని యాజ్ఞవల్క్యుడు చెప్పాడు. చిత్త వృత్తులను నిరోధింపజేసేది యోగమని పతంజలి చెప్పాడు. అన్ని విద్యల్లోకీ యోగ విద్య గొప్పదని శివసంహిత, ఘేరండ సంహిత చెప్పాయి. శరీర భ్రాంతిని వదిలిపెట్టి శాంతిని పొంది దైవత్వం వైపు నడిచేలా మానవులకు మార్గదర్శనం చేసేది యోగం. కానీ.. ఇప్పుడు యోగాను ఫిట్‌నెస్ ఫీట్‌గా చేసి సమాజంలోకి వదిలిపెట్టాం. యోగాను ఒక మార్కెట్‌గా మార్చేశాం. ఇప్పుడు యోగం పేరుతో మనం చేస్తున్నది అష్టాంగ యోగంలోని ప్రాణాయామ, ఆసనాలనే రెండు భాగాలు. ఇవి యోగ విద్యను గ్రహించేందుకు శరీరాన్ని సంసిద్ధం చేసే ప్రక్రియలు. శరీరంపై అభిమానాన్ని వదిలిపెట్టి అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలనే పంచకోశాలను ఒకదాని తర్వాత మరొకటిగా దైవత్వం వైపు నడిపించే మెట్లు. అందుకే.. 'పంచకోశాంతర స్థితా' అంటూ అమ్మవారికి పరమాత్మతత్వం ఆపాదించి స్తుతించాం.

ఇంతకీ యోగమంటే ఏమిటి? అది ఎన్ని రకాలు? దానివల్ల ఉపయోగాలేంటి? అంటే.. ఎన్నడూ నశించని పరమాత్మను ఆధారం చేసుకొని సాగే మహత్తర స్థితే యోగం. శివుడు పార్వతికి హఠయోగం చెప్పగా.. శ్రీ హిరణ్యగర్భుడు యాజ్ఞవల్క్య మహర్షికి బ్రహ్మ యోగోపదేశం చేశాడు. అలాగే శ్రీకృష్ణుడు అర్జునుడి ముఖంగా 'నారాయణ యోగం' బోధించాడు. ఈ మూడూ ఇప్పుడు లోకంలో పరివ్యాప్తమై ఉన్న యోగవిద్యలు. ఇవి మనుషుల్ని తరింపజేసే గొప్ప సాధనలు. వీటినే ఆధునిక కాలంలో ఎందరో యోగులు మనకు అందించారు. శ్రీరామకృష్ణులు, త్రిలింగ స్వామి, స్వామి వివేకానంద, పరమహంస యోగానంద వంటి మహనీయులు ఈ విద్యను ఆధునిక కాలానికి అందించారు. యోగం మనుషులకు యమనియమాలతో సత్ప్రవర్తన నేర్పి స్తుంది. ఆసన ప్రాణాయామాలతో ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. ప్రత్యాహార, ధ్యాన, ధారణ, సమాధి స్థితులతో పరంవైపు నడిపిస్తుంది. 'నీటి చుక్క సముద్రంలో ఉన్నంత వరకే ఉనికిని కలిగి ఉంటుంది. సముద్రం నుండి వేరుపడితే ఆవిరై నశిస్తుంది. అలాగే జీవుడు పరమాత్మలో కలిని ఉన్నంత వరకు ఆనందాన్ని అనుభవిస్తూ ఉంటాడు.' అన్నారు శ్రీరామకృష్ణులు. కాబట్టి మానవుడు నిరంతరం తన పనుల్లో మునిగి ఉన్నప్పటికీ దైవస్మరణ వదలకుండా ఆనందమయుడై ఉండాలి. అందుకు యోగం ఒక గొప్ప మార్గం.

వేదాన్త శ్రవణం కుర్యాన్మననం చోపపత్తిభిః
యోగేనాభ్యసనం నిత్యం తతో దర్శన మాత్మనః
(పద్మపురాణం)

వేదాంత విషయాలను శ్రవణం చేసేవాణ్ని స్థిరంగా మనసుతో దర్శిస్తూ, నిత్యం యోగం చేసే వారికి ఆత్మదర్శనం లభిస్తుంది అన్న శాస్త్ర వాక్యం నిత్యసత్యం. ఆత్మజ్ఞానానికి యోగమే మార్గం.

- డా. పి. భాస్కరయోగి

లోకం తీరు

వానా కాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
హైదరాబాద్	21.1	32.2
కర్నూలు	23.4	34.1
విశాఖపట్నం	23.8	31.8
విజయవాడ	24.0	33.0
గుంటూరు	25.4	34.4
నెల్లూరు	26.6	34.5

ఉత్తర కోస్తా దిశగా వాయుగుండం?

విశాఖపట్నం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల రెండోవారంలో ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిసా తీరం దిశగా వాయుగుండం రానుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రభావంతో 9వ తేదీ తర్వాత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఆదివారం పేర్కొంది. ఉత్తర అండమాన్ సముద్రం, మయన్మార్ పరిసరాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం.. రెండు మూడు రోజుల్లో పశ్చిమ వాయువ్యంగా పయనించి వాయుగుండంగా మారనుంది. ఈ క్రమంలో తీరం వెంబడి గంటకు 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని వెల్లడించింది. కాగా, రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఇక గోవాలో సేదదీరుతా

జమ్మూకశ్మీర్‌గా గవర్నర్‌గా ఎన్నో సమస్యలు, సవాళ్లు, ఉద్రిక్త పరిస్థితులను ఎదుర్కొన్నాను. వాటన్నింటినీ విజయవంతంగా అధిగమించాను. అటువంటి పరిస్థితుల నుంచి ఇప్పుడు బయటపడ్డాను. ఇక గోవాలో ప్రశాంతంగా సేదదీరుతా.

- సత్యపాల్ మాలిక్, గోవా గవర్నర్

ఢిల్లీలో కాలుష్యం తగ్గాలంటే ఇంద్రుడికి యాగం చేయాలి

రైతులు పంట వ్యర్థాలను కాల్చివేస్తూనే ఉంటారు. ఇది సహజమైన ప్రక్రియ. పర్యావరణ కాలుష్యానికి రైతులను విమర్శించడం దురదృష్టకరం. ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించడానికి ఇంద్రుడికి యాగం చేయాలి. యాగాల వల్ల వర్షాలు కురిసి ఢిల్లీలో కాలుష్యం తగ్గుతుంది.

- సునీల్ భరాలా, యూపీ మంత్రి

కాంతి పడగానే.. ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాలు

మసాచుసెట్స్, నవంబరు 3 : జీవ కణాలు, మెదడులోని న్యూరాన్ల కదలికలను కాంతితో నియంత్రించే సాంకేతికత 'ఆప్టో జెనెటిక్స్'. మధుమేహ(డయాబెటిస్) రోగుల్లో గ్లూకోజ్ మోతాదుకు అనుగుణంగా ఇన్సులిన్ ఉత్పత్తి అయ్యేలా చేసేందుకు అమెరికాలోని టఫ్ట్స్ వర్సిటీ శాస్త్రవేత్తలు ఈ పరిజ్ఞానాన్ని వినియోగించారు. నీలిరంగు కాంతి పడగానే క్రియాశీలంగా మారి ఇన్సులిన్ ఉత్పత్తిని రెండు, మూడురెట్లు పెంచగలిగేలా క్లోమంలోని బీటా కణాల్లో మౌలిక మార్పులు చేశారు. వాటిని ప్రయోగాత్మకంగా ఇంజెక్షన్ ద్వారా ఎలుకల్లోకి ప్రవేశపెట్టి, చర్మంపై నీలిరంగు పడేలా చేయగానే ఇన్సులిన్ ఉత్పత్తి పెరగడాన్ని గుర్తించారు.

పక్కా ప్లానింగ్‌తో.. మనిషిపై 'ప్లాస్మోడియం' దాడి

పెన్సిల్వేనియా, నవంబరు 3 : ఏటా ప్రపంచవ్యాప్తంగా 4.35 లక్షల మందిని బలిగొంటున్న మలేరియా పరాన్నజీవి(ప్లాస్మోడియం) దోమ లాలాజల గ్రంధిలో ఉండగానే భవిష్యత్ కార్యాచరణపై పక్కా ప్రణాళికతో ఉంటుందట!! మనిషి కాలేయంలోకి ప్రవేశించగానే తాను ఉత్పత్తి చేయాల్సిన హానికారక ప్రోటీన్లపైనా ముందస్తు అవగాహనతో ఉంటుందట!! అమెరికాలోని పెన్సిల్వేనియా వర్సిటీ శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో ఈవిషయం వెల్లడైంది. కాలేయంలోకి చేరగానే స్పోరోజైట్‌గా ఎలా రూపాంతరం చెందాలి? అక్కడ ఎన్ని వారాలు ఉండాలి ? రక్తంలోకి హానికారక మేరో జైట్లను ఎప్పుడు విడుదల చేయాలి? అనే దానిపైనా ముందస్తు సమాచారం ఉన్నవిధంగా ప్లాస్మోడియం కదలికలు ఉంటాయని గుర్తించారు.

డబ్బుంటేనే..

'దుర్గమ్మ'తో ఫొటో!

- సెల్‌ఫోన్ దాచుకుంటే రూ.5
- సూట్‌కేస్, బ్యాగేజీ దాచుకున్నా అంతే
- కేంద్రాల ఏర్పాటుకు టెండర్లు
- రాజగోపురం దగ్గర ఫొటోలకూ డబ్బులు వసూలు
- దీనికిగాను లైసెన్స్‌లకు హక్కులు
- మరింత భారంకానున్న ఇంద్రకీలాద్రి యాత్ర

విజయవాడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): బెజవాడ దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు ఆర్థిక భారం మరింత పెరగనుంది. సుదూర ప్రాంతాల నుంచి అమ్మను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సౌకర్యాల కల్పన ఎలా ఉన్నప్పటికీ.. వారి జేబులు గుల్లచేసే నిర్ణయాలు మాత్రం వేగంగా సాగిపోతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. తాజాగా భక్తులు సెల్‌ఫోన్లు, కెమెరాలు, ఇతర సామగ్రి భద్రపరుచుకునేలా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలవాలని దేవస్థానం ఈవో ఎంవీ సురేష్‌బాబు నిర్ణయించారు. ఒక్కొక్క వస్తువును భద్రపరిచినందుకు భక్తుల నుంచి రూ.5 చొప్పున వసూలు చేయనున్నారు. అదేవిధంగా దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు కొండపైనున్న చిన్న రాజగోపురం, మహామండపం ఏడో అంతస్థుపై పెద్ద రాజగోపురం ఎదురుగా స్పాట్ ఫొటోలు తీసుకునేందుకు ముచ్చటపడతారు. తమ సెల్‌ఫోన్లలో సెల్ఫీలు, లొకేషన్‌లను బంధించేందుకు పోటీ పడతారు. అయితే, ఇకపై ఇవేమీ కుదరవు. ఇక్కడ ఫొటో దిగేందుకు లైసెన్సు పొందిన ప్రైవేటు ఫొటోగ్రాఫర్లను ఆశ్రయించాలి. వారు చెప్పినంత సమర్పించి ఫొటోలు దిగాలి. ఇలా స్పాట్ ఫొటోలకు లైసెన్స్ హక్కు కల్పించనున్నారు. ఈ మేరకు 16 నెలల కాలపరిమితితో టెండర్లను ఆహ్వానించారు. వచ్చిన సీల్డు టెండర్లను ఈ నెల 13న తెరిచి అర్హులైన వ్యక్తులకు లైసెన్స్ హక్కు కట్టబెట్టనున్నారు. అమ్మవారి దేవస్థానంలో ఇంతకుముందు చెప్పుల స్టాండ్లు, క్లోక్ రూములు, సెల్‌ఫోన్లు, కెమెరాలు వంటి వస్తువులను భద్రపరిచే కౌంటర్లను ప్రైవేటు వ్యక్తులకు కాంట్రాక్టుకు ఇచ్చేవారు. ఈ కాంట్రాక్టులు దక్కించుకున్న వ్యక్తులు భక్తుల నుంచి అదనపు వసూళ్లు చేస్తున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో గత ఈవో కోటేశ్వరమ్మ దుర్గగుడిలో చెప్పులస్టాండ్లు, క్లోక్‌రూములు, సెల్‌ఫోన్లు భద్రపరిచే కౌంటర్లలో రుసుము వసూలును రద్దు చేశారు. అప్పటి నుంచి భక్తులు ఉచితంగానే తమ సామాన్లను భద్రపరచుకుంటున్నారు. ప్రస్తుత ఈవో సురేష్‌బాబు భక్తుల సెల్‌ఫోన్లు, కెమెరాలను భద్రపరిచేందుకు శాల్తీకి రూ.5 చొప్పున వసూలు చేయాలని మళ్లీ నిర్ణయించారు. భక్తులు స్పాట్ ఫొటోలు తీయించుకునేందుకు ప్రైవేటు ఫొటోగ్రాఫర్లకు లైసెన్సు హక్కులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

జైలులోనే ప్లాన్!

- విడుదలయ్యాక తోటి ఖైదీలతో భారీ చోరీ

శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/బలగ, నవంబరు 3: ఇప్పటి వరకూ 50 నేరాలకు పాల్పడ్డాడు. 18 కేసుల్లో జైలుకెళ్లొచ్చాడు. జైలులో తోటి ఖైదీలతో పరిచయం పెంచుకుని.. బయటకు రాగానే వారితో కలిసి కొత్త నేరాలకు పాల్పడడం అతని నైజం. ఇలా భారీ చోరీకి పాల్పడిన తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన పొన్నాడ రవికుమార్ (29) అలియాస్ వీరబాబును శ్రీకాకుళం పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. వీరబాబుకు జైలులో శ్రీకాకుళం నగరానికి చెందిన ఖైదీ మూగిపల్లి రాజు (24), విజయనగరానికి చెందిన మూగి శ్రీను (23)తో పరిచయం ఏర్పడింది. వారితో ఇళ్లల్లో దొంగతనాలు ఎలాచేయాలో జైలులోనే వ్యూ హాలు రచించాడు. వీరంతా జైలు నుంచి విడుదలయ్యాక అక్టోబరు 13న శ్రీకాకుళంలో వాంద్రంగి శ్రీనివాసరావు ఇంట్లోకి చొరబడి 35 తులాల బంగారం, కిలోన్నర వెండి, రూ. 7లక్షల నగదు దోచుకెళ్లారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళంలో ఆదివారం వేకువజామున అనుమానాస్పదంగా తిరుగుతున్న రవిశంకర్, రాజు, శ్రీనులను శ్రీకాకుళం పోలీసులు పట్టుకున్నారు. విచారణలో ఆ చోరీకి పాల్పడింది తామేనని ఒప్పుకున్నారు. నిందితుల నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు.

తలపై కర్రతో కొట్టి.. కన్నతల్లిని చంపి..

నెల క్రితం కొడుకు హత్యకు తల్లి విఫలయత్నం
ఆమె బెయిల్‌పై విడుదలైన మర్నాడే దుశ్చర్య

తాడ్వాయి, నవంబరు 3: వివాహేతర సంబంధాలతో పరువు తీయడమే కాకుండా.. తననే చంపేందుకు ప్రయత్నించిందనే ఆగ్రహంతో కన్నతల్లిని హత్య చేశాడో తనయుడు. తెలంగాణలోని కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం చిట్యాల గ్రామంలో ఆదివారం జరిగిందీ ఘటన. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఘనపురం సాయవ్వ (47)కు భర్త, కుమారుడు మల్లేశ్, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. సాయవ్వకు వివాహేతర సంబంధాలు ఉండటంతో మల్లేశ్ పలుమార్లు మందలించాడు. కొడుకును అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించిన సాయవ్వ.. బండరాళ్లను పేల్చే పేలుడు పదార్థాలతో మల్లేశ్‌ను చంపాలని పథకం వేసింది. ఈ పనిని అక్టోబరు 3న గ్రామానికి చెందిన నిట్టు నర్సింగ్‌రావు, ఎరుకల సాయిలు, నిట్టు రాంచందర్, ఒడ్డెర సత్యానికి పురమాయించింది. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో ఆ ముగ్గురినీ రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న సాయవ్వను మరికొద్ది రోజులకు అదుపులోకి తీసుకున్నారు. కాగా సాయవ్వ శనివారం బెయిల్‌పై విడుదలైంది. ఆదివారం ఉదయం సాయవ్వ ఇంట్లో కొడుకుతో గొడవపడింది. కోపోద్రిక్తుడైన మల్లేశ్ కర్రతో ఆమె తలపై గట్టిగా కొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఎల్లారెడ్డి డీఎస్పీ శశాంక్‌రెడ్డి, సదాశివనగర్ సీఐ వెంకటి ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. ఎస్సై కృష్ణమూర్తి కేసు నమోదు చేశారు.

సాయవ్వ (ఫైల్)

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను సత్కరిస్తున్న రాజేంద్రప్రసాద్, సుమన్ తదితరులు

ఢిల్లీలో తెలుగు అకాడమీ

- తెలుగు భాష, సంస్కృతిని ప్రోత్సహిస్తాం
- ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ప్రకటన

న్యూఢిల్లీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష, సంస్కృతిని మరింత ప్రోత్సహించేందుకు వీలుగా ఢిల్లీలో తెలుగు అకాడమీని కొత్తగా ఏర్పాటు చేయనున్నట్లు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రకటించారు. ఆదివారం ఇక్కడి మావలంకర్ ఆడిటోరియంలో ఢిల్లీ తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన 32వ వార్షిక సాంస్కృతిక వేడుకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఢిల్లీలో నివసించే తెలుగు ప్రజలంతా తనను ఆదరించి, గౌరవిస్తున్నందుకు గర్వపడుతున్నానన్నారు. ఇక్కడి తెలుగువారి జనాభా లక్షల సంఖ్యలో ఉన్నందువల్ల వారి మాతృభాషను, సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అనేక రాష్ట్రాల ప్రజలతో ఢిల్లీ నగరం మినీ ఇండియాగా మారిందన్నారు. తమ ప్రభుత్వం ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడంతో ఈ ఏడాది ఇప్పటివరకు 842మందికి డెంగీ వ్యాధి సోకిందని, వారంతా సంపూర్ణ ఆరోగ్యంతో బయటపడ్డారని వివరించారు. ఢిల్లీలో వాయుకాలుష్యం ప్రమాదకరంగా మారిందని, దీనిపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని కేజ్రీవాల్ అన్నారు. కాలుష్య నివారణకు అవసరమైతే కేంద్రంతో చర్చించి త్వరలోనే పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. ఢిల్లీ తెలుగు అకాడమీ నేతలు మాడభూషి శ్రీధర్, ఎన్‌వీఎల్ నాగరాజు ఆధ్వర్యంలో కేజ్రీవాల్‌ను ఘనంగా సన్మానించారు.

పత్రికా స్వేచ్ఛను హరించేందుకే జీవో

- వెంటనే ఉపసంహరించుకోకుంటే ప్రజా ఉద్యమం
- కాంగ్రెస్, ప్రజాసంఘాలు, పత్రికా ప్రతినిధుల ధర్నా

కడపలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, మీడియా ప్రతినిధులు

కడప(సిటీ), నవంబరు 3: పత్రికా స్వేచ్ఛను హరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను వెంటనే ఉపసంహరించుకోకుంటే ప్రజాఉద్యమం తప్పదని కాంగ్రెస్ నాయకులు, ప్రజాసంఘాల నేతలు, పత్రికా ప్రతినిధులు హెచ్చరించారు. జీవో 2430 ఉపసంహరణకు డిమాండ్ చేస్తూ ఆదివారం కాంగ్రెస్ పార్టీ కడప నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించింది. ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్ఏ సత్తార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంలా ఉన్న మీడియాను అణగదొక్కి తన చెప్పుచేతల్లో పెట్టుకోవాలని సీఎం జగన్ ఈ జీవో తెచ్చారన్నారు. వెంటనే తప్పును సరిదిద్దుకుని జీవోను ఉపసంహరించుకోకుంటే జగన్ దుర్మార్గంపై అన్ని వర్గాలు తిరుగుబాటు చేస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి జకరయ్య, సంఘ సేవకులు సలావుద్దీన్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మంచు.. మరో లోకం!

చుట్టూ పచ్చని గిరి శిఖరాలు.. దిగువన మరో లోకాన్ని తలపించే మంచు అందాలు.. ఇదీ.. విశాఖ ఏజెన్సీ లంబసింగిలోని చెరువులవేనం వద్ద ఆవిష్కృతమైన దృశ్యాలు. శీతాకాలం ప్రవేశంతోనే ఇక్కడి ప్రకృతి అందాలు ద్విగుణీకృతమయ్యాయి. అందులోనూ మంచుతెమ్మెరలు పర్యాటకులను మరింతగా ఆకరిస్తున్నాయి. కొండపైనుంచి చూస్తే లోయ మొత్తం వెండిమబ్బులతో నిండి సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. మూడు రోజుల నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో లంబసింగి, చెరువులవేనం ప్రాంతాల్లో మంచుదుప్పట్లు పరుచుకోగా, ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకుల తాకిడి అధికమైంది.

- చింతపల్లి (విశాఖపట్నం జిల్లా)

చాగంటితో వివాదాల్లేవు

- వారు ధర్మరాజు.. నేను అర్జునుణ్ని
- ప్రవచనకర్త గరికిపాటి స్పష్టీకరణ
- ఆయనో అక్షయపాత్ర: హరీశ్‌రావు
- చాగంటికి ఘనంగా 'గురుసత్కారం'
- 'ధార్మికవరేణ్య' బిరుదు ప్రదానం

చాగంటి కోటేశ్వరరావుకి స్వర్ణకంకణ ధారణ చేసి నమస్కరిస్తున్న హరీశ్‌రావు

గరికపాటి

ఆబిడ్స్/హైదరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలుగునాట ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరియడంలో కీలక పాత్ర చాగంటి కోటేశ్వరరావుదేనని ప్రముఖ ప్రవచనకారుడు, మహాసహస్రావధాని గరికిపాటి నరసింహారావు అన్నారు. "ప్రవచనాలు చెప్పడంలో ఒక్కొక్కరిదీ ఒక్కో విధానం. చాగంటివారిది రక్తి కట్టించే విధానం. నాది రక్తం ఉప్పొంగించే విధానం. సమాజానికి రెండూ అవసరమే" అన్నారు. 'వారు మహానుభావులు.. వివాదము లేదిక నాకు వారితో..' అని పద్యరూపంలో హృద్యంగా చెప్పారు. "విశ్వామిత్రుడు, వశిష్టుడు ఇద్దరూ మహర్షులే. ఇద్దరూ బ్రహ్మర్షులే. కానీ.. వారిది వశిష్ఠ గోత్రం, నాది విశ్వామిత్ర గోత్రం. కొంచెం తేడా ఉంటుంది. పైగా వారు ప్రవచన చక్రవర్తి. నా బిరుదం ప్రవచన కిరీటి. నేను బాణాలు వేస్తాను. నిస్సందేహంగా చక్రవర్తి వారే. వారే ధర్మరాజు. నేనే అర్జునుణ్ని. అర్జునుడు ఎంత వీరుడైనా చక్రవర్తి ధర్మరాజే. ఆ ధర్మరాజును ఆ రకంగా గౌరవించడమే అర్జునుడికి ఆనందం" అని ఇద్దరి స్వభావాల మధ్య ఉండే తేడాను స్ఫురింపజేసేలా గరికిపాటి చమత్కరించారు. 'ఈ రకంగానైనా తెలుగునాట రెండు రాష్ట్రాల్లోనూ ప్రవచనం ప్రభంజనమై చైతన్యాన్ని నింపాలనేది నా ఆశ' అన్నారు. దర్శనమ్ ఆధ్యాత్మిక వార్త మాసపత్రిక 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆ పత్రిక నిర్వాహకులు మరుమాముల వెంకటరమణశర్మ అధ్యక్షతన ఆదివారం రాత్రి నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని లలిత కళా తోరణంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుకు 'గురుసత్కారం' నిర్వహించారు. ఈ సందర్భంగా చాగంటికి తెలంగాణ మంత్రి హరీశ్‌రావు స్వర్ణ కంకణాన్ని తొడిగి, 'ధార్మికవరేణ్య' బిరుదును ప్రదానం చేశారు. అనంతరం 'శారదా జ్ఞానపుత్ర' గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ చాగంటి లాంటి ఆధ్యాత్మిక గురువులు అరుదుగా ఉంటారన్నారు. ఆయన అక్షయ పాత్రలాంటి వారని, ప్రవచనాలు చెప్పిన కొద్దీ ఆయన జ్ఞానం మరింత పెరుగుతుందన్నారు. ప్రతి ఇంట్లో వేకువజామునే సూర్యకిరణాలు పడినట్లుగా చాగంటి ప్రవచనాలు నిత్యం వినిపిస్తుంటాయన్నారు. రామాయణ, మహాభారత గ్రంథాలను సామాన్యునికి సైతం అర్థమయ్యేలా ఆయన చేసే ప్రసంగాలు ప్రతి ఒక్కరినీ కట్టిపడేస్తాయన్నారు. చాగంటి ప్రవచనాలు గంగా ప్రవాహంగా నిరంతరం ప్రవహించాలని ఆకాంక్షించారు. సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మానవీయ విలువలు, సనాతన ధర్మం, గురువులకు విద్యార్థులు ఇచ్చే విలువలు వంటివి చాగంటి ప్రవచనాల్లో ఉంటాయన్నారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి మాట్లాడుతూ చాగంటికి చేసేది సత్కారం కాదు సత్కార్యం అన్నారు. పద్మవిభూషణ్ వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ యుగానికో, శతాబ్దానికో చాగంటి లాంటి మహనీయులు పుడతారన్నారు. అంతకుముందు చాగంటి, ఆయన సతీమణి సుబ్రహ్మణ్యేశ్వరిని పల్లకిలో ఊరేగిస్తూ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వేదిక వద్దకు తీసుకువచ్చారు. సన్మాన కార్యక్రమానికి హాజరైన అతిథుల ప్రసంగాల అనంతరం చాగంటి ప్రవచనంతో సభను ముగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీమంత్రి ఎస్.వేణుగోపాలాచారి, సినీ రచయిత, నటుడు తనికెళ్ల భరణి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలం, నవంబరు 3: కార్తీకమాసం మొదటి ఆదివారం శ్రీగిరి క్షేత్రం భక్తులతో నిండిపోయింది. భ్రమరాంబ మల్లికార్జునుల దర్శనానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామునే పాతాళగంగలో రద్దీ కనిపించింది. పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కార్తీక దీపాలను వెలిగించి నదిలో వదిలారు. ఆలయం ముందు పలువురు భక్తులు లక్ష ఒత్తుల నోములు నోచుకున్నారు. స్వామి, అమ్మవారికి వేకువజామున సుప్రభాత, ప్రాతఃకాల పూజలు నిర్వహించి.. మహా మంగళహారతి పట్టారు. 4.30 గంటల నుంచి దర్శనానికి, ఆర్జిత సేవలకు అనుమతించారు. సుమారు 70 వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ఉంటారని అధికారులు తెలిపారు. కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతికి ఏర్పాట్లుచేశారు.



వైభవంగా మహారుద్రాభిషేకం

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం విశాఖ సాగర తీరంలో ఆదివారం నిర్వహించిన మహారుద్రాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. జ్ఞానప్రసన్న స్వామి నేతృత్వంలో స్వామి సేవకులు విశేష అభిషేకాలు నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు కొనసాగిన ఈ కార్యక్రమంతో బీచ్‌రోడ్డులో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ముందుగా పవిత్ర జలాలతో లింగానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం గుంటూరు అమ్మ ఆశ్రమం సేవకుల ఆధ్వర్యంలో అనాథ శవాల చితాభస్మంతో మహాభస్మాభిషేకాన్ని నిర్వహించారు. అదేవిధంగా అష్టోత్తర నామార్చన, ధూప సేవ, హారతి చేపట్టారు.

11న కలెక్టరేట్ల ముట్టడి: కౌలు రైతుసంఘం

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): భూమి లేని కౌలురైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రైతుభరోసా వర్తింపజేయాలంటూ కలెక్టరేట్లను ముట్టడించనున్నారు. ఈనెల 11న అన్ని జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాలను ముట్టడించాలని ఏపీ కౌలురైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ రంగారావు, పి.జమలయ్య, రాష్ట్ర కన్వీనర్ ఎం.యలమందారావు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. భూయజమాని సంతకంతో ముడి పెట్టడం వల్ల కౌలు రైతులు రైతుభరోసా పొందలేకపోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వమే గ్రామసభలు నిర్వహించి, నేరుగా పంట సాగుదారు హక్కు పత్రాలు(సీసీఆర్‌సీ) ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలురైతుల సమస్యలపై ఈనెల 8న విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు.

రైతుకు ఖర్చు తగ్గించే ఇఫ్కో నానో ఎరువులు

- రాష్ట్రస్థాయిలో తొలిసారిగా మునగోడు పీఏసీఎస్‌లో ఆవిష్కరణ

అమరావతి, నవంబరు 3: దేశంలో రైతన్నలకు పెట్టుబడి ఖర్చులు తగ్గించేందుకు ఇఫ్కో నూతనంగా తయారుచేసిన నానో ద్రవరూప ఎరువులను గుజరాత్‌లోని కాండ్ల ఎరువుల కర్మాగారంలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ థోమర్ ఆదివారం ఉదయం ప్రారంభించారు. రాష్ట్రంలో తొలిసారి గుంటూరు జిల్లా అమరావతి మండలం తురకవారిపాలెం గ్రామంలోని మునగోడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఆవిష్కరించారు. రాష్ట్రస్థాయిలో ఈ ఖరీఫ్ సీజన్‌లో రూ.6 కోట్ల విలువైన ఎరువుల వ్యాపారం నిర్వహించి ప్రథమస్థానంలో నిలిచిన ఈ సొసైటీలో నానో ఎరువులు ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఇఫ్కో ఏపీ సేల్స్ మేనేజరు మాంజీ, జిల్లా ఇఫ్కో సీనియర్ మేనేజరు రఘుసురేంద్ర, సొసైటీ ఛైర్‌పర్సన్ జెట్టి పున్నమ్మ, కాసు చినపరెడ్డి, మేడా పున్నయ్య, సీఈఓ సాంబశివరావులు పాల్గొన్నారు. ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అరలీటరు నానో న్యూట్రీషియన్ వాడితే రెండు బస్తాలు ఎరువుకు సమానమని మాంజీ తెలిపారు. భూసారాన్ని పరిరక్షించేందుకు ఈ నానో ఎరువును తయారు చేసినట్లు చెప్పారు. అనంతరం రైతులకు కాపర్, జింకును ఉచితంగా పంపిణీ చేశారు.

రాజ్యసభకు యాదవ నేతను పంపాలి

- అఖిల భారతీయ రాష్ట్ర యాదవ మహాసభ డిమాండ్

కాకినాడ సిటీ, నవంబరు 3: యాదవ సామాజిక వర్గ నేతను ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు పంపేందుకు రాజకీయపార్టీలు నిర్ణయం తీసుకోవాలని అఖిల భారతీయ రాష్ట్ర యాదవ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మహాసభ జాతీయ అధ్యక్షుడు లాకా వెంగళరావు మాట్లాడుతూ యాదవ కార్పొరేషన్‌కు రూ.2 వేల కోట్లు నిధులను కేటాయించాలని, నామినేటెడ్ పోస్టులలో జనాభా దామాషా పద్ధతిన యాదవులకు రిజర్వేషన్లు కేటాయించాలని కోరారు. 5 ఎమ్మెల్సీ పదవులను యాదవ సామాజిక వర్గానికి కేటాయించాలని సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు, మేకలు కాపలాదారుల కుటుంబాలకు రూ.10 లక్షలు నష్ట పరిహారంగా ఇవ్వాలని, టీటీడీ పాలకమండలిలో యాదవులకు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

మిగిలేది పొడే!

శిథిలావస్థకు చేరిన వేలాది రిజిస్ట్రేషన్ రికార్డులు

- డిజిటలైజ్ చేయకుంటే భూముల సమాచారం గల్లంతు
- నిషేధిత ఆస్తుల జాబితాలో తప్పులూ సవరించాలి
- విద్యుత్, స్టేషనరీ, ఇతరత్రా చెల్లింపుల మాటేలేదు

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా రణస్థలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లిన ఓ వ్యక్తి... తమ భూమికి సంబంధించి 1983 కంటే ముందు రికార్డు కావాలని కోరారు. సిబ్బంది ఇండెక్స్ రికార్డులు తిరగేశారు. అప్పటికే అవి కొంత చినిగిపోయి, కాగితాలు పొడి అయిపోయి ఉన్నాయి. దీంతో రికార్డు ఇవ్వడం సాధ్యం కాదంటూ చేతులెత్తేశారు. ఇది ఆ ఒక్క కార్యాలయం సమస్య కాదు. రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. 1983కు ముందున్న రికార్డులన్నీ మాన్యువల్‌గానే భద్రపరిచారు. ఆ తర్వాత క్రమంగా కంప్యూటరైజ్డ్ రికార్డులు వచ్చాయి. 1983కు ముందున్న రికార్డులన్నీ చేతిరాతలోనే ఉంటాయి. వాస్తవానికి ఏదైనా ఆస్తి, స్థలం, భూమికి సంబంధించిన మూలాలకు వెళ్లాలంటే ఆ రికార్డులే కీలకం. ఒక ఆస్తి వివాదంలో పడినా, బ్యాంకు రుణం కావాలన్నా... ప్రభుత్వానికి ఫలానా భూమి గురించిన మొత్తం సమాచారం కావాలన్నా వాటిలోని ఇండెక్స్ రికార్డులు చాలా కీలకం. అప్పట్లో ప్రతి రిజిస్ట్రార్ కార్యాలయంలోను రిజిస్టర్ అయిన వేలకొద్దీ డాక్యుమెంట్లను కొన్ని వాల్యూమ్‌లుగా భద్రపరిచారు. ఏ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఏ వాల్యూమ్‌లో ఉందో సూచిస్తూ ఒక ఇండెక్స్ రికార్డును నిర్వహించారు. దాని ప్రకారం కోరినవారికి సదరు డాక్యుమెంట్‌ను జిరాక్స్ తీసి ఇస్తారు. అలాంటి కీలకమైన ఇండెక్స్ రికార్డులు ప్రస్తుతం చిరిగిపోయి, చాలా వరకు అర్థంకాని స్థితిలో ఉన్నాయి. ఇప్పటికైనా వీటిని డిజిటలైజేషన్ చేయకుంటే భవిష్యత్ తరాలకు కీలకమైన భూమి రికార్డులు అందించే పరిస్థితి ఉండదు. గతంలో కృష్ణాజిల్లా గన్నవరంతో పాటు మరికొన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పైలట్ ప్రాజెక్టుగా రికార్డులను డిజిటలైజ్ చేసే ప్రక్రియ చేపట్టారు.

సొంత భవనాల్లేవు

రాష్ట్రంలో చాలావరకు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సొంత భవనాల్లేవు. ఉన్నవాటిలో చాలా వరకు పాతబడిపోగా, కొన్ని శిథిలావస్థకు చేరాయి. పలుచోట్ల అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ప్రతినెలా కనీసం రూ.6-10వేల వరకు విద్యుత్ బిల్లు వస్తుంటుంది. కార్యాలయంలో ఉపయోగించే కాగితాలు, పెన్నులు, ఇతరత్రా స్టేషనరీ ఖర్చులు అదనం. మొత్తంగా అద్దె, విద్యుత్ బిల్లులు, స్టేషనరీ తదితరాలకు నెలకు రూ.30వేల వరకు అవుతుంది. ఇందులో ప్రభుత్వం చెల్లించేది నామమాత్రమేనని, మిగిలినదంతా తామే భరించాల్సి వస్తోందని పలువురు సబ్ రిజిస్ట్రార్లు వాపోతున్నారు.

నిషేధిత జాబితా కీలకం

ప్రభుత్వం నవంబరు 1నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానుంది. దీనికి రికార్డులు అప్‌డేట్‌గా ఉండడం అత్యంత కీలకం. ప్రభుత్వ, దేవదాయ, అసైన్డ్, వక్ఫ్ తదితర భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు వీల్లేదు. ఆయా భూముల సర్వే నంబర్లన్నింటినీ నిషేధిత జాబితాలో పెడతారు. అయితే ప్రస్తుతం ఈ జాబితా అంత కచ్చితంగా లేదు. కొన్నిచోట్ల ప్రభుత్వం పట్టాలిచ్చినా, లేఅవుట్లు వేసి అమ్మినా వాటిని ఇంకా నిషేధిత జాబితాలోనే చూపిస్తున్నారు. ఈ జాబితాను పూర్తిస్థాయిలో అప్‌డేట్ చేస్తే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు విజయవంతమై ప్రజలకు కార్యాలయాల దగ్గర పడిగాపులు పడే దుస్థితి తప్పుతుంది.

ప్రభుత్వ మెప్పు కోసమే.. అక్రమంగా ఏసీబీ కేసులు!

- ఉన్నతస్థాయి కమిటీతో విచారించాలి
- బాధితుల సంఘం డిమాండ్

విజయవాడ సిటీ, నవంబరు 3: ఏసీబీ అధికారులు గత ప్రభుత్వంలో నాయకుల మెప్పు, టార్గెట్ల కోసమే తమపై అక్రమంగా కేసులు నమోదు చేశారని, వాటిపై ఉన్నతస్థాయి కమిటీతో విచారించిన తర్వాతే చర్యలు తీసుకోవాలని ఏసీబీ కేసుల బాధితులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి వచ్చిన ఏసీబీ కేసుల బాధితులు విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎటువంటి ఆరోపణలు లేకపోయినా ఏసీబీ మాజీ డీజీ ఠాగూర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని అనేక దాడులు నిర్వహించారని, ఉద్యోగులను, వారి బంధువులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడకపోయినా మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేశారన్నారు. గతంలో ఏసీబీ దాడులు చేసినపుడు కేసులు మాత్రమే నమోదు చేసేవారనీ, గత ఐదేళ్లలో అరెస్టు కూడా చేసి విచారణ పూర్తయ్యే వరకు అలానే ఉంచారని పేర్కొన్నారు. ఈ చర్యలతో సుమారు 345 మంది ఉన్నత అవకాశాలు కూడా కోల్పోయారన్నారు. ఏసీబీ లోపాలను ఎత్తిచూపిన డిప్యూటీ సీఎం పిల్లి సుభాష్‌చంద్రబోస్‌కు అభినందనలు తెలిపారు. ఏసీబీ నివేదికపై ఆధారపడకుండా తమ వద్ద ఉన్న ఆధారాలను కూడా పరిశీలించి, తప్పులుంటే చర్య తీసుకోవాలని, లేని పక్షంలో కేసులు కొట్టివేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఏపీలో అరాచక పాలన సాగుతోంది

- దళిత బహుజన పార్టీ

కవాడిగూడ/హైదరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో అరాచక పాలన సాగుతోందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. ప్రభుత్వ ఇసుక పాలసీతో భవన నిర్మాణ కార్మికులు, అనుబంధ కార్మికులకు ఉపాధి లేకుండాపోయిందని, ఇప్పటివరకు 11 మంది కార్మికులు ఆత్మహత్యలుచేసుకున్నారని, ఇవన్నీ ప్రభుత్వ హత్యాలుగా భావించాలని ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఇసుక క్వారీలను వెంటనే తెరిపించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని, ఆత్మహత్య చేసుకున్న కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



యానాం.. పుదుచ్చేరిలోనే ఉండాలి

- ఏపీలో విలీనం చేయాలని ఎప్పుడూ కోరలేదు
- అలాంటి ప్రతిపాదన ఉంటే అడ్డుకుంటా
- పుదుచ్చేరి మంత్రి మల్లాడి కృష్ణారావు

యానాం, నవంబరు 3: యానాం ఎప్పటికీ కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలోనే ఉండాలని పుదుచ్చేరి ఆరోగ్య మంత్రి మల్లాడి కృష్ణారావు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. తూర్పుగోదావరి జిల్లా సమీపాన ఉన్న యానాం నియోజకవర్గాన్ని ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసేందుకు తాను ప్రయత్నిస్తున్నట్టు లెఫ్టినెంట్ గవర్నర్‌తోపాటు మరికొందరు ఆరోపిస్తున్నారని, ఇది పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. ఏపీలో విలీనాన్ని తానెప్పుడూ కోరలేదని, ఎక్కడా చెప్పలేదని వివరించారు. యానాం ఎప్పటికీ కేంద్రపాలిత ప్రాంతంలో ఉండాలనే గత 30 ఏళ్లగా పోరాడుతున్నానని, ఇందుకోసం రాష్ట్రపతి, సుప్రీంకోర్టు వరకు కూడా వెళ్లానని చెప్పారు. ఏపీలో విలీన ప్రతిపాదనే నిజమైతే అడ్డుకుంటానని స్పష్టం చేశారు. అవసరమైతే ఏపీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిసి వివరిస్తానన్నారు.

తండ్రీకూతుళ్ల మృతదేహాలు.. సత్యసుకీర్తి, పురుషోత్తమరాజు (ఫైల్)

బిడ్డా... నీ వెంటే నేనూ!

- కుమార్తె మరణాన్ని తట్టుకోలేక ఆగిన తండ్రి గుండె

కశింకోట(విశాఖపట్నం జిల్లా), నవంబరు 3: కుమార్తెను అల్లారుముద్దుగా పెంచాడు...వివాహం జరిపించాడు....సంతోషంగా కాపురం చేసుకుంటుంటే మురిసిపోయాడు...కానీ, ఇంతలో విధి పగబూని తన బంగారుతల్లిని దూరంచేయడంతో తట్టుకోలేక రోదించి రోదించి చివరికి ఆమె వెనుకే అనంతలోకాలకు పయనమయ్యాడు. హృదయాలను ద్రవింపజేసే విషాదకరమైన ఈ సంఘటన విశాఖ జిల్లాలో మండల కేంద్రమైన కశింకోటలో జరిగింది. వివరాలు.... కశింకోట పోస్టాఫీసువీధిలో నివాసముంటున్న సుంకరణం పురుషోత్తమరాజు అలియాస్ దత్తుబాబు(69), కృష్ణవేణి దంపతులకు కుమార్తె సత్యసుకీర్తి(30), కుమారుడు శేషు ఉన్నారు. కుమార్తెను ఎనిమిదేళ్ల కిందట విశాఖకు చెందిన చోడవరపు రమేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆమె కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. పరిస్థితి తీవ్రంగా మారడంతో శుక్రవారం విశాఖ కేజీహెచ్‌లో చేర్పించారు. చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతిచెందింది. రమేశ్‌కు ఎవరూ లేకపోవడంతో సత్యసుకీర్తికి కశింకోటలో అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించుకుని రాత్రి 12 గంటల ప్రాంతంలో మృతదేహాన్ని ఇక్కడకు తీసుకువచ్చారు. కుమార్తె మృతదేహాన్ని చూసిన పురుషోత్తమరాజు కన్నీరుమున్నీరయ్యాడు. రాత్రంతా విలపిస్తూనే ఉన్నాడు. దీంతో తీవ్ర ఉద్వేగానికి లోనవడంతో ఆయనకు ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో గుండెపోటు వచ్చింది. స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడు వచ్చి చూసి అప్పటికే మృతిచెందినట్టు చెప్పారు. ఆదివారం ఉదయం తండ్రీకూతుళ్ల మృతదేహాలకు కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

డెంగీతో ఇద్దరు మృతి

పాలకొల్లు టౌన్/శంఖవరం, నవంబరు 3: డెంగీ బారిన పడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇద్దరు మృతిచెందారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన కోట అన్నామణి(55)కి నాలుగు రోజుల క్రితం జ్వరం రాగా ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం ఉదయం మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా శంఖవరం గ్రామం అంబేడ్కర్ కాలనీకి చెందిన రాయి తాతాజీ(29) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఆయనను మూడు రోజుల క్రితం కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

కారు పల్టీ.. ఐదుగురు దుర్మరణం

ప్రమాదస్థలి వద్ద దృశ్యం

- డివైడర్‌ను ఢీకొట్టి.. మరో కారుతో ఢీ
- జగ్గయ్యపేట వద్ద ఘటన
- దుర్గమ్మ దర్శనానికి వస్తూ మృత్యువాత
- మృతులంతా తెలంగాణ వాసులే

బంజారాహిల్స్/హైదరాబాద్/జగ్గయ్యపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్త కారు కొన్నానన్న సంతోషం ఆ డ్రైవర్‌ది.. కోరుకున్నట్లుగానే ఆడపిల్ల పుట్టిందనే ఆనందం ఇంకొకరిది. ఇద్దరూ విజయవాడ కనకదుర్గమ్మవారిని దర్శించుకోవాలనుకున్నారు. మరో స్నేహితుడికి చెబితే ఆదివారం కావడంతో తనూ సిద్ధమయ్యాడు. ముగ్గురు కలిసి కొత్త స్విఫ్ట్ కారులో బెజవాడ బయలుదేరారు. ప్రయాణికులుగా మరో ఇద్దరిని కారులో ఎక్కించుకున్నారు. అయితే.. వారి ఈ ప్రయాణం ఘోర విషాదంగా ముగిసింది. అతివేగంతో దూసుకెళుతున్న కారు, డివైడర్‌ను ఢీకొని అంతే వేగంతో అవలివైపు పల్టీకొట్టి.. మరో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్విఫ్ట్ కారులోని ఐదుగురూ మృత్యువాతపడ్డారు. కృష్ణాజిల్లా జగ్గయ్యపేట వద్ద ఆదివారం ఉదయం ఈ ప్రమాదం సంభవించింది. పోలీసులు, మృతుల బంధువుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ నవనిర్మాణ్‌నగర్‌కు చెందిన నారపోగు గోపాల్ కారు డ్రైవర్. ఇటీవలే స్విఫ్ట్ కారును కొన్నాడు. విజయవాడ వెళ్లి అమ్మవారిని దర్శించుకోవాలనుకున్నాడు. ఇదే విషయాన్ని స్నేహితుడైన నవనిర్మాణ్‌నగర్‌కే చెందిన మన్సూర్‌కు చెప్పాడు. మెకానిక్‌గా పనిచేస్తున్న మన్సూర్‌కు ఏడాది క్రితమే పెళ్లయింది. నెల క్రితం అతడికి ఆడపిల్ల పుట్టింది. అందుకే గోపాల్ మాటను కాదనలేదు. బిడ్డ పుట్టిన సంతోషాన్ని దైవదర్శనం ద్వారా మరింత గొప్పగా జరుపుకునేందుకు సిద్ధమయ్యాడు. ఇద్దరు కలిసి పటేల్‌నగర్‌కు చెందిన కోటేశ్వరరావు అనే స్నేహితుడికి చెప్పడంతో అతడూ వస్తానన్నాడు. ప్రయాణికులుగా ఫిల్మ్‌నగర్‌కు చెందిన ఏసీ మెకానిక్ పోతుల భీంరెడ్డిని, మహబూబ్‌నగర్ జిల్లా దౌలతాబాద్ మండలం అంతారానికి చెందిన మోట్లంపల్లి భీంరెడ్డిని ఎక్కించుకున్నారు. గోపాల్ కారు నడుపుతుండగా.. మన్సూర్ అతడి పక్కన కూర్చున్నాడు. మిగతా ముగ్గురు వెనుక సీట్లో కూర్చున్నారు. వీరు ప్రయాణిస్తున్న కారు ఉదయం 8గంటల సమయంలో జగ్గయ్యపేటకు దగ్గర్లోని గరికపాడు చెక్‌పోస్ట్ సమీపానికి రాగానే అదుపు తప్పింది. డివైడర్‌ను ఢీకొట్టి.. అవలివైపు ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోపాల్, మన్సూర్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. మిగతా ముగ్గురిని జగ్గయ్యపేట ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పోతుల భీంరెడ్డి, మోట్లంపల్లి భీంరెడ్డి మృతిచెందగా.. విజయవాడ ఆస్పత్రిలో కోటేశ్వరరావు చనిపోయాడు. కోదాడవైపు వెళుతున్న కారులో పులిచింతల ప్రాజెక్టు విద్యుత్తు కేంద్రం ఉద్యోగి.. సూర్యాపేట జిల్లాకు చెందిన గోపీ అనే యువకుడు.. మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డారు. స్విఫ్ట్ కారు అతివేగం వల్లే ప్రమాదం సంభవించిందని నందిగామ డీఎస్పీ జీవీ రమణమూర్తి చెప్పారు.

గిరిజన దంపతుల విషాదాంతం!

- భార్య అంత్యక్రియల తర్వాత.. చెరువులో పడి భర్త మృతి

రాజవొమ్మంగి, నవంబరు 3: అస్వస్థతతో ఓ గిరిజన బాలింత మృతి చెందింది. ఆమె దహన సంస్కారాలు పూర్తి చేసి.. తిరిగి వస్తూ చెరువులో స్నానానికి దిగిన భర్త కూడా మృతి చెందిన ఘటన తూర్పుగోదావరి జిల్లా రాజవొమ్మంగి మండలం బొరుగుపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లోతా దేవుడు(30) మల్లేశ్వరి(25) దంపతులకు ముగ్గురు మగ సంతానం. శనివారం రాత్రి ఊపిరందక మల్లేశ్వరి అస్వస్థతకు గురైంది. దీంతో ఆమెను రాజవొమ్మంగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఆదివారం ఆమె అంత్యక్రియలు పూర్తి చేసిన తర్వాత, హిందూ సంప్రదాయ ప్రకారం చెరువులో స్నానం చేసేందుకు భర్త దేవుడు అక్కడి పాత చెరువులో దిగగా ప్రమాదవశాత్తూ జారి పడి మృతి చెందాడు. తల్లిదండ్రుల అకాల మరణంతో ముగ్గురు చిన్నారులు అనాథలయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'అయోధ్య' తీర్పు ఎలా ఉన్నా ఓకే!

- యూత్ వెల్ఫేర్, మైనారిటీ సమితి వెల్లడి
- విజయవాడలో అయ్యప్ప దీక్షాధారులకు ముస్లిం, సిక్కుల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ

విజయవాడ(చిట్టినగర్), నవంబరు 3: అయోధ్య కేసులో సుప్రీం కోర్టు వెలువరించనున్న తీర్పు ఎలా ఉన్నప్పటికీ హిందూ, ముస్లిం వర్గాలు స్వాగతించాలని విజయవాడకు చెందిన యూత్ వెల్ఫేర్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి పిలుపునిచ్చింది. బాబ్రీ మసీదు వ్యవహారంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చే తీర్పును ఓ వర్గం గెలుపుగాను, మరోవర్గం ఓటమిగాను చూడరాదని, దీనిని యావత్ దేశం విజయంగా భావించాలని సమితి అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లి అన్నారు. యూత్ వెల్ఫేర్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని ఆంజనేయ వాగు నాగేంద్రస్వామి దేవాలయంలో అయ్యప్ప దీక్షాధారులకు ముస్లిం, సిక్కుల ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేపట్టారు. ఏపీ సిక్కుల సంఘం అధ్యక్షుడు హర్ మహేందర్ సింగ్ సహానీ మాట్లాడుతూ అయ్యప్ప దీక్షాధారులకు అన్నసంతర్పణ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

అన్నసంతర్పణలో పాల్గొన్న షిబ్లి, హర్ మహేందర్

టీడీపీ జెండా స్తంభానికి వైసీపీ రంగు!

- మాజీ మంత్రి కాల్వ ఆందోళనతో మళ్లీ పచ్చరంగు

రాయదుర్గం, నవంబరు 3 : తెలుగుదేశం పార్టీ జెండా దిమ్మె స్తంభానికి వైసీపీ రంగు పూసి వివాదానికి తెరలేపిన సంఘటన అనంతపురం జిల్లా డీ హీరేహాళ్ మండలం కల్యం గ్రామంలో చోటుచేసుకుంది. దీనిపై ఆగ్రహం చెందిన మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు ఆదివారం ఆ గ్రామాన్ని సందర్శించేందుకు బయలుదేరగా.. రాయదుర్గం మండలంలోని చదం రైల్వే గేటు వద్ద డీఎస్పీ వెంకటరమణ ఆయన వాహనాన్ని అడ్డుకుని గంటపాటు వాహనంలోనే నిర్బంధించారు. దీనిపై కాల్వ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో దిమ్మె స్తంభానికి టీడీపీ రంగు వేయించే బాధ్యత తమదని, వెనక్కి వెళ్లిపోండని కోరారు. అయితే.. రంగు వేయించాకే ఇక్కడి నుంచి వెనుదిరుగుతామని మాజీ మంత్రి భీష్మించడంతో పోలీసులు అప్పటికప్పుడు పసుపు రంగు తెప్పించి దిమ్మె స్తంభానికి వేయించారు.

అనపర్తిలో రోబోటిక్ లేజర్ శస్త్రచికిత్స

- గ్రామీణ ప్రాంతాల్లోనూ అందుబాటులోకి ఆధునిక వైద్యం

అనపర్తి, నవంబరు 3: ఆధునిక వైద్యాన్ని పట్టణాలకే పరిమితం చేస్తున్న ప్రస్తుత తరుణంలో తూర్పుగోదావరి జిల్లా అనపర్తి వంటి గ్రామీణ ప్రాంతంలోనూ జర్మన్ టెక్నాలజీ ద్వారా రోబోటిక్ లేజర్ లాసిక్ శస్త్ర చికిత్సలను అందించేందుకు నారాయణరెడ్డి కంటి ఆస్పత్రి వైద్యుడు తేతలి సత్యనారాయణరెడ్డి ముందుకొచ్చారు. సుమారు 45 సంవత్సరాల క్రితం తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో ఏర్పాటైన నారాయణరెడ్డి కంటి ఆస్పత్రిలో తాజాగా రోబోటిక్ లేజర్ చికిత్స అందుబాటులోకి వచ్చింది. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఈ వైద్య విధానాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే లక్షలాది మంది గ్రామీణులకు కంటి వెలుగు ప్రసాదించి ఇప్పుడు ఆధునిక టెక్నాలజీ ద్వారా మరింత వైద్యం అందించేందుకు ముందుకొచ్చిన తేతలి సత్యనారాయణరెడ్డి, తేతలి వెంకట్రామిరెడ్డి, సంధ్యారెడ్డి దంపతులను అభినందించాలని అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హైదరాబాద్ యశోదా ఆస్పత్రి ఆర్థోపెడిక్ చీఫ్ తేతలి దశరధ రామారెడ్డి మాట్లాడుతూ.. కోస్తా జిల్లాల్లోనే తొలిసారిగా విదేశీ పరిజ్ఞానంతో కంటి శస్త్ర చికిత్సల విభాగాన్ని ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత వాసులకు ఆధునిక వైద్యాన్ని చేరువ చేయడం గొప్ప విషయమని అన్నారు.

గల్ఫ్‌లో ఏపీ ప్రత్యేక ప్రతినిధిగా జుల్ఫి రావ్జీ

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్రతినిధిగా జుల్ఫి రావ్జీని నియమించారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనకు కేబినెట్ మంత్రి హోదా కల్పిస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. గల్ఫ్‌దేశాల్లో జుల్ఫికి వ్యాపారపరంగా, బ్యూరోక్రాట్లతో మెరుగైన సంబంధాలున్న కారణంగా ఈ నియామకం చేసినట్టు తెలిపింది. జుల్ఫి హైదరాబాద్‌కు చెందిన బిల్డర్. గతంలో వైఎస్సార్‌కు సన్నిహితంగా మెలిగేవారు.

50శాతం డైరెక్టర్ పోస్టులు కేటాయించాలి

- విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం

విజయవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ కంపెనీల డైరెక్టర్ పోస్టులలో 50 శాతం బీసీలకు కేటాయించాలని రాష్ట్ర విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి విన్నవించాలని నిర్ణయించింది. విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశం విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆదివారం జరిగింది. 13 జిల్లాలకు చెందిన సంఘ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు, కార్యదర్శి పరిసన వెంకటేశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. నామినేటెడ్ పోస్టులను 50శాతం బీసీలకు కేటాయిస్తూ సీఎం జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై వారు హర్షం వ్యక్తం చేశారు. అలాగే విద్యుత్ కంపెనీల్లోని డైరెక్టర్ పదవులను 50శాతం బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా చేపట్టే నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని కోరారు. విద్యుత్ శాఖలోని ఉద్యోగులు, ఇతరత్రా అంశాలు విభజన చట్టం ప్రకారం జరగాల్సిందేనని స్పష్టం చేశారు.

మహిళా ఉద్యోగులందరికీ ప్రత్యేక సెలవులివ్వాలి

అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉపాధ్యాయులతో సమానంగా రాష్ట్రంలోని ఇతర శాఖల మహిళా ఉద్యోగులందరికీ కూడా ఐదు రోజుల ప్రత్యేక సెలవు దినాలు ఇవ్వాలని ఏపీఎన్జీఓ మహిళా విభాగం ఛైర్‌పర్సన్ వి.నిర్మలకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడలో ఏపీ ఎన్జీఓ రాష్ట్ర మహిళా విభాగం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. చైల్డ్‌కేర్ సెలవులను కేంద్ర ప్రభుత్వంలోని మహిళా ఉద్యోగులతో సమానంగా రెండు సంవత్సరాలకు పెంచాలని, దీన్ని 18 సంవత్సరాల పిల్లల వరకే పరిమితం చేయకుండా సర్వీసు మొత్తంలో ఎప్పుడైనా వాడుకునే అవకాశం కల్పించాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఏపీఎన్జీఓ అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ ఎన్జీఓ ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి బిల్లుల కోసం ధర్నాలు: వైవీబీ

రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి పథకంలో పనులు చేసిన స్థానిక ప్రజాప్రతినిధులకు వెంటనే బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

వివిధ
సాహిత్య వేదిక vividha@andhrajyothy.com

యువకళావాహిని-గోపీచంద్ పురస్కారం

'యువకళావాహిని-గోపీచంద్ జాతీయ సాహితీ పుర స్కారం-2019' రూ.25వేల నగదు పురస్కారాన్ని ఓల్గా స్వీకరిస్తారు. ప్రదానోత్సవ సభ నవంబర్ 5 సా.6గం.లకు సారథి స్టూడియోస్ ప్రివ్యూ థియేటర్, అమీర్‌పేట, హైదరాబాద్‌లో జరుగుతుంది. నందిని సిధారెడ్డి, సారిపల్లి కొండలరావు, ఆవులమంజులత, కె.శివారెడ్డి, ని.మృణాళిని, త్రిపురనేని సాయిచంద్ పాల్గొంటారు.

- యువకళావాహిని

విమలాశాంతి పురస్కారం

2019 విమలాశాంతి సాహిత్య పురస్కారాన్ని 'నీ మేన్' కథా సంపుటికిగాను అద్దేపల్లి ప్రభు అందుకుంటారు. డిసెంబర్‌లో జరిగే సభలో రచయితకు రూ.10 వేలతో సత్కారం ఉంటుంది. న్యాయనిర్ణేతలకు ధన్యవాదాలు.

- శాంతి నారాయణ

మళ్ళీ 'నెల నెలా వెన్నెల'

కే.శే.సి.వి.కృష్ణారావు సమర్పణలో సాగిన 'నెల నెలా వెన్నెల' ప్రత్యేక సాహిత్య కార్యక్రమం ఆయన స్ఫూర్తితో ఇకపై తెలంగాణ చైతన్య సాహితి నిర్వహిస్తుంది. నవంబర్ 9 సా.5 గం.లకు జరగనున్న తొలి కార్యక్రమం ఎన్.బి. టి.హాల్, ఆంధ్ర మహిళా సభ, ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్‌లో జరుగుతుంది.

- ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

మన కాలపు వైతాళికుడు

"నా గీతావళి ఎంత దూరము ప్రయాణంబౌనో అందాక ఈ భూగోళమ్మున అగ్గిపెట్టెదను" (అగ్నిధార) అని దాశరథి అన్నట్లుగా ప్రజాకవి గోరటి వెంకన్న తన పాటల అగ్ని బావుటాలతో వర్తమాన తెలుగు సాహిత్యానికి సరికొత్త తేజస్సును, తాత్విక తేజస్సును అందించాడు. మౌఖిక సాహిత్య, పదకవితల గతిలో, యక్షగానాల శ్రుతిలో బైరాగుల కిన్నెర తత్వాల ఒరవడితో చెరిగిపోతున్న పల్లె ఆనవాళ్ళను, శిథిలమవుతున్న మానవ సంబంధాలను అద్భుతంగా దృశ్యమానం చేసిన అసాధారణ కవి గోరటి వెంకన్న. నేల గుండెలదిరేలా చిందేసి నింగి చెవులు మారు మ్రోగేలా ప్రజాపోరాటాల ఆశయాలను గానం చేసి, తెలంగాణ పాటకు జాతీయ స్థాయిలో విశేషమైన ప్రఖ్యాతిని సమకూర్చిన అపురూప వాగ్గేయకారుడు వెంకన్న. మూలాలను రక్షించకుండా ఫలాలు భక్షించాలని పరుగులు తీస్తున్న కాలానికి తల్లివేరు ఎరుకను వెంకన్న మహోన్నతంగా ప్రబోధించాడు. వెల్లువెత్తుతున్న ప్రపంచీకరణ ప్రభావానికి ప్రత్యామ్నాయంగా దేశీయ సంస్కారాన్ని, గ్రామీణ సాంస్కృతిక గరిమను వేయి గొంతుకలతో చాటి చెప్పాడు. "తాజ్ మహల్ అందాల కన్నా నా వాగు పిచ్చుక గూళ్ళే మిన్న" అంటూ అఖిల విశ్వానికి తెలియజేశాడు. సహజ సుందర శోభిత మైన, బహుళార్థభరితమైన ప్రకృతిని కోటి కన్నులతో దర్శించి, మేటి పాటలు రచించి, ప్రకృతి కేంద్రంగా మానవ జీవన ప్రమాణాలను నిర్దేశించి, పశుపక్ష్యాదుల కార్యాచరణ ఆధారంగా నైతిక సూత్రాలను నిర్ధారించాడు.

> **నేల గుండెలదిరేలా చిందేసి, నింగి చెవులు మారు మ్రోగేలా ప్రజాపోరాటాల ఆశయాలను గానం చేసి, తెలంగాణ పాటకు జాతీయ స్థాయిలో విశేషమైన ప్రఖ్యాతిని సమకూర్చిన అపురూప వాగ్గేయకారుడు వెంకన్న. మూలాలను రక్షించకుండా ఫలాలు భక్షించాలని పరుగులు తీస్తున్న కాలానికి తల్లివేరు ఎరుకను వెంకన్న మహోన్నతంగా ప్రబోధించాడు. వెల్లు వెత్తుతున్న ప్రపంచీకరణ ప్రభావానికి ప్రత్యామ్నాయంగా దేశీయ సంస్కారాన్ని, గ్రామీణ సాంస్కృతిక గరిమను వేయి గొంతుకలతో చాటి చెప్పాడు. "తాజ్ మహల్ అందాల కన్నా నా వాగు పిచ్చుక గూళ్ళే మిన్న" అంటూ అఖిల విశ్వానికి తెలియజేశాడు.**

శివసాగర్ 'చిరుగాలి సితార సంగీతంతో', 'యుద్ధనౌక జన గద్దర్ గానం'తో, నీలిమేఘాల రాగాలతో, చిక్కనవుతున్న పాటలతో, ప్రతిధ్వనిస్తున్న అత్యాధునిక సాహిత్యాన్ని తన 'ఏకునాదం మోత'తో కదిపి కుదిపేశాడు వెంకన్న. పాలమురు మెట్టప్రాంత సోయితో, విప్లవ దళితోద్యమాల ఉమ్మడి స్నేహితో తన తండ్రి అపరధనుర్దాసు నరసింహ కళావారసత్వంతో కవిగా, గాయకుడిగా, వాగ్గేయకారుడిగా, దూసుకువచ్చిన గోరటి వెకన్న అత్యంత ప్రామాణికమైన, ప్రభావశీలమైన గేయకవిత్వంతో తెలుగు సాహిత్యంలో మిగిలిపోయిన ఖాళీలను సమర్థవంతంగా భర్తీ చేశాడు. తెలంగాణ భాషా వికాసానికి ప్రాణచైతన్యాన్ని అందిం చాడు. వస్తువైవిధ్యంతో రూపవైశిష్ట్యంతో తెలుగు గేయకవిత్వంలో గుణాత్మక మార్పులు తీసుకువచ్చాడు. "కాలేకడుపుల మీద రాళ్ళు గొట్టే రాజ్యమిది" అంటూ పాలక వర్గాల క్రూరత్వాన్ని ఎండగట్టి "ఎగదిగేసే మత, కుల కుంపటులారి/ మమతపూలు రెక్కతొడిగి విరియా"లని మనసారా పిలుపునిచ్చాడు. మను ధర్మానికి వ్యతి రేకంగా పాటల ఈటెలు సంధించాడు. "ఆశనెరుగని ఆది వాసులు/ అడవిదారికి దివిటీ వెలుగలని" మూలవాసులకు జేజేలు పలికి, గిరిజన పోరాటాలకు సంఘీభావం ప్రకటించాడు. "నీతి బతుకు" కవితలో అనుక్షణం స్త్రీలపై పెరుగుతున్న లైంగిక దోపిడిని వ్యతిరేకించి కామతృష్ణ పరమ హింసలను ఖండించాడు.

"పందులె తన బంధు బలగంగ/ కష్టసుఖాలను కలబోసుకొని బ్రతికే" ఎరుకల నాగన్న, 'కురులకు కులుకునేర్పే మంగలన్న', 'కల్ల కపటమెరుగని గొల్ల కురుమ వనిత', యాదవ ఎలమంద, పిండిగిర్ని సుబ్బయ్య, ఇల్లుబాసిపోయిన రైతన్న, మాదిగ తాతయ్య, మాలసెన్నయ్య, పరక సేపలకు గాలాలేసే ముస్లిమ్ పోరలు, బ్యాగరి బాలక్క, తలారి రామక్క, సలువాది సాయక్క సబ్బండ వర్ణాల సమస్త శ్రామికులను తన పాటల్లో వెంకన్న రమణీయంగా చిత్రించాడు. రైతులతోపాటు ప్రధానంగా వ్యవసాయ కూలీలు, చేతి వృత్తుల శ్రామికులు, దళిత బహుజనుల సమ్మిళిత జీవన స్థితిగతుల కోణంలో నుండి వెంకన్న పల్లె అస్తిత్వాన్ని తేట తెల్లం చేశాడు. అందువల్లనే తల్లి రక్తం బిడ్డలో ప్రవహించినంత సహజంగా పల్లె తత్వం వెంకన్న పాటల్లో ప్రతిఫలిస్తుంది.

నా ఊరు, నా ప్రాంతం, నా సంస్కృతి, నా భాష అనే అహంకార దర్శనం, ఆత్మగౌరవం వెంకన్న పాటల నిండా పరిమళిస్తుంది. పల్లె పట్ల అపారమైన బెంగ, పల్లెవాసుల బతుకుపట్ల ఎడతెగని దిగులు ఈ కవి మనసు నిండా ఆవరించి ఉంటుంది. "నీ ఆట ఏమాయెరో ఓరన్న నీ పాట ఎటుబాయెరో మాయన్నా" అంటూ గ్రామీణ కళా రూపాల గొప్పతనాన్ని, అవి అందించిన సాంస్కృతిక చైతన్యాన్ని, ఆ కళాకారుల అసామాన్య ప్రతిభా పాట వాలను తలచుకొని దుఃఖి స్తాడు. ఆ మధుర జ్ఞాపక లను నెమరువేసుకొని ఒక్కొక్క సారి సేదతీరుతాడు. పదిలమైన పల్లె అడుగు జాడలు అంతరించి పోతున్నాయన్న వలపోతను వెంకన్న సమున్నతంగా తన కవిత్వంలో అక్షరబద్ధం చేశాడు. "పారె ఏటి అలలమీద/ పండు వెన్నెల రాలినట్లు, ఊరే ఊట సెలిమలోన/ తేట నీరు తొణినట్లు/ వెండి మెరుపుల నవ్వు నీది లచ్చువమ్మో" అంటూ తెలుగు పాఠకుడు కనీ వినీ ఎరుగని సాదృశ్యాలతో, గ్రామీణ మహిళల అపురూప సౌందర్యాన్ని, శ్రమైక దృష్టిని అమేయ శిల్ప చాతుర్యంతో ఈ కవి ఉన్నతీకరించాడు. "ముచ్చటొలికే ముగ్గులేసే/ మునివేల గోరుపై న/ పొద్దె ముద్ద గోరింటయితది లచ్చువమ్మా" అన్న కవి అపూర్వ భావ చిత్రం ప్రబంధకవుల వర్ణనా వైదుష్యంతో పోటి పడుతుంది. "పాలి పోయిన కందిసేనే/ నీవు పాట పాడితే పూత పడుతది" అన్న మెచ్చుకోలు లచ్చువమ్మకే కాదు వెంకన్నకు కూడా వర్తిస్తుంది. రైతు కేంద్రంగా తెలుగులో వెలువడిన కావ్యాలలో కనిపించని భిన్నమైన వ్యవసాయక వాతావరణం వెంకన్న కవిత్వంలో పచ్చ పచ్చగా మెరుస్తుంది. మెట్ట ప్రాంత పంట పొలాల స్వరూపాన్ని వెంకన్న అత్యంత పరిశీలనాత్మక దృష్టితో తన పాటల్లో ఆవిష్కరించాడు. 'గాలికూగే వేరుసెనగ', 'మురిపాలొలుకు మిరపసేలు', 'గుత్తులుకాసిన పత్తిసేలు', 'వెన్ను విరిచిన జొన్నచేలు' వెంకన్న సృజన క్షేత్రం నిండా పరచుకొని ఉంటాయి.

> **గ్రామీణ జీవన సౌందర్యాన్ని ఉన్నతంగా కవిత్వీకరించడంతో పాటు వెంకన్న గ్రామీణ జీవన విధ్వంసాన్ని కూడా తన రచనల్లో విస్తృతంగా చిత్రించాడు. సరళీకృత ఆర్థిక విధానాల మూలంగా, ప్రపంచీకరణ పెను తుఫాన్ కారణంగా విచ్ఛిన్నమవుతున్న చేతి వృత్తి కార్మికుల కష్టనష్టాలను, దగ్ధమవుతున్న బడుగు జీవుల బతుకు వెతలను, పతనమవుతున్న దేశీయ సాంస్కృతిక విలువలను వెంకన్న ఎంతో ప్రతిభావంతంగా అక్షర బద్ధం చేశాడు. "పల్లే కన్నీరు పెడుతుందో" అనే పాట ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమానికి నాందిపలికింది.**

"Poetry is the image of man and Nature" అన్న వర్డ్స్‌వర్త్ సూత్రీకరణకు వెంకన్న కవిత్వం వ్యాఖ్యానం వలె ఉంటుంది. విహంగ వీక్షణం లాగా కాకుండ Microscopic Viewతో వెంకన్న అనంత ప్రకృతి అందచందాలను తన కవిత్వంలో రాశిపోశాడు. సెరువు, వాన, వాగు, అడవి వెన్నెలతో పాటు పశుపక్ష్యాదుల తీరుతెన్నులను సహృదయహృదయాను రంజకంగా చిత్రిక పట్టాడు. "జువ్వి కొమ్మన గువ్వల రాగాలు", "పంచె వెన్నెల రామసిలుకలు" పరికిపిట్ట, బురకపిట్ట, తీతువు, "విసురుగాలి తాకి ఈల వేసే సెలిమ", "ఈత కమ్మల గాలి దరువు", "తెప్పల మాటున వెన్నెల తాళం", "చిరుగాలి పాటకు ఎగసి దరువేసే చినుకులు" లాంటి పరపశాత్మకమైన పరిసరాలకు నవనవోన్మేషమైన పదబంధాలు వెంకన్న కవిత్వంలో దర్శనమిస్తాయి.

వెంకన్న రాసిన ప్రకృతి కవిత్వంలో ఆలంకారిక దృష్టితోపాటు జీవకారుణ్య స్ఫూర్తి, పర్యావరణ పరిరక్షణాస్పృహ కూడా విశేషంగా చోటుచేసుకుంది. 'కొంగమ్మ', 'పిట్ట బతుకు' లాంటి పాటల్లో పక్షుల్లోని నైర్మల్యాన్ని, త్యాగనిరతిని, మానవుడు అలవరచుకొని, తన లోలోపల మలినాలను తొలగించుకోవాలని కవి హితవు చెప్పాడు. 'అలచంద్రవంక' గేయకవిత్వం ప్రకృతి రమణీయతకు, బహుముఖీన ప్రకృతి ఔన్నత్యానికి నిదర్శనంగా నిలుస్తుంది.

గ్రామీణ జీవన సౌందర్యాన్ని ఉన్నతంగా కవిత్వీకరించడంతో పాటు వెంకన్న గ్రామీణ జీవన విధ్వంసాన్ని కూడా తన రచనల్లో విస్తృతంగా చిత్రించాడు. సరళీకృత ఆర్థిక విధానాల మూలంగా, ప్రపంచీకరణ పెనుతుఫాన్ కారణంగా విచ్ఛిన్నమవుతున్న చేతివృత్తి కార్మికుల కష్టనష్టాలను, దగ్ధమవుతున్న బడుగు జీవుల బతుకు వెతలను, పతనమవుతున్న దేశీయ సాంస్కృతిక విలువలను వెంకన్న ఎంతో ప్రతిభావంతంగా అక్షర బద్ధం చేశాడు. "పల్లే కన్నీరు పెడుతుందో" అనే పాట ప్రపంచీకరణ వ్యతిరేక ఉద్యమానికి నాందిపలికింది. కుల, మత, వర్గ, లింగ వివక్షల అగ్ని కీలల్లో ప్రపంచీకరణ ఆజ్యం పోస్తుందని, తద్వారా ఆ వివక్ష నెదుర్కొంటున్న ప్రజాజీవితం అల్ల కల్లోలమవుతుం దని వెంకన్న పాటల ద్వారా ప్రచారం చేశాడు. కుల, మతం, వర్గం, జెండర్‌లతో పాటు ఐదో శత్రువైన ప్రపంచీకరణ రగిలించిన పెనుప్రమాదాలను, దాని పర్యవసానాలను తన గేయాల్లో వెంకన్న శక్తివంతంగా చాటి చెప్పాడు. ఎంతో చారిత్రాత్మక మైన ప్రాధాన్యత కల్గిన 'పల్లె కన్నీరు పాట' గల్లీ నుండి డిల్లీదాక ప్రజా సమూహాలను చైతన్య పరచి, పాలక వర్గాల పీఠాలను తారుమారు చేసింది. 'అక్షరరూపం దాల్చిన ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళను కదిలిస్తే', పాట రూపం దాల్చిన ఒక్క సిరా చుక్క కోటి మందిని కదిలిస్తుందని గోరటి వెంకన్న పాట నిరూపించింది.

వెంకన్న పాట స్వరూపం స్వభావాలను, తదనుగుణ మైన జీవన నేపథ్యాన్ని నిశితంగా విశ్లేషించిన కె.శ్రీనివాస్ చెప్పినట్లుగా తెలంగాణ కావాల్సివచ్చిన కాలానికి ఎదిగివచ్చిన పుత్రుడు వెంకన్న, 'పూసిన పున్నమి', 'వైభవ గీతిక', 'తల్లి తెలంగాణమా', 'ఇద్దరం విడిపోతే' లాంటి పాటలు ప్రత్యేక తెలం గాణ ఉద్యమానికి సాంస్కృతిక ఆలంబనగా నిలి చాయి. తెలంగాణ భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవ ప్రాభవాలను సరళంగా, శిల్ప సుందరంగా, కలమారా గళమారా గానం చేయడంలో వెంకన్న కీలకమైన పాత్ర పోషించాడు. ఉత్తేజభరిత మైన, ఉద్వేగ పూరితమైన, తన ఆటపాటలలో తెలంగాణ ఉద్యమానికి వెంకన్న ఊపిరిపోశాడు. గ్రామీణ జనులను, నగరవాసులను, మేధావులను ఉద్యమాభిముఖంగా మళ్ళించడంలో వెంకన్న పాట బాధ్యతాయుతమైన కర్తవ్యాన్ని నిర్వర్తించడంతో పాటు, తెలంగాణ సాహిత్య పరిణామ క్రమాన్ని వేగవంతం చేసింది.

గోరటి గొప్ప తాత్విక కవి. బుద్దుడు, చార్వాకులు, కారల్‌మార్క్స్, జ్యోతిబాపులె, డా. బి.ఆర్ అంబేద్కర్ వంటి సామాజిక తత్వవేత్తల స్ఫూర్తితో పాటు వేమన, పోతులూరి వీరబ్రహ్మం, అన్నమయ్య దున్న ఈద్దాసు లాంటి తత్వ కవుల సంకీర్ణ ప్రభావంతో అచల తత్వ ప్రేరణతో ఆయన తత్వ కవిగా రూపాంతరం చెందాడు. 'మూట ఎందుకు వెంట హరి దాస/ దాంట్లో మురికి గూడుతదంట హరిదాస/ మోసుకొచ్చిందెంత హరిదాస/ నీవు తీసుకెళ్ళేదెంత హరిదాస/ సూసుకుంటె వింత హరిదాస/ శూన్యమే నీ బొంత హరిదాస' అంటూ ఈనాడు వేగంగా విస్తరిస్తున్న ఆర్థిక తీవ్రవాదాన్ని మార్కెట్‌వాద వలలో చిక్కుకున్న మానవుడి ధనదాహాన్ని అత్యుత్భుతంగా వెంకన్న ఈ పాటలో చిత్రించాడు.

"Of the poets I have known Gorati Venkanna has the rarest creativity and the finest imagination. In him we find a Pablo Neruda and Bob Dylan"

- (The Wave of the Crescent)

- అని 'సరస్వతీ సమ్మాన్' గ్రహీత కె.శివారెడ్డి చెప్పిన మాట అక్షరాల నిజం. అందుకే గోరటి వెంకన్న ఒక లెజెండ్రి పోయెట్. ఆయన పాట ఒక సామాజిక ఇతిహాసం. మన కాలపు వైతాళికుడైన గోరటి వెంకన్న పాటను కాలమే మైమరచి హమ్ చేస్తుంది.

■ **కోయి కోటేశ్వరరావు**
94404 80274

మనస్సంగం

ఓరిమి నిండిన నిరీక్షణలో
ఎడతెగక ఊగే ఖాళీ ఊయల
సగం సంగమం సగం వియోగం
బంధబాంధవ్యాలతో ఎగిసిపడే అల
నేను నీకు పరాయి మనిషిని కాను
అలాగని సొంతమూ కాదనే చింత

వినీల ఆకాశంలోంచి
విలసిల్లే విశృంఖల పాలవెన్నెల
పచ్చిక బయలు నలువంకలా
లోగొంతుకతో జలవలయపు గలగల
ఒకరినొకరం చేరుకోలేని తీరాల మధ్య
విహ్వలించే రహస్యంత్రి అగోచర జీవనది
నిన్నటి అమందానందంతో
శతకోటి రెక్కలు విప్పారే ప్రతి ప్రభాతమూ
ఆంతరిక అగ్నిజ్వాలల్లోంచి తిరిగిలేచే ఫీనిక్స్
నీ వాకిట వాలి పిలిచే నీరెండ
ఈ దరి నుంచి నేనల్లుకొస్తున్న
అమర ప్రేమాన్విత గీతం

అది మన సాంగత్యమంత లలితం
ఎడబాసిన హృదయంలో ఉల్కాపాతం
'మనిషిది మరపు మనసు' అనే
దస్రు* కుక్క విశ్వాసశోకం ముందు
అణువణువునా బధిరుడిని నేను

(*గోపీనాథ మహంతి నవల 'అమృత సంతానం'లో సరుబు సావొతా పెంపుడు కుక్క)

■ **నామాడి శ్రీధర్**
93968 07070



ఒక క్లాసిక్ పుట్టుక

'యూ'లిసెస్', జేమ్స్ జాయిస్ (1922); 'అంపశయ్య', నవీన్ (1968)- ఈ రెండు నవలలు వ్యక్తి ప్రధాన పాత్రగా నడిచేవే! అలాగే చైతన్య స్రవంతి కలవే. ప్రేమదాహం (కామ ప్రకోపంతోసహా) వస్తువులో ప్రము ఖంగా ఉండడం రెండింటిలో సరి సమానమే! ఈ 'చైతన్య స్రవంతి' శైలిని తెలుగులో 'మనో వైజ్ఞానిక రచన' లేదా నవల అని కూడా అంటారు. ఈ శైలిని మొట్టమొదట తెలుగులో ప్రయోగించింది (జేమ్స్ జాయిస్ ప్రభావంతో) బుచ్చిబాబు. 'చైతన్య స్రవంతి' కథ, 'విడిచేసిన అసలు విషయం' కథ, తదితరమైనవి ఆయన ఈ ధోరణిలోనే రాసాడు. ఈ శైలిలోనే రావిశాస్త్రి 'అల్పజీవి'; వడ్డెర చండీదాస్ 'అనుక్షణికం', 'హిమజ్వాల' తదితర రచనలు తెలుగు సాహిత్యంలో



> **జీవిత లోతుల్లోకి వెళ్ళి సహజసిద్ధమైన రీతిలో సృజనాత్మకంగా రాయబడ్డ నవల అంపశయ్య! అంతేకాదు, చాలా ధైర్యంగా ప్రయోగానికి పెద్దపీట వేయడంతో కూడా ఈ నవల చాలా ప్రఖ్యాతి గాంచింది. వీటన్నింటికి తోడుగా ప్రతిభ, చిత్తశుద్ధి కూడా తోడవడంతో తెలుగు సాహిత్యంలో అంపశయ్య ఒక 'క్లాసికల్'గా నిలిచిపోయింది.**

వెలువడ్డాయి. ఇంకా ఎంతోమంది (ఈ వ్యాస రచయితతో సహా) తెలుగు రచయితలు ఈ శైలిని 'అడాప్ట్' చేసుకున్నారు. ప్రముఖంగా ఈ చైతన్య స్రవంతి శైలి ప్రయోగాత్మకమైనది. జేమ్స్ జాయిస్ ఈ రచనా శైలి ప్రయోగించి దాదాపు ఒక దశాబ్దం కావస్తున్నది. ఐనప్పటికీ ఈ శైలిని ఎవరైనా అనుకరిస్తే అది నూతనంగానే తోస్తుంది. అంటే ఒక శతాబ్దం కిందటే చేసిన జేమ్స్ జాయిస్ ప్రయోగం ఎంత నిత్యనూతనమైనదో మనకు అవగతమవుతుంది.

ఇజ్రా పౌండ్ అనే మరో సృజనశీలి జేమ్స్ జాయిస్ సాహిత్యంతోనే కాకుండా టి.ఎస్.ఇలియట్ (పొయట్ ఆఫ్ ది సెంచరీ) సాహిత్యంతో అను బంధం కలవాడు. పై రచయితలు ఇద్దరి సాహి త్యాన్ని సంస్కరించడంలో కాని లేక సహాయ సహకారాలు అందించడంలో కాని ఇజ్రా పౌండ్ ఎంతో పేరుగాంచాడు. ప్రేమ కవిత్వంతో జాయిస్ 1907లో రచించిన 'ఛాంబర్ మ్యూజిక్' అనే పుస్తకానికి మించిన పుస్తకం మరొకటి లేదనిపిస్తుంది నాకు.

ఇంక మన ఇంటి వ్యవహా రానికొస్తే- తెలుగులో వచ్చిన మంచి నవలల్లో, లేక ఎంపిక చేసిన నవలల్లో నవీన్ 'అంప శయ్య' ఎప్పుడో స్థానం సంపాదిం చుకొంది. విచిత్రంగా- నవీన్ రాసిన మొదటి నవల 'అంపశయ్య'. ఆ తరు వాత్తరువాత ఆయన ఎంతో సాహి త్యాన్ని సృష్టించాడు. అదంతా 'అంప శయ్య'కి భిన్నంగా కనిపిస్తుంది. అలా చాలా పేరుతెచ్చే కళాఖండం (రచన) ఏ రచయితకైనా, కళాకారుడికైనా ఒక్క సారే సంభవిస్తుందేమో.

ఈ వ్యాసం ప్రారంభం నుండి ఇంతవరకు వివరిస్తూ వచ్చినట్లు, జేమ్స్ జాయిస్ జ్ఞాపకం రాకుండా 'అంపశయ్య' రచయితైన నవీన్ జ్ఞాపకం రాడు. ఇంత ఐనప్పటికి- డబ్లిన్‌కి హైద రాబాద్‌కి మానసికమైన దూరం లేదు. ప్రభావం ఎంత గాఢమైనప్పటికీ నవీన్ మన ప్రాంతానికి సంబంధించిన కథని తీసుకొని నాయకుడు 'రవి' పాత్రని తీర్చిదిద్దిన తీరు, అలాగే స్థానిక వాతా వరణాన్ని అత్యంత సహజంగా ప్రతిబింబిస్తూ రచన సాగించిన పద్ధతీ ఎంతో ప్రశంసనీయంగా ఉంది. నవీన్ తన రచనలో అత్యంత ప్రతిభ కనపరిచాడు. బహుశ తన నిజ జీవితంలోని ఎన్నో అంశాలు ఈ నవలలో ఎంతో శక్తిమంతంగా రూపు దిద్దుకున్నాయి కాబోలు. ఆ రకంగా రచయిత అదృష్టవంతుడు. ఎందుకంటే తెలుగు భాషలో వేలకొద్దిగా వచ్చిన నవలల్లో అతికొద్ది మంచి నవలల్లో 'అంపశయ్య' ఒకటి అయ్యిందంటే రచయితను మనం ఎంతో అభినందించాలి. 'అంపశయ్య' విజయాన్ని తెలుగు సాహిత్యలోకం మరోసారి తలచుకునే సందర్భాన్ని అతడు కళ్ళారా చూడడం చాలా అబ్బురమైన విషయం.

జీవిత లోతుల్లోకి వెళ్ళి సహజసిద్ధమైన రీతిలో సృజనాత్మకంగా రాయబడ్డ నవల అంపశయ్య! అంతేకాదు, చాలా ధైర్యంగా ప్రయోగానికి పెద్ద పీట వేయడంతో కూడా ఈ నవల చాలా ప్రఖ్యాతి గాంచింది. వీటన్నింటికి తోడుగా ప్రతిభ, చిత్తశుద్ధి కూడా తోడవడంతో తెలుగు సాహిత్యంలో అంప శయ్య ఒక క్లాసికల్‌గా నిలిచిపోయింది. ఈ వయసులో నవీన్, అంపశయ్య నవల కథా గురించి ఆలోచిస్తే, అతడిని ఎలాంటి అనుభూతి వెంటాడుతుందో అని ఆలోచిస్తూ ఆశ్చర్యానికి గురవుతూంటాను. అన్నింటికి మించి నవీన్ ఉత్తముడు, మంచి స్నేహితుడు. నెగెటివ్ థింకింగ్ దరి చేరనియ్యనివాడు. అలాగే జీవితాంతం ఆయన ఒక వృత్తి రచయితగా ప్రఖ్యాతి గాంచాడు. తెలుగు సాహితీలోకంలో అతడిని ఎరగనివారు ఎవరూ ఉండరు.

శేషజీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ తెలుగు పాఠకులకు మరిన్ని మంచి రచనలను అందించాలని కోరుతూ, ఈ సందర్భంగా నవీన్‌ని గుండెలకు హత్తుకుని అభినందిస్తున్నాను.

■ **బి. నరసింగరావు**

('అంపశయ్య' నవల ప్రచురితమై యాభై ఏళ్ళయిన సందర్భంగా)

'వల్లంకితాళం', 'పూసినపున్నమి' ఆవిష్కరణ

గోరటి వెంకన్న రచనలు 'వల్లంకితాళం', 'పూసిన పున్నమి' ఆవిష్కరణ సభ నవంబర్ 5 సా.6గం.లకు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఖాదర్ మొహియుద్దీన్, కె.శ్రీనివాస్, శిలా లోలిత, కె.శివారెడ్డి, పెద్దింటి అశోక్ కుమార్ తదితరులు పాల్గొంటారు. గోరటి కవితల ఇంగ్లీష్ అనువాదం ఆవిష్కరణ కూడా జరుగుతుంది.

- పులిపాటి మధు

'మేరువు' నవల ఆవిష్కరణ

నల్లూరి రుక్మిణి 'మేరువు' నవల ఆవిష్కరణ సభ నవంబర్ 5 సా.5.30 గం.లకు ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ&అమరావతి (మధుమాలక్ష్మి ఛాంబర్స్), మధుగార్డెన్స్, మొగల్‌రాజపురం, విజయవాడ-10లో జరుగుతుంది. అరసవిల్లి కృష్ణ, అల్లం రాజయ్య, యమ్. విశ్వేశ్వరరావు పాల్గొంటారు.

- విప్లవ రచయితల సంఘం

'ఫిడేలు నాయుడు గారు' ఆవిష్కరణ

ద్వారం వెంకటస్వామి నాయుడుపై 'ఫిడేలు నాయుడుగారు' పుస్తకాన్ని వివిఐటి నంబూరు మోదుగుల రవికృష్ణ సంపాదకత్వంలో ప్రచురించింది. నవంబర్ 8 ఉ.11గం.లకు వివిఐటి నంబూరులో ఆవిష్కరణ జరుగుతుంది.

- మోదుగుల రవికృష్ణ

(చలి)

నీకు చెబితే అర్థం కాదు కానీ
మన మధ్య దూరం, కొన్ని వేల దాహాలు
అందుకే నువ్వెళ్లిపోతానంటే ఆపలేదు
అంత మాటంటానని నువ్వనుకోలేదు కదూ

సాయంత్రపు గాలికి రాలిపడి, గాయపడి
ఆకాశపు ముక్కల కింద నలిగే నాతో
నీకేం పని, పిల్లా?
నువ్వు ఎక్కి పోయిన ఆకాశపు నిచ్చెన
ఇంకా పరిమళిస్తూనే ఉంది
మళ్లీ వెనక్కి రాకు. ఇక్కడేం లేదు గతం తప్ప

అర్ధరాత్రి సముద్రానికి చీకటి తాగిస్తూ
పాదముద్రలు పడకుండా నడుస్తాను నేను
కాళ్ళు పట్టుకొని ప్రాధేయపడినా ఏ రోజూ
నా ఆత్మలో ఇసుమంతైనా అలలకు ఇవ్వలేదు
గుమ్మడి పాదు మీద గొంగళి పురుగును
ప్రాణాలతో నేను వదిలేస్తే
నాది జాలి గుండె అనుకున్నావు కదూ
ఇంతకు ముందెప్పుడూ పెస్సిమిస్టును చూడలేదా?

కలలు కవితలై కాలుతున్నా, చలి ఇంకా తగ్గలేదు
వెచ్చదనం, ఉష్ణం అన్నీ నీతోనే పోయాయి మరి
కొద్దిగా పగిలిన కిటికీ అద్దంలోంచి
ఒంటరితనపు చలి అలలు, నిద్రపోనిస్తేగా
గుండె లోపలి మంచు పలకలు
ఇంకా బిగుసుకుపోతున్నాయి

భూమికి స్నానం చేయించి ఆకాశం శుభ్రపడ్డట్టు
మనల్ని విడదీసి మన కథ రక్తి కట్టింది
ఇప్పుడు మనం లవ్ ఫెయిల్యూర్ హీరో హీరోయిన్లమ్
What a joke! అయినా
పెన్సిల్ అరిగిపోయేదాకా ఆకాశంలో మబ్బులు గీసి
కురిశాక వాన మీద అలిగాను చూడు
ఏమనాలి నన్ను?
నీక్కూడా తెలీదన్నావు కదూ. మర్చిపోయా

చెబితే నువ్వు నమ్మవు కానీ, నువ్వెళ్ళిపోయాక
ఉదయపు పిచ్చుకల పాటలన్నీ కంఠతా వచ్చాయి తెలుసా?
పిచ్చుకనైపోదామనుకొని పాటనయ్యాను చివరికి
అయినా శూన్యంలో పడిపోతున్నవాడికి
రెక్కలతో ఏం పని పిల్లా?
నా గురించి ఏం ఆలోచించకు

ఏమడిగినా అంతరిక్షంతో మొదలెడతావ్ అని
నన్ను విసుక్కునేదానివి
ఇప్పుడు నిద్ర పట్టక కిటికీ లోంచి చూస్తే
నాతో పాటు తోడుగా మండేవి నక్షత్రాలే మరి

నది ఒడ్డున జమ్మి చెట్లు నా కథ విన్నాయి
వర్షపు తడిలో సాయంత్రం ఇంకిపోయాక
రాత్రి, చలి, దాహం, ఆయాసం
దూరంగా కాలపు నది అవతల ఏదో దీపం
ఇదివరకు దహించిపోయిన మన ఆత్మలు అవి
కన్నీళ్లు ఇంకిపోయాక
కళ్ళు రెండూ రాజేసుకొని చలి కాచుకునే యజ్ఞంలో
ఈ రాత్రి ఎప్పుడు గడుస్తుందో

■ **స్వరూప్.టి**
97007 73533

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
5 సోమవారం • 4 నవంబర్ 2019
navya@andhrajyothy.com

స్ఫూర్తి

చిన్న వయసులోనే పెళ్లి... పిల్లలు... కుటుంబం. ఒక్కసారిగా బాధ్యతలన్నీ మీద పడినా సమాజం కోసం ఓ అడుగు ముందుకు వేయడానికి ఆమె వెనుకాడలేదు. మధ్యలో ఆగిపోయిన చదువును కొనసాగిస్తూనే... అభాగ్య మహిళలకు అండగా నిలిచారు. నిజాయతీ... ఆపన్నులకు సాయమందించాలన్న స్ఫూర్తి... ఇవే తన పిల్లల్లోనూ నింపి ఎందరికో మార్గదర్శకురాలిగా నిలిచిన యాభై రెండేళ్ల **డాక్టర్ దాసరి శ్రీలక్ష్మీరెడ్డి** సేవా ప్రస్థానం ఇది...

సేవాలక్ష్మి

ఫొటో: కటకం సింహాచారి

"నా గుర్తింపు నేనే కావాలి' అనేది నా అభిలాష. అది కూడా సమాజానికి ఉపయోగపడే మంచి పనులతో! అందుకే సాయం కోసం నా దగ్గరకు వచ్చిన వారికి కాదనకుండా చేతనైన చేయూతనిస్తుంటా. ఈ సంకల్పం మా అమ్మ కమలమ్మ నుంచే వచ్చింది. నిజాయతీగా ఉండాలని చిన్నప్పుడు అమ్మ మాకు చెబుతుండేది. మా గుమ్మంలోకి వచ్చి అడిగినవారికి లేదనకుండా సాయం చేసేది. ఇన్నేళ్లుగా నేను సేవా మార్గంలో నడుస్తున్నానంటే అందుకు అమ్మే స్ఫూర్తి. మాది నెల్లూరు జిల్లా ఆత్మకూరు అయినా పెళ్లి తరువాత తెలంగాణ కోడలిని అయ్యాను. 1983లో ఇంటర్ అవ్వగానే అమ్మా నాన్న నాకు పెళ్లి చేసేశారు. మా ఆయన జైపాల్‌రెడ్డి న్యాయవాది. మావారిది ఖమ్మం జిల్లా సత్తుపల్లి. ప్రస్తుతం హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. మా మామగారు దాసరి బుచ్చిరామిరెడ్డి. కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఎవరు జిల్లాకు వచ్చినా మా ఇంట్లోనే బస చేసేవారు. పార్టీలో మామగారికి మంచి పేరుండేది.

పాప పుట్టాక తొలి అడుగు...

పెళ్లయింది. కొత్త ఊరు... కొత్త కాపురం. ఏడాది తిరిగిపోయింది. కానీ సామాజిక సేవ చేయాలన్న కోరిక నాలో అలాగే మిగిలిపోయింది. 1984లో మా పెద్ద పాప సింధు పుట్టింది. అదే సమయంలో అక్కడ 'రెడ్‌క్రాస్'లో ఈసీ మెంబర్‌గా చేరాను. సంస్థ నేతృత్వంలో రక్తదాన, ఆరోగ్య శిబిరాలు, విద్య, ఉపాధి వంటి సంక్షేమ కార్యక్రమాలు పేదల కోసం నిర్వహించాను. అలా

'వ్యర్థాల'పై అవగాహన ర్యాలీలో...

సామాజిక సేవకు తొలి అడుగు పడింది. దాంతో పాటే ఇంటర్‌తో ఆగిపోయిన చదువునూ కొనసాగించాను. ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీఏ డిగ్రీకి కట్టాను. ఒక పక్క 'రెడ్‌క్రాస్' సేవా కార్యక్రమాలు... మరోవైపు కుటుంబ బాధ్యతలు... అయినా ఏ రోజూ దేనికి ఏదీ అవరోధం అనుకోలేదు. రెండో పాప ప్రియాంక పుట్టే నాటికి నా డిగ్రీ అయిపోయింది. దాంతోపాటే సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేయడానికి లయన్స్ క్లబ్‌లో సభ్యత్వం తీసుకున్నాను.

పిల్లల చదువుల కోసం...

నాకు చిన్న వయసులోనే పెళ్లయి, చదువుకు మధ్యలోనే బ్రేక్ వచ్చినట్లుగా నా పిల్లల విషయంలో జరగకూడదనుకున్నా. వారిని ఉన్నత చదువులు చదివించాలనుకున్నా. దీంతో 1997లో హైదరాబాద్‌కు మకాం మార్చాం. అయితే హైదరాబాద్ రావడంతో పిల్లల చదువే కాదు... నా జీవితం కూడా మారిపోయిందని చెప్పాలి. ఇక్కడకు వచ్చిన తరువాత రామకృష్ణ మఠానికి వెళ్లడం మొదలుపెట్టాను. అక్కడ ఎన్నో జీవిత సత్యాలు తెలుసుకున్నా. సమాజం పట్ల మరింత ప్రేమ పెంచుకున్నా. స్పోకెన్ ఇంగ్లిష్ నేర్చుకున్నా. మఠం తరఫున మురికివాడలకు వెళ్లా. అక్కడి మహిళలను కలిసి, వారిని బృందాలుగా మార్చి, ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించా. అవసరమైనవారికి ఆపరేషన్లు చేయించా.

నేర్పించడానికి నేర్చుకున్నా...

పొలిటికల్ సైన్స్‌లో (2004లో) ఎంఏ పట్టా పొందడం ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. అదే సమయంలో ఫినాయిల్, ఇతర క్లీనింగ్ మెటీరియల్, క్యాండిల్స్, చిప్స్ వంటివి

అవి అమూల్యం...

నిజాయతీగా ఒక సంకల్పం కోసం మూడు దశాబ్దాలుగా కష్టపడుతున్నాను. దానికి గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక అవార్డులెన్నో వచ్చాయి. వాటిల్లో ప్రధానమైనది 2007లో దక్కిన రాష్ట్రపతి అవార్డు. 'వేస్ట్ టూ వెల్త్' కార్యక్రమం కింద ఇది అందుకున్నా. అంటే ఇంట్లో ఉండే వ్యర్థ పదార్థాలతో ఎరువులు తయారు చేయడం. దాన్ని డ్వాక్రా మహిళలకు నేర్పించి, తద్వారా వారికి ఉపాధి కల్పించడం. ఎంతో మంచి కార్యక్రమం అది. అంతకుముందు నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి 'జననీ అవార్డు' తీసుకున్నా. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించినందుకు ఈ పురస్కారం లభించింది. ఆ తరువాత వైఎస్సార్ నుంచి సామాజిక సేవకు గాను 'ఉగాది పురస్కారం' అందుకున్నా. వీటితోపాటు మరెన్నో అవార్డులు దక్కాయి. వాటి వైపు చూసినప్పుడల్లా నాకు మరింత ప్రేరణ కలుగుతుంది. ఉత్సాహం ఉప్పొంగుతుంది.

తయారీతో పాటు బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సులు నేర్చుకున్నా. ఇవన్నీ ఎందుకంటే... పేద మహిళలకు ఉచితంగా శిక్షణనిచ్చి, వారికి ఉపాధి కల్పించడానికి! ఆ తరువాత వారికి మార్కెటింగ్ కూడా నేనే చేసిపెట్టాను.

ముప్ఫై వేల అద్దెతో...

నా సేవా కార్యక్రమాలకు ఒక వేదిక ఉంటే అవసరంలో ఉన్న మహిళలు నేరుగా వచ్చి తమ బాధలు చెప్పుకోగలుగుతారు. దీంతో ఓ కార్యాలయం అద్దెకు తీసుకున్నా. అందులో పేద మహిళలకు నైపుణ్య శిక్షణ ఇప్పించా. మహిళా ఖైదీలు కుటీర పరిశ్రమలు పెట్టుకొనేలా ప్రోత్సహించా. సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమయ్యే ఔత్సాహికులకు 'ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్' ద్వారా ఉచితంగా కోచింగ్ ఇప్పిస్తున్నా. సాధూరాం నేత్రాలయం ద్వారా 20 వేల మందికి పైగా ఉచిత కంటి ఆపరేషన్లు చేయించగలిగాను. 'చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్' కోసం రక్తదాన అవగాహన శిబిరాలు మొదట నిర్వహించింది నేనే. నా కార్యాలయానికి నెలకు రూ.30 వేలు అద్దె చెల్లించేదాన్ని. ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా నా

కుటుంబ సభ్యులతో...

సొంత డబ్బు ఖర్చు పెట్టానే గానీ, ఎవరి వద్దా ఒక్క పైసా తీసుకోలేదు. అవసరమైనప్పుడు మా ఇంట్లోవాళ్లే ఆర్థిక సాయం చేస్తున్నారు.

బిచ్చగాళ్లకు పునరావాసం...

భిక్షాటన సమాజాన్ని పీడిస్తున్న సమస్య. విధి లేక కొందరు... విధిరాత సరిగా లేక మరికొందరు... వీధులు, ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర దయనీయంగా జీవితం వెళ్లదీస్తుంటారు. చూసినప్పుడల్లా నా కడుపు తరుక్కుపోతుంటుంది. వారిని ఆ వృత్తి నుంచి బయటకు తీసుకురావాలనుకున్నాను. అందుకోసం 'శ్రీలక్ష్మి స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్' తరఫున హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశాను. అయితే మొదట్లో 'మమ్మల్ని తీసుకెళ్లి కళ్లు, కిడ్నీలు అమ్ముకొంటుంది' అంటూ నాపై బిచ్చగాళ్లు దాడి చేశారు. తిట్టారు. అయినా వెనక్కి తగ్గలేదు.

ఎవరూ అంత రిస్క్ తీసుకోరు...

నా జీవితంలో మరిచిపోలేని ఘట్టం ఖైదీలకు కంటి చికిత్స. 1999లో జరిగిందీ ఘటన. చంచల్‌గూడ జైలులో ఖైదీలకు వైద్య పరీక్షలు చేయించాం. వారిలో కొందరికి శస్త్రచికిత్సలు అవసరమయ్యాయి. ఖైదీలను బయటకు తీసుకువెళ్లాలి. అదీ ప్రభుత్వ ఆస్పత్రిలోనే చికిత్స అందించాలి. హోంమంత్రిని కలిసి అనుమతి తీసుకోవాల్సి వచ్చింది. అయితే 'ఆపరేషన్ తరువాత ఖైదీలను జైలుకు తరలించే వరకు బాధ్యత వహిస్తా'నని నన్ను లిఖితపూర్వకంగా ఇమ్మన్నారు. వారిలో ఎవరైనా పారిపోతే నాదే పూచీకత్తు అన్నమాట. నేను వెనకాడలేదు. హామీ పత్రం రాసిచ్చి వారందరికీ హైదరాబాద్ సరోజనీదేవి కంటి ఆసుపత్రిలో చికిత్స చేయించాను. జీవితమంటేనే సవాళ్లు. ఒక మంచి పని కోసం వాటిని ఎదుర్కోవడానికి నేనెప్పుడూ సిద్ధంగానే ఉంటాను.

నా శ్రమకు ఫలితం...

అటు బయటి పనులు, ఇటు కుటుంబ బాధ్యతలు... అన్నీ చక్కదిద్దుకొంటూనే పిల్లలను ఉన్నత చదువులు చదివించాను. నా శ్రమకు తగిన ఫలితం దక్కింది. పెద్దమ్మాయి రోహిణి సిందూరి ప్రజా సేవ చేయాలనే ఉద్దేశంతోనే పట్టుబట్టి మరీ ఐఏఎస్ అయింది. అనుకున్నట్టుగానే డైనమిక్ అధికారిణిగా పేరుతెచ్చుకుంది. ప్రజల ప్రేమ గెలుచుకుంది. ప్రస్తుతం కర్ణాటకలో పనిచేస్తోంది. చిన్నమ్మాయి ప్రియాంకారెడ్డి డాక్టర్. బెంగళూరులో ఉంటోంది. తనూ అక్కడ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తుంటుంది. మా అబ్బాయి సాయివర్ధన్‌రెడ్డి లా చేసి, ప్రస్తుతం సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు.

వాళ్లలోనూ సామాజిక దృక్పథం...

నేను ఇన్నేళ్లుగా సేవా మార్గంలో నడవగలుగుతున్నానంటే అందుకు నా కుటుంబమే కారణం. మాకు ముగ్గురు సంతానం. ఇద్దరు అమ్మాయిలు... ఒక అబ్బాయి. చిన్నప్పుడు మా అమ్మాయిలను కూడా నాతోపాటు సేవా కార్యక్రమాలకు తీసుకువెళ్లేదాన్ని. అలా వాళ్లకూ సామాజిక దృక్పథం అలవడింది. ఇక తాజాగా ద్రవిడియన్ విశ్వవిద్యాలయం నుంచి 'ఉమన్ ఇన్ పాలిటిక్స్'పై నా పీహెచ్‌డీ కూడా పూర్తయింది. ఒక తల్లిగా రత్నాల్లాంటి పిల్లలు... సామాజిక కార్యకర్తగా చాలామంది జీవితాల్లో మార్పులు... ఎవరికి ఏ అవసరం వచ్చినా 'లక్ష్మక్క' ఉందన్న భరోసా... ఇంకేం కావాలి! అనురాగం పంచే కుటుంబం... ఆప్యాయంగా పిలిచే అభిమానం... ఇంతకు మించిన సంతృప్తి, సంతోషం ఎవరికి దొరుకుతుంది!"

● హనుమా

హోమ్ కేర్

కాస్త జాగాలో నీట్‌గా సర్దేద్దాం!

'ఇంట్లో ఎంత స్థలం ఉన్నా సరిపోవడం లేదు' అనే ఫిర్యాదు తరచూ ప్రతి ఇంట్లో వినిపిస్తుంది. ఉన్న స్పేస్‌ను సద్వినియోగం చేసుకోవడం తెలియకపోతే ఎంత స్థలం ఉన్నా వృథానే. మనసు పెట్టి గృహోపకరణాలను పొందికగా అమర్చుకుంటే బోలెడంత జాగా కలిసొస్తుంది. అందుకోసం ఏం చేయాలంటే...

ఇంట్లో ఖాళీ స్థలం కొంచెం ఉన్నప్పుడు దాన్ని సరిగ్గా వాడుకోవాలి. చిన్న కుర్చీలు, సీట్లు గదిలో ఎక్కువ స్థలాన్ని ఆక్రమిస్తాయి. కారణం వాటన్నింటి మధ్యన ఎక్కువ స్థలం వదలాల్సిరావటమే. మొదట ఇంట్లో మీరు వాడని వస్తువులు ఇంట్లో ఎక్కడెక్కడ ఉన్నాయో జాబితా రాసి క్రమంగా వాటిని తొలగించాలి. మితమే హితం అనే సూత్రాన్ని పాటించాలి. అవసరం లేని బుక్‌కేస్‌లు, డిస్‌ప్లే కేస్‌లు తొలగించవచ్చు.

సోఫాతో స్థలం కలిసొస్తుంది

పెద్ద పెద్ద కుర్చీలు, టేబుళ్లను వాడాలనుకుంటే స్థలం ఎక్కువ కావాలి. అందుకే కూర్చోవడానికి ఎక్కువ కుర్చీలకు బదులు ఒక్కటే పెద్ద సోఫా వాడితే స్థలం కలిసొస్తుంది. దాంతో కుర్చీలతో గదంతా చిందరవందరగా ఉండకుండా చూడొచ్చు.

వాల్‌షెల్ఫ్‌లు బెస్ట్

ఇంట్లో కొద్ది స్థలమే ఉన్నప్పుడు వాల్ షెల్ఫ్‌లు ఏర్పాటు చేయాలి. షెల్ఫ్‌బోర్డ్‌ను గోడలో ఏర్పాటు చేయడం వల్ల గదిలో స్థలం కలిసొస్తుంది. ఎక్కడైనా ఏర్పాటు చేసుకొనే వీలుండడం వీటి ప్రత్యేకత. వస్తువులను గదిలో నేలపైన చిందరవందరగా పడవేయకుండా వాల్‌షెల్ఫ్‌లో ఉంచితే సరి!

ప్రత్యేకమైన ఫర్నీచర్

కొద్ది జాగాలో వాడుకునేందుకు వీలున్న ఫర్నిచర్‌ను ఇప్పుడు ప్రత్యేకించి తయారుచేస్తున్నారు. వీటిని మడతపెట్టడానికి వీలుంటుంది. అలాగే ఒకటికి మించిన అవసరాలకు వీటిని వాడుకోవచ్చు. ఫోల్డ్ అవుట్ డెస్క్‌లు, లాఫ్ట్ బెడ్ లాంటివి కొనాలి.

బ్యూటీ

నల్లని కురుల కోసం...

నల్లని పట్టులాంటి జుట్టు కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. 'కొన్ని సౌందర్య చిట్కాలు పక్షం రోజులు పాటిస్తే చాలు మీరు కోరుకునే నల్లటి జుత్తు మీ సొంతం కావడం ఖాయం' అంటున్నారు హెయిర్ స్టయిలిస్టులు. అవేమిటంటే...

- జింక్, కాపర్ లాంటి ఖనిజాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటే జుత్తు తెల్లబడకుండా నివారించవచ్చు.
- రోజూ స్నానం చేసేముందు బట్టర్ ఆయిల్‌తో మెడ, తలకు మసాజ్ చేయాలి.
- రోజూ కొన్ని నల్ల నువ్వులు తింటే జుట్టు తెల్లబడడం ఆగిపోతుందని ఆయుర్వేదం చెబుతోంది. లేదంటే నువ్వుల గింజలను నీటిలో నానబెట్టి పేస్ట్‌గా చేసి జుట్టుకు పట్టిస్తే సరి.
- తగినంత కొబ్బరినూనెకు మూడు స్పూన్ల నిమ్మరసం కలిపి వెంట్రుకలకు పట్టించి రెండు గంటల సేపు ఉంచి నీటితో కడిగేయాలి.
- కొబ్బరినూనెలో కరివేపాకు వేసి మరిగించాలి. ఆ మిశ్రమాన్ని చల్లార్చి వెంట్రుకలకు పట్టించి, గంటసేపు ఉంచి తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే తెల్లజుట్టు క్రమంగా నల్లబడుతుంది.
- చిన్న వయసులోనే వెంట్రుకలు తెల్లబడడానికి పోషకాహార లోపమూ కారణమే. కాబట్టి బి, ఇ విటమిన్లు ఎక్కువగా ఉండే జీడిపప్పు, బాదం, వాల్‌నట్, తాజాపండ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలి.
- ఒంట్లో ఉండే విషపదార్థాలు కూడా జుట్టు తెల్లబడడానికి కారణమవుతాయి. రోజుకు 10-12 గ్లాసుల నీళ్లు తాగితే విషపదార్థాలను బయటకు పంపొచ్చు.
- ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌ను ఎక్కువగా తిన్నా కూడా వెంట్రుకలు తెల్లబడతాయి. వాటికి బదులు నిమ్మరసం, కూరగాయల సూప్‌లు తాగితే ఐరన్, క్యాల్షియం, విటమిన్-సి ఎక్కువగా లభించి వెంట్రుకలు నిగనిగలాడతాయి.
- ప్రతి రోజూ ఉల్లిపేస్ట్‌తో వెంట్రుకలను రుద్దుతుంటే 15 రోజుల్లో కేశాలు నల్లబడతాయి.
- పాలు, పెరుగు బాగా కలిపి, ఆ మిశ్రమంతో రోజూ కురులను కడిగితే కురులు నల్లగా మెరుస్తాయి.

ప్లాస్టిక్ వ్యర్థం నుంచి ఇంధనం!

ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో చేరకుండా వాటిని ఆయిల్‌గా మార్చుతున్నారు చెన్నై దంపతులు విద్య, అమర్‌నాథ్ మైత్రేయన్‌లు. వాడి పారేసిన ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేయడం తగిన పరిష్కారం కాదు అని భావించి ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి ఏకంగా డీజిల్ తయారుచేసి విక్రయిస్తున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు సంపదను సృష్టిస్తున్నారు.

వినూత్నం

ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి పర్యావరణహితమైన ప్రత్యామ్నాయ ఇందనం తయారుచేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశారు విద్య, అమర్‌నాథ్ మైత్రేయన్‌లు. వారి స్వస్థలం చెన్నై. ఇద్దరూ కామర్స్ గ్రాడ్యుయేట్స్. ఆర్థిక సేవలు అందించే సంస్థను నడిపేవారు. గృహ వ్యర్థాలను వేరుచేయడంలో ప్రజలకు అవగాహన కలిపించే ఓ కార్యక్రమంలో వీరిద్దరూ అనుకోకుండా పాలుపంచుకున్నారు. ఆసక్తిగా అనిపించడంతో తరచూ రకరకాల అవగాహనా కార్యక్రమాలు నిర్వహించేవారు. 'ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేయాలని అందరికీ చెపుతున్నాం. కానీ దానివల్ల పర్యావరణానికి పెద్దగా ప్రయోజనం లేదు' అని భావించారు. మరింత మెరుగైన పద్ధతుల్లో ప్లాస్టిక్ వ్యర్థాల ముప్పును తప్పించుకోవచ్చు అని ఆలోచించి ఆ దిశగా పరిశోధన ప్రారంభించారు.

ప్లాస్టిక్ ముప్పు... పరిష్కారం

"ఒక చిన్న ప్లాస్టిక్ ముక్క కూడా భూమిలో కలవడానికి వేల ఏళ్ల పడుతుంది. భూమి, నీరు, వాతావరణం కలుషితమవడానికి ప్లాస్టిక్ వ్యర్థాలు కారణం అవుతున్నాయి. ఏటా ఐదు మిలియన్ టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఇండియాలో పోగవుతున్నట్టు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నివేదిక తెలుపుతోంది. అందులో 20 శాతమే రీసైకిల్ చేస్తున్నారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీని పూర్తిగా నిషేధించడం

భర్తతో....

వీలుకానప్పుడు, ప్లాస్టిక్ వ్యర్థాలను సమర్థంగా ఉపయోగించుకోవడమే సమస్యకు పరిష్కారం. పనికొచ్చేలా ఉన్న ప్లాస్టిక్ వస్తువులను మాత్రమే రీసైకిల్ చేస్తుండడం వల్ల నాసిరకం ప్లాస్టిక్ అంతా భూమ్మీద, సముద్రంలో కుప్పలుగా పేరుకుపోతోంది. మేము రూపొందించిన విధానంలో అన్ని రకాల ప్లాస్టిక్ వస్తువుల నుంచి ఇంధనం తయారుచేయవచ్చు. ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి ఆయిల్ ఉత్పత్తి చేయడం వల్ల ఇక్కడ సంపదను సృష్టిస్తున్నాం" అని చెప్పారు విద్య.

ప్లాస్టిక్ వ్యర్థాలతో పనికొచ్చే ఇంధనం!

ఆ దిశగా వేగంగా అడుగులు వేసిన విద్య కొద్దికాలంలోనే ఐఐటీ మద్రాస్, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సంస్థల సాయంతో ఒక ఆచరణాత్మక పద్ధతిని రూపొందించారు. థర్మో-కెమికల్ డీ పాలిమరైజేషన్ అనే సాంకేతికతను సృష్టించారు. రీ సైక్లింగ్ ప్రక్రియకు ఇది పూర్తిగా భిన్నమైనది. దీనిద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను ద్రవరూపంలో ఇంధనంగా మార్చుతారు. సాధారణంగా ఈ పద్ధతిని పాత టైర్లను కరిగించే పరిశ్రమలో వాడతారు. ఈ పద్ధతిలో కొన్ని మార్పులు చేసి అన్ని రకాల పాలిమర్ వ్యర్థాలను ప్రాసెస్ చేసి ఆయిల్‌గా మార్చేలా అభివృద్ధి చేశారు. బాయిలర్ లోపల ఆక్సిజన్ రహిత వాతావరణం కల్పించి, 500 డిగ్రీల సెల్సియస్ వద్ద ప్లాస్టిక్ పదార్థాలను కరిగిస్తారు. అప్పుడు ప్లాస్టిక్ ఆవిరిగా మారుతుంది. తరువాత దాన్ని చల్లబరిస్తే జీవ ఇంధనంగా మారుతుంది. ఇలా తయారుచేసిన ఆయిల్‌ను 'పైరో ఆయిల్' అంటారు. ఇది పెట్రోల్, డీజిల్‌తో పోలిస్తే చౌకగా లభిస్తుంది.

విద్య తన భర్తతో కలసి 'పాటర్‌సన్ ఎనర్జీ' పేరుతో కంపెనీ స్థాపించారు. ప్లాస్టిక్ నుంచి ఇంధనం తయారుచేసే తొలి ప్లాంట్‌ను 2016లో చెన్నైలో ప్రారంభించారు. ఇక్కడ రోజుకు ఆరు టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రాసెస్ చేసి హైగ్రేడ్ డీజిల్ తయారుచేస్తున్నారు. గతేడాది ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొని, మథురలో ఓ ప్లాంట్ నిర్మాణాన్ని ప్రారంభించారు. రాబోయే రోజుల్లో ఇండియా అంతటా ఇలాంటి ప్లాస్టిక్ డీజిల్ తయారీ ప్లాంట్‌లు ఏర్పాటుచేసేందుకు వీరు ప్రయత్నాలు చేస్తున్నారు.

"పెట్రోల్‌కు ఇది సురక్షితమైన ప్రత్యామ్నాయం. చెన్నైలోని అశోక్‌లేలాండ్ టెక్నికల్ సెంటర్, లీలా ప్యాలెస్ చెన్నై హోటల్స్, హిల్టన్ చెన్నై, టీవీఎస్ మోటార్స్ లాంటి పలు సంస్థలకు ఇప్పుడు మేము ప్లాస్టిక్ డీజిల్‌ను సరఫరా చేస్తున్నాం" అని చెబుతారు విద్య.

ఒక వెబ్‌సైట్ ఓపెన్ కాక పోయినా, మీరు పనిచేసే ఆఫీస్‌లో గానీ, స్కూల్‌లో గానీ కొన్ని సైట్లు ఓపెన్ కాకుండా బ్లాక్ చేసి ఉన్నా అందరికీ మొట్ట మొదట గుర్తొచ్చే విషయం 'విపిఎన్'. ఈ మధ్య కాలంలో మన దగ్గర కూడా విపిఎన్ అప్లికేషన్ల విని యోగం బాగా పెరిగింది. అయితే ఈ అప్లికేషన్ల ద్వారా చాలామంది వ్యక్తిగత డేటా ఇతరుల చేతుల్లోకి వెళుతోంది అన్నది ఆందోళన కలిగించే అంశం. ఈ నేపథ్యంలో విపిఎన్ అప్లికేషన్లను ఉపయోగించడం ఎంతవరకు శ్రేయస్కరం అన్నది తెలుసుకుందాం.

డేంజర్ అప్లికేషన్లు

విపిఎన్ యాప్స్‌లో ఉచితం, పెయిడ్ అప్లికేషన్స్ ఉంటాయి. ఉచితంగా లభించే వాటికి వీలైనంత వరకు దూరంగా ఉండండి. మీ ఫోన్‌లో లేదా కంప్యూటర్‌లో మీరు ఓపెన్ చేయాలనుకున్న ట్రాఫిక్ మొత్తం ఆయా సర్వీసుల సర్వర్ల నుంచి రీరూట్ చేయబడుతూ ఉంటాయి. ఇలా భారీ మొత్తంలో డేటా ట్రాఫిక్ హ్యాండిల్ చేయగలిగే విధంగా సర్వర్లు మెయింటెన్ చేయాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అలాంటప్పుడు మీకు గూగుల్ ప్లే స్టోర్‌లో గానీ, విండోస్ కంప్యూటర్‌లో గానీ లభించే ఉచిత విపిఎన్ సర్వీసులు ఒకవైపు తమకు డబ్బు ఖర్చు అవుతూనే మీకు ఉచితంగా ఎలా సేవ చేస్తున్నాయన్న సందేహం మీకు రావాలి. కచ్చితంగా అలాంటి అప్లికేషన్స్ మీ నుంచి డబ్బులు తీసుకోపోయినప్పటికీ, మీ డేటాని అమ్ముకోవడం ద్వారా డబ్బు సంపాదిస్తూ ఉంటాయి. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో కూడా ఉచిత విపిఎన్ అప్లికేషన్ల జోలికి వెళ్ళకండి.

ప్రైవసీ పాలసీ

ఉచిత విపిఎన్ సర్వీస్ వాడబోయే ముందు దాంట్లో పేర్కొన్న నియమ నిబంధనలను ఒకసారి నిశితంగా పరిశీలిస్తే ఆశ్చర్యపోతారు. అందులో స్పష్టంగా మీ డేటా థర్డ్ పార్టీలకి షేర్ చేయబడుతుందని స్పష్టంగా పేర్కొని ఉంటుంది. అదంతా మనం చదవకపోవడం వల్ల మన చేజేతులా మన వ్యక్తిగత సమాచారం ఇతరుల బారిన పడేలా చేస్తుంటాం. అంతేకాదు, గూగుల్ ప్లే స్టోర్, ఇతర ప్లాట్ ఫామ్స్ నుంచి భారీ మొత్తంలో ఇండియన్స్ డౌన్‌లోడ్ చేసుకుంటున్న విపిఎన్ అప్లికేషన్లు చైనా నుంచి ఆపరేట్ చేయబడుతున్నవి కావడం గమనార్హం. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు, వాటి ప్రజల మీద పరోక్షంగా నిఘా పెట్టడం చైనాకు చాలా కాలంగా అలవాటు. చైనా ప్రభుత్వంతో ఈ విపిఎన్ అప్లికేషన్లు డేటాని షేర్ చేసుకుంటాయి.

మాల్‌వేర్స్

బాగా పాపులర్ అయిన విపిఎన్ అప్లికేషన్లు పరవాలేదు గానీ, అంతగా ప్రాచుర్యం పొందని చిన్న చిన్న విపిఎన్ అప్లికేషన్లలో అంతర్గతంగా మాల్‌వేర్ ఉన్నట్లు గతంలో అనేక ప్రముఖ యాంటీ వైరస్ సంస్థల నివేదికల ద్వారా అర్థమైంది. ఉదాహరణకు 150 విపిఎన్ అప్లికేషన్లు నిశితంగా పరిశీలించగా, అందులో 27 అప్లికేషన్లలో మాల్‌వేర్ ఉన్నట్లు వెల్లడయింది. ప్రముఖ యాంటీవైరస్ సంస్థ వైరస్ టోటల్ ఈ ఫలితాలు వెల్లడించింది.

ఎలాంటిది ఎంచుకోవాలి?

ఒకవేళ మీ అవసరాలకోసం తప్పనిసరిగా విపిఎన్ అప్లికేషన్ వాడాలంటే ఖచ్చితంగా బాగా పాపులరైన నార్డ్ విపిఎన్, ఎక్స్‌ప్రెస్ విపిఎన్, సైబర్ గోస్ట్ వంటి సర్వీసులకి సబ్‌స్క్రిప్షన్ చెల్లించడం ద్వారా ఉపయోగించండి. ఒకసారి సబ్‌స్క్రిప్షన్ తీసుకుంటే మీ ఫోన్, కంప్యూటర్, ల్యాప్‌టాప్... ఇలా ఎన్ని రకాల డివైజ్లను ఒకేసారి కనెక్ట్ చేసుకునే అవకాశం అవి కల్పిస్తున్నాయి అన్నది కచ్చితంగా పరిశీలించండి. మీ దగ్గర భారీ మొత్తంలో డివైజ్‌లు ఉంటే వాటన్నిటికీ విపిఎన్ ఉపయోగించుకోవచ్చు. అలాగే మీరు ఎంపిక చేసుకునే పెయిడ్ విపిఎన్ సర్వీస్ ఓపెన్ విపిఎన్, ఓపెన్ ఎస్ఎస్‌హెచ్ వంటి పలు రకాల ఎన్క్రిప్షన్ పద్ధతుల ద్వారా మీ డేటాని సురక్షితంగా కాపాడే విధంగా ఉండాలి. అలాగే ఒకవేళ కనెక్షన్ డ్రాప్ అయినప్పుడు, అప్పటివరకు మీ అన్ని ఆన్‌లైన్ యాక్టివిటీలు నిలిపి వేసే విధంగా 'కిల్ స్విచ్' అనే సదుపాయం కూడా

దాంట్లో ఉండాలి. మీ ఒరిజినల్ ఐపీ అడ్రస్ అవతలి వారికి తెలియకుండా ఉండటం కోసం ఇది ఉపయోగపడుతుంది. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఎన్ని లొకేషన్లకు సంబంధించిన సర్వర్లని మీరు సబ్‌స్క్రైబ్ చేసే విపిఎన్ సపోర్ట్ చేస్తుందా అన్నది కూడా పరిశీలించాలి! అధికశాతం విపిఎస్ సర్వీసులు 30 రోజుల పాటు ఉచితంగా టెస్ట్ చేసుకునే విధంగా పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ అందిస్తుంటాయి. దీనికి మీరు చేయాల్సిందల్లా మీ క్రెడిట్ కార్డు లింక్ చేయడం మాత్రమే. 30 రోజులు ముగిసిన తర్వాత మీ క్రెడిట్ కార్డు నుంచి మొట్టమొదటి బిల్ ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది. ఒకవేళ ఆ సర్వీస్‌తో మీరు సంతృప్తి చెందకపోతే ఆ లోపల మీరు సబ్‌స్క్రిప్షన్ క్యాన్సిల్ చేసుకోవచ్చు. వేరే ప్రోడక్ట్ ఎంపిక చేసుకోవచ్చు.

టార్ వాడొచ్చా?

అయితే మరికొంతమంది విపిఎన్ బదులుగా టార్ నెట్‌వర్క్ వాడుతుంటారు. వాస్తవానికి పెద్దగా నమ్మశక్యం గానీ థర్డ్ పార్టీ విపిఎన్ సర్వీసులతో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా వేలాదిమంది వాలంటీర్స్ చేత నిర్వహించబడుతున్న లాభాపేక్షలేని టార్ నెట్‌వర్క్ ద్వారా రక్షణ పొందడం శ్రేయస్కరం. దీన్ని ఉపయోగించాలంటే మీ కంప్యూటర్లో, ఫోన్లో టార్ బ్రౌజర్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మూడు టార్ రిలేల ఆధారంగా మీ ట్రాఫిక్ మొత్తం ఎన్‌క్రిప్ట్ చేయబడిన ప్రయాణం చేస్తుంది. అంతేకాదు ఏ వెబ్‌సైట్ ఓపెన్ చేసినప్పుడైనా కావాలంటే కొత్త సర్క్యూట్ క్రియేట్ చేసే విధంగా కూడా రిక్వెస్ట్ చేయవచ్చు. అంతే కాదు ఈ బ్రౌజర్‌లో మరింత ప్రైవసీ కల్పించే అనేక యాడాన్స్ ఉండడంతో పాటు ప్రమాదకరమైన ఫ్లాష్ వంటి ప్లగ్ ఇన్స్ డిజేబుల్ చేయబడి ఉంటాయి. దీంట్లో అనేక సెక్యూరిటీ లెవెల్స్ కూడా మన అవసరాన్ని బట్టి ఎంపిక చేసుకోవచ్చు.

ప్రాక్జీకీ, విపిఎన్‌కీ తేడా?

వెబ్ ప్రాక్జీ అనే పదం కూడా తరచూ వినిపిస్తూ ఉంటుంది. చాలా సందర్భాల్లో ఈ రెండింటినీ ఒక దాని బదులు మరొకటి వాడుతుంటారు. వాస్తవానికి రెండూ ఒకే రకంగా పనిచేసినప్పటికీ, రెండిటికి మధ్య కొన్ని వ్యత్యాసాలు ఉన్నాయి. మీరు ఏదైనా నిర్దిష్టమైన వెబ్‌సైట్ ఓపెన్ చేయడానికి ప్రయత్నించినప్పుడు, ఆ వెబ్ సర్వర్‌కి మీ ఐపీ అడ్రస్ నేరుగా కన్పిస్తుంది. అలా కాకుండా ప్రాక్జీ వాడినప్పుడు, మీ ఒరిజినల్ ఐపీ అడ్రస్ బదులుగా మీరు ఉపయోగించిన ప్రాక్జీ సర్వర్‌కి మీ రిక్వెస్ట్ పంపించబడి, అక్కడ నుంచి అవతల ఉన్న సర్వర్‌కి ఆ ప్రాక్జీ సర్వర్ ద్వారా రిక్వెస్ట్ వెళుతుంది. అంటే మీ ఒరిజినల్ ఐపీ అడ్రస్‌ని అవతల ఉన్న సర్వర్ తెలుసుకునే అవకాశమే ఉండదు. ఇక్కడ విపిఎన్ కూడా అదే రకమైన పనిచేసినప్పటికీ, విపిఎన్ సర్వీసులు మరింత మెరుగ్గా పనిచేస్తాయి. ప్రాక్జీ సర్వలలో డేటా ఎన్‌క్రిప్షన్ జరగదు. ఫలితంగా డేటా మ్యాన్ ఇన్ మిడిల్ అటాక్స్ అనే పద్ధతుల ద్వారా చాలా సులభంగా హ్యాక్ చేసే ప్రమాదముంటుంది. అందుకే వీలయినంత వరకు సులభంగా లభించే ఉచిత ప్రాక్జీ సర్వర్ల మీద ఆధారపడకుండా ఉండాలి.

ఎస్ఎస్‌హెచ్ టన్నెలింగ్

అదేవిధంగా ఎస్ఎస్‌హెచ్ టన్నెలింగ్ అనే పదం కూడా మనం వింటూ ఉంటాం. లైనెక్స్, మ్యాక్ ఆపరేటింగ్ సిస్టంలు వాడేవారికి ఈ పదం బాగా సుపరిచితం. రిమోట్ లాగిన్స్, ఫైల్ ట్రాన్స్‌ఫర్లని ప్రమాదకరమైన నెట్‌వర్క్‌లలో కాపాడటం కోసమే ఈ టెక్నిక్ ఉపయోగపడుతుంది. విపిఎన్‌తో పోలిస్తే ఈ టన్నెలింగ్‌ని సెటప్ చేయడం కొద్దిగా కష్టసాధ్యంగా ఉంటుంది. ఇటీవల విండోస్ 10 యూజర్లకి కూడా ఓపెన్ ఎస్ఎస్‌హెచ్ అందుబాటులోకి వచ్చింది.

నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar

విపిఎన్ సర్వీసుల్లో భారీ మొత్తంలో వినియోగదారుల డేటా థర్డ్ పార్టీ కంపెనీలకి అమ్ముకుంటున్న కొన్ని సంస్థల భాగోతం గతంలో బయటపడింది. అలాంటి వాటిలో 'హోలా విపిఎన్' మరియు ఫేస్‌బుక్ సంస్థకు చెందిన 'ఒనావో విపిఎన్' ప్రధానమైనవి. వీటికి సాధ్యమైనంత దూరంగా ఉండండి. వీటితోపాటు 'హైడ్‌మైయాస్', 'బెటర్‌నెట్' విపిఎన్ సర్వీసులు కూడా వినియోగదారుల డేటాను దుర్వినియోగం చేస్తున్నట్లుగా ఆధారాలతో సహా గతంలో పలుమార్లు వెలుగులోకి వచ్చింది.

టెక్ సందేహాలు

చోరీ అయితే గుర్తించేదెలా?

ల్యాప్‌టాప్ చోరీ అయితే ట్రాక్ చేసుకోవటం కోసం మంచి అప్లికేషన్ తెలపండి.
- శ్రీనివాస వర్మ

విండోస్ 10 ఆపరేటింగ్ సిస్టమ్‌లో సెట్టింగ్స్‌లోకి వెళితే.. 'ఫైండ్ మై డివైజ్' అనే ప్రత్యేకమైన ఆప్షన్ ఉంటుంది. మొట్ట మొదట దీన్ని ఎనేబుల్ చేసుకోండి. ఇది మీ మైక్రోసాఫ్ట్ అకౌంట్‌తో లింక్ అయి ఉంటుంది. ఒకవేళ ఎప్పుడైనా దురదృష్టవశాత్తు మీ ల్యాప్‌టాప్ పోతే వేరే కంప్యూటర్ లేదా ఫోన్‌లో మీ మైక్రోసాఫ్ట్ అకౌంట్‌లోకి లాగిన్ అయి మీ ల్యాప్‌టాప్ ప్రస్తుతం ఎక్కడ ఉందో దాని ఐపీ అడ్రస్ ఆధారంగా తెలుసుకునే ప్రయత్నం చేయవచ్చు. అయితే ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లలో జీపీఎస్ సదుపాయం ఉండదు కాబట్టి నిక్కచ్చి ఫలితాలు లభించవు. కేవలం ఐపి అడ్రస్ ఆధారంగా మాత్రమే పోలీస్ కంప్లైంట్ చేసి, ఆ ఐపీ అడ్రస్ సదరు ఐఎస్‌పీ చేత ఆ రోజు ఎవరికి కేటాయించబడింది అన్నది తెలుసుకుని దాన్ని రికవర్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఇకపోతే 'ప్రే' అనే ఓ థర్డ్ పార్టీ యాప్ కూడా విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ కోసం లభిస్తోంది. ఇది ల్యాప్‌టాప్ ఎక్కడ ఉందో లొకేషన్ చూపించడంతో పాటు (ఇది కూడా ఐపి అడ్రస్ ఆధారంగానే పనిచేస్తుంది), దొంగిలించిన వ్యక్తి ఫొటోని ల్యాప్‌టాప్ ముందు భాగంలో ఉండే కెమెరా ద్వారా క్యాప్చర్ చేసి మనకు చూపిస్తుంది.

ఆ వీడియోలు ప్లే కావాలంటే..!

యూట్యూబ్‌లో కొన్ని వీడియోలు ఓపెన్ చేస్తుంటే 'రిస్ట్రిక్టెడ్ మోడ్' అని మెసేజ్ వస్తూ ఆ వీడియో ప్లే కావడం లేదు. దీనికి పరిష్కారం చెప్పగలరు.
- ప్రవీణ్

యూట్యూబ్‌లో అసభ్యకరమైన కంటెంట్ చిన్నపిల్లల దృష్టికి రాకుండా ఉండటం కోసం, కంటెంట్‌ను ఫిల్టర్ చేయడం కోసం 'రిస్ట్రిక్టెడ్ మోడ్' అనే ఒక సెట్టింగ్ ఉంటుంది. ఏ కారణం చేతనైనా అది ఎనేబుల్ చేయబడినప్పుడు, ఇబ్బందికరమైన వీడియోలు ఓపెన్ చేయడానికి ప్రయత్నిస్తే ఇలాంటి మెసేజ్ కనిపిస్తుంది. అలాంటప్పుడు మీ యూట్యూబ్ అప్లికేషన్‌లో సెట్టింగ్స్‌లోకి వెళ్లి రిస్ట్రిక్టెడ్ మోడ్ సెట్టింగ్ వెతికి దాన్ని డిజేబుల్ చేయండి. ఆటోమేటిక్‌గా ఇంతకు ముందు ఓపెన్ కాని వీడియోలు ఇప్పుడు ఓపెన్ కావటం మొదలవుతాయి.

ఫ్లాష్ సేల్స్ ఎందుకు?

ఫోన్ తయారీ కంపెనీలు ఫ్లాష్ సేల్స్ ఎందుకు నిర్వహిస్తాయి? దాని బదులు నేరుగా అమ్మొచ్చు కదా?
- కరుణాకర్

దీనికి అనేక కారణాలు ఉన్నాయి. అన్నిటికన్నా మొదటిది కేవలం కొద్ది సేపు మాత్రమే లభిస్తుంది అని చెబితే ఆ వస్తువు పట్ల ఒక ప్రత్యేకమైన క్రేజ్ ఏర్పడుతుంది. ఆ కారణం చేత చాలా తక్కువ సమయంలో ఎక్కువ అమ్మకాలు జరుగుతాయి. అది ఎల్లప్పుడూ లభించే వస్తువు అనే భావన వినియోగదారుల్లో కలిగితే ఇవాళ కాకపోతే రేపు కొనవచ్చు అనే ఆలోచన వస్తుంది. దాంతో వేరే ఫోన్ తయారీ కంపెనీలు రేపు ఏదైనా కొత్త మోడల్ విడుదల చేస్తే కస్టమర్ల దృష్టి తమ ఫోన్ మోడల్ నుంచి అటు వైపు మళ్ళుతుంది. అలా మళ్లే లోపు వారిచేత ఫోన్ కొనిపించాలి అనే ఆలోచనతో ఫోన్ తయారీ కంపెనీలు ఇలా ఫ్లాష్ సేల్స్ వైపు మొగ్గు చూపిస్తుంటాయి. మరి కొన్ని సందర్భాల్లో డిమాండ్‌కి తగ్గట్లు తమ దగ్గర తగినన్ని ఫోన్లు సిద్ధంగా లేనప్పుడు ఇలా అందుబాటులో ఉన్న కొద్ది మొత్తం ఫోన్లతో ఫ్లాష్ సేల్స్ జరుపుతాయి.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం
navya@andhrajyothy.com

నయా ఫీచర్

వాట్సప్‌కు ఫింగర్‌ప్రింట్ లాక్!

వాట్సప్‌లో ఫొటోలు, వీడియోలు షేర్ చేసుకుంటుంటారు. మరి ఇతరులు ఫోన్ తీసుకున్నప్పుడు వాట్సప్ ఓపెన్ చేసి చూస్తే..? అందుకే వాట్సప్ వినియోగదారుల కోసం ఆ సంస్థ ఫింగర్‌ప్రింట్ ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్‌ను ఫింగర్‌ప్రింట్‌తో లాక్ చేస్తుంటారు కదా! అలాగే వాట్సప్ యాప్‌ను ఫింగర్‌ప్రింట్‌తో లాక్ చేసుకోవచ్చు. ఇప్పటికే మీరు వాట్సప్‌ను వాడుతున్నట్లయితే యాప్‌ను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా ఈ ఫీచర్‌ను పొందవచ్చు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి కొత్త వెర్షన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా కూడా పొందవచ్చు. ఫింగర్‌ప్రింట్ లాక్‌ను సెట్ చేసుకోవడానికి సెట్టింగ్స్‌లో అకౌంట్స్ విభాగంలో, ప్రైవసీ ఆప్షన్‌ని ఎంచుకోవాలి. అందులో ఫింగర్‌ప్రింట్ లాక్‌ను ఎనేబుల్ చేసుకోవాలి. ఎనేబుల్‌లో పెట్టుకున్న తరువాత ఎంత సమయంలో ఆటోమెటిక్‌గా లాక్ అవ్వాలో సెట్ చేసుకోవచ్చు. ఒక నిమిషం సెట్ చేసుకుంటే నిమిషం తరువాత వాట్సప్ ఆటోమెటిక్‌గా లాక్ అవుతుంది. అప్పుడు మీరు ఫింగర్‌ప్రింట్‌తో మాత్రమే వాట్సప్ ఓపెన్ చేయగలుగుతారు.

వినూత్నం

వసతి సరికొత్తగా...

చదువు, ఉద్యోగం కోసం పట్టణాలకు వచ్చే వారు అద్దెగదుల్లో లేదంటే హాస్టళ్లలో ఉండేవారు. కొద్దికాలంగా పేయింగ్ గెస్ట్ వసతి ఎక్కువ మందిని ఆకర్షిస్తోంది. ఇప్పుడు అందర్నీ 'కో-లివింగ్' సౌకర్యం ఆకట్టుకుంటోంది. హాస్టల్, పేయింగ్ గెస్ట్‌గా అయ్యే ఖర్చులోనే మెరుగైన వసతి, ఇతరులతో గదిని పంచుకునే వీలుండడంతో ఈమధ్య యువత 'కో-లివింగ్' పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. పెద్ద పెద్ద పట్టణాల్లోని పలు కంపెనీలు కస్టమర్ల అభిరుచికి తగ్గట్టుగా 'కో-లివింగ్ గదులకు మెరుగులు దిద్దుతున్నాయి.

ఈ కాన్సెప్ట్ కొత్తదేం కాదు...

'ఒయో' కంపెనీ 2018లో 'ఒయో లైఫ్'ను ప్రారంభించింది. ఢిల్లీ, బెంగుళూరు, పుణే నగరాల్లో 500కు పైగా భవంతుల్లో 25వేల మందికి వసతి కల్పించేందుకు ఏర్పాట్లు ఏసింది. అంతేకాదు ప్రతి

నెలా 3000 మందికి వసతి సేవల్ని పెంచుకుంటూ వస్తోంది. "ఇటీవలి కాలంలో అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో కో-లివింగ్ ట్రెండ్ పెరుగుతోంది. ఈ కాన్సెప్ట్ ఈమధ్య వచ్చింది కాదు. పూర్వం దర్మశాలలు, పూటకూళ్ల ఇళ్లు ఉండేవి. ప్రస్తుతం అద్దె గదులు, హాస్టళ్లు, పీజీ వసతి వంటివి పుట్టుకొచ్చాయి. ఇలా రకరకాలుగా 'కో-లివింగ్' భావన ఎప్పటి నుంచో ఉంది" అంటారు ఒయో సీఈవో రోహిత్ కపూర్.

కస్టమర్ల అభిరుచిని బట్టి సేవలు...

ఫర్నీచర్, ఏసీ, కిచెన్, లాండ్రీ, వైఫై, టీవీ, రెగ్యులర్ హౌస్ కీపింగ్, ఆరోగ్యకరమైన ఆహారం, పవర్ బ్యాకప్, జిమ్, సీసీటీవీ నిఘా ఇలా అన్ని రకాల సౌకర్యాలతో 'కో-లివింగ్ రూమ్స్' ఆకట్టుకుంటున్నాయి. 'యువర్ స్పేస్' అనే సంస్థ విద్యార్థులకు వసతి ఏర్పాట్లు చూస్తుంది. ముంబయి, ఢిల్లీ, ఘండీగఢ్, అహ్మదాబాద్, ఇండోర్, పుణే నగరాల్లో సేవలు అందిస్తోందీ సంస్థ. స్పెషల్ ఫుడ్, లాండ్రీ, ప్రైవేట్ రూమ్ వంటి సౌకర్యాలు కావాలంటే కొంచెం ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. "తల్లితండ్రులు తమ పిల్లలకు మెరుగైన వసతులున్న గదులు కోరుకుంటున్నారు. అందుకోసం కొంచెం ఎక్కువ ఖర్చయినా వెనుకాడట్లేదు. కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా సర్వీసు చేస్తున్నాం" అంటారు యువర్‌స్పేస్ యజమాని సుభాష్ లాల్.

'కో-లివింగ్ రూమ్స్ షేర్ చేసుకునేవారు నెలకు రూ.6వేల నుంచి 23వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. "నాతో రూమ్ షేర్ చేసుకునే వారిలో నాకు నచ్చిన, నచ్చని లక్షణాలు ఉండేవి కాదు. వారితో అడ్జస్ట్ అయ్యేందుకు కొంత ఇబ్బంది పడ్డాను. ఇక్కడ పరిస్థితులు భిన్నంగా ఉంటాయి" అంటూ తన అనుభవాలు పంచుకుంటాడు రోహతక్‌కు చెందిన 25ఏళ్ల అనుభవ్ సిన్హా. కొత్తప్రదేశంలో అక్కడి వాతావరణానికి అలవాటు పడి చదువు, ఉద్యోగం చూసుకునేవారికి 'కో-లివింగ్ రూమ్స్ ఎంతో ఉపయోగపడుతున్నాయి.

డైలీ సుడోకు - 184

4		3						
					9	6	4	
		6					1	8
	3		2	5				
8	2						5	7
				1	3		9	
7	8					4		
	6	9	3					
						7		9

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 183 సమాధానం

8	2	3	4	1	7	6	9	5
6	5	1	2	3	9	4	8	7
4	9	7	8	6	5	3	1	2
5	6	4	7	9	3	8	2	1
7	8	9	1	2	4	5	3	6
1	3	2	6	5	8	7	4	9
9	4	8	5	7	2	1	6	3
3	7	6	9	8	1	2	5	4
2	1	5	3	4	6	9	7	8

చలో కేరళ

మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న సినిమా 'సరిలేరు నీకెవ్వరు'. ప్రొఫెసర్ భారతి పాత్రలో విజయశాంతి, హీరోయిన్‌గా రష్మిక మందన్న నటిస్తున్నారు. దిల్ రాజు వెంకటేశ్వర క్రియేషన్స్ సమర్పణలో జి.ఎం.బి. ఎంటర్‌టైన్‌మెంట్, ఎ.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో అన్నపూర్ణ 7ఏకర్స్‌లో వేసిన సెట్‌లో చిత్రీకరణ చేశారు. కేరళలో కీలక సన్నివేశాలను తెరకెక్కించడానికి బయలుదేరినట్టు ఆదివారం అనిల్ రావిపూడి ట్వీట్ చేశారు. సోమవారం నుండి ఈ నెలాఖరు వరకు కేరళ, తమిళనాడులో షూటింగ్ చేయనున్నారు. ఈ షెడ్యూల్‌తో సినిమా దాదాపు పూర్తి కానుందట! ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.

రచయితలు లేకపోతే మేము లేమన్నది వాస్తవం!

- చిరంజీవి

"చిత్రసీమలో దర్శక, నిర్మాతల తర్వాత నేను అత్యంత గౌరవించేది రచయితలనే! వాళ్లతో సన్నిహితంగా ఉంటాను. రచయితలు లేకపోతే మేము (నటీనటులం) లేమన్నది వాస్తవం! అనుభవజ్ఞులైన, ప్రతిభావంతులైన రచయితలను సన్మానించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సభకు నన్ను పిలకపోయి ఉంటే బాధపడేవాణ్ణి. నా జీవితంలో మరువలేని ఘట్టమిది" అని చిరంజీవి అన్నారు. 'తెలుగు సినీ రచయితల సంఘం' 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆదివారం హైదరాబాద్‌లో రజతోత్సవాన్ని నిర్వహించారు. జీవిత సాఫల్య పురస్కార గ్రహీతలు ఆదివిష్ణు, రావి కొండలరావు, కోదండరామిరెడ్డి, భువనచంద్రను చిరంజీవి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "సింగీతం శ్రీనివాసరావు, కె. విశ్వనాథ్‌గారు ఇక్కడికి వచ్చి ఉంటే పరిపూర్ణంగా ఉండేది. భవిష్యత్తులో వారికి నాతో జీవిత సాఫల్య పురస్కారాలు అందించే అవకాశం ఇస్తే సంతోషిస్తా" అన్నారు. మోహన్‌బాబు మాట్లాడుతూ "నాకు వేషాలు ఇవ్వమని వెంటపడిన సత్యానంద్‌ని సన్మానించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. రచయితలు సరస్వతీ పుత్రులు. వాళ్లను గౌరవించడం అతికొద్ది మందికే తెలుసు. ఎన్నో సిల్వర్ జూబ్లీ చిత్రాలు ఇచ్చిన ఆరుద్రగారు మరణిస్తే... ఆయన్ను చూడటానికి ఏ నిర్మాత వెళ్లలేదు. నా శ్రీమతి, కుమార్తె వెళ్లి మాల వేసి వచ్చారు. నా నిర్మాణ సంస్థలో ఎంతోమంది గొప్ప రచయితలు పని చేశారు. వాళ్ల ఆశీస్సులు మాకు కావాలి" అన్నారు. కె. రాఘవేంద్రరావు మాట్లాడుతూ "రాబోయే దర్శకులకు కష్టకాలం వచ్చింది. రచయితలందరూ దర్శకులయ్యారు. ఇప్పుడందరూ రచయితలను నమ్ముకోవాలి. దర్శకుడు కెప్టెన్ ఆఫ్ ది షిప్ అయితే... కథ, మాటలు రాసే రచయిత షిప్. నిర్మాత దాని ఓనర్. షిప్‌కు పెట్టే పేర్లు హీరోలు. మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణులు ప్రయాణికులు. జనమే సముద్రం. వాళ్లు ఆదరిస్తే ఒడ్డున చేరతాం. లేదంటే మునుగుతాం" అన్నారు. ఈ వేడుకలో ప్రతిభ, విశిష్ట రచన, గౌరవ పురస్కారాలను రమణాచారి, రాఘవేంద్రరావు, మోహన్‌బాబు అందజేశారు. 'తెలుగు సినీ రచయితల సంఘం' అధ్యక్షుడు పరుచూరి గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆకెళ్ల, పరుచూరి వెంకటేశ్వరరావు, బలభద్రపాతుని రమణి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు, రమణీ, చిరంజీవి, వడ్డేపల్లి కృష్ణ, భువన చంద్ర, ఆకెళ్ల, రాఘవేంద్రరావు, గోపాలకృష్ణ

సత్యానంద్, మోహన్‌బాబు

మోదీ ఇంట్లో బాలుకు చేదు అనుభవం



ఢిల్లీలోని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాసంలో ఇటీవల ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు ఓ చేదు అనుభవం ఎదురైంది. భారతీయ చిత్రప్రముఖులతో ప్రధాని ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన కూడా హాజరయ్యారు. షారుఖ్ ఖాన్, అమిర్ ఖాన్ తదితర బాలీవుడ్ ప్రముఖులంతా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆనాటి సమావేశంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని బాలసుబ్రహ్మణ్యం ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. 'రామోజీరావుగారి రికమండేషన్‌తో నేను ఆ సమావేశంలో పాల్గొనగలిగాను. మోదీ గారి ఇంటికి చేరుకోగానే సెక్యూరిటీ సిబ్బంది నాతో సహా చాలామంది సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకొన్నారు. అయితే లోపలికి వెళ్లిన తర్వాత కొంతమంది బాలీవుడ్ హీరోలు తమ సెల్‌ఫోన్లతో ప్రధానితో సెల్ఫీలు తీసుకోవడం గమనించి ఆశ్చర్యపోయా' అంటూ ఆ పోస్టింగ్‌లో పేర్కొన్నారు బాలు.

రామకృష్ణ తెనాలి... నా మాటే వినాలి!

హన్సిక, సందీప్ కిషన్

"నా పేరు రామకృష్ణ తెనాలి. నా మాటే వినాలి. లైఫే కులుమనాలీ అయిపోవాలి" అని సందీప్ కిషన్ పాటేసుకున్నారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'తెనాలి రామకృష్ణ బీఏబీఎల్'. కేసులు ఇవ్వండి ప్లీజ్ అనేది ఉపశీర్షిక. జవ్వాజి రామాంజనేయులు సమర్పణలో అగ్రహారం నాగిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, రూపా జగదీశ్ నిర్మించిన ఈ చిత్రంలో హన్సిక హీరోయిన్. జి. నాగేశ్వరరెడ్డి దర్శకత్వం వహించారు. ఈ నెల 15న చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు నిర్మాతలు తెలిపారు. భాస్కరభట్ల రచించిన 'రామకృష్ణ తెనాలి... నా మాటే వినాలి' పాటను ఆదివారం విడుదల చేశారు. న్యాయవాదిగా సందీప్ కిషన్ థియేటర్లలో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తారని దర్శకుడు అన్నారు. వరలక్ష్మీ శరత్‌కుమార్, బ్రహ్మానందం, 'వెన్నెల' కిశోర్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సాయికార్తీక్ సంగీత దర్శకుడు.

బుర్జ్ ఖలీఫాపై షారుఖ్!

కింగ్ ఖాన్ షారుఖ్‌కు ఈ ఏడాది పుట్టినరోజు ఎన్నో తీపి గురుతులను మిగిల్చింది. వాటిలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవంతి, దుబాయ్‌లో గల బుర్జ్ ఖలీఫాపై విద్యుత్ దీపాల వెలుగుల అలంకరణతో షారుఖ్ పేరు వచ్చేలా ప్రదర్శించడం ఒకటి. అందుకు సంబంధించిన వీడియో తన సోషల్ మీడియా పేజీలో కింగ్ ఖాన్ పోస్ట్ చేశారు. "నేను ఎంతగానో ప్రకాశించేలా చేసిన నా సోదరుడు మహ్మద్ అలబ్బార్‌కు థ్యాంక్స్. మీ ప్రేమాభిమానాలను వేటితోనూ వెలకట్టలేను. వావ్... నిజంగా నేనిప్పటి వరకూ ఇంత ఎత్తుకు వెళ్లలేదు. లవ్యూ దుబాయ్! ఈ రోజు నా పుట్టిన రోజు. నేను అతిథినయ్యాను" అని షారుఖ్ ఖాన్ పేర్కొన్నారు. భారతీయ చలన చిత్రసీమలో పలువురు తారలు ఆయనకు సోషల్ మీడియాలో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఉన్న సల్మాన్‌ఖాన్ అయితే షారుఖ్ సిగ్నేచర్ స్టెప్ వేయడంతో పాటు, 'ద-బాంగ్: ది టూర్' బృందంతో కలిసి 'హ్యాపీ బర్త్ డే టు యు' అని పాడుతూ శుభాకాంక్షలు తెలిపారు. ముంబైలోని షారుఖ్ స్వగృహం 'మన్నత్' ఎదుట భారీ సంఖ్యలో అభిమానులు విచ్చేశారు. అభిమాన హీరోకి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పారు.

మరోసారి... రవితేజ చిత్రానికి!

తమన్

హుషారుగా కనిపించే కథానాయకుల్లో రవితేజ ఒకరు. ఆయన చిత్రాలకు అంతే హుషారైన బాణీలు అందించే సంగీత దర్శకుల్లో ఎస్.ఎస్. తమన్ ఒకరు. వీరిద్దరిదీ హిట్ కాంబినేషన్. 'కిక్', 'మిరపకాయ్', 'బలుపు', 'పవర్' తదితర చిత్రాల్లో రవితేజ శైలికి, హుషారుకు తగ్గ పాటలను తమన్ అందించారు. ఈ ఏడాది క్రిస్మస్‌కి విడుదల కానున్న 'డిస్కో రాజా'కూ, ఆ తర్వాత చిత్రానికీ ఆయనే స్వరకర్త. రవితేజ, శ్రుతీ హాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో 'రాగూర్ మధు ఓ చిత్రాన్ని నిర్మించనున్న సంగతి తెలిసిందే. దానికి తమన్ సంగీతం అందించనున్నారు. ఈ నెలలో ఈ సినిమా ప్రారంభం కానుంది. అన్నట్టు... రవితేజ, శ్రుతి, మలినేని కాంబినేషన్‌లో 'బలుపు'కు తమనే సంగీతం అందించారు.

అవకాశాలు తగ్గాయి కానీ..

- శ్రుతి హరిహరన్

చిత్రపరిశ్రమలో తనపై లైంగిక దౌర్జన్యం జరగడంవల్లనే 'మీ టూ' ఫిర్యాదు చేశానని నటి శ్రుతి హరిహరన్ వెల్లడించారు. దీనిపై కేసు నమోదు కావడాన్ని తాను గర్వంగా భావిస్తున్నానన్నారు. బెంగళూరు నగరంలో ఆదివారం సీనియర్ పాత్రికేయురాలు బర్ఖాదత్ నేతృత్వంలో 'ఉయ్ ఉమెన్' పేరిట జరిగిన చర్చాగోష్ఠిలో నటి శ్రుతి హరిహరన్ పాల్గొన్నారు. మీ టూ అభియానలో భాగంగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తనకు సినిమా అవకాశాలు తగ్గడం వాస్తవమన్నారు. ప్రస్తుతానికి తన చేతిలో ఒక సినిమా కూడా లేదన్నారు. తన మూడు నెలల కుమార్తె, భర్తతో సంతోషంగా ఉన్నానన్నారు. ఈ ఏడాది జాతీయ పురస్కారం దక్కినందున మరోసారి అవకాశాలు రావచ్చునన్నారు.

- ఆంధ్రజ్యోతి, బెంగళూరు

తాప్సీతో సమస్యలు తప్పవా?

సోషల్ మీడియాలో తనను విమర్శించే వ్యక్తులపై తాప్సీ విరుచుకు పడుతుంటారు! విమర్శకులకు వ్యంగ్యంగా ఆమె ఇచ్చే సమాధానాలు అందర్నీ నవ్విస్తాయి. తాజాగా ట్విట్టర్‌లో అటువంటి ఫన్నీ ఇన్సిడెంట్ ఒకటి చోటు చేసుకుంది. "హిందీ చిత్రసీమ చరిత్రలో అత్యంత సమస్యాత్మక నటి తాప్సీ. ఆమెకు ఈ సంగతి తెలుసో? లేదో?" అని రాజీవ్ అనే వ్యక్తి ట్వీట్ చేశాడు. అందుకు బదులుగా తాప్సీ "నాకు తెలుసు. నా తల్లితండ్రులు కూడా నాతో సమస్యే అని నమ్ముతారు. మూసధోరణిలో జీవించే వ్యక్తులకు నాతో పెద్ద సమస్యే. నీకు ఇలా చెబుతున్నందుకు బాధగా ఉంది... నేనిలానే ఉంటాను. అందువల్ల, నీకు ఇంకొంచెం సహనం, శక్తి ఉండాలి" అని ట్వీట్ చేశారు. "తప్పడ్' సినిమా విడుదలైతే వాళ్లకు ఏమవుతుందో?" అని సోనీ పిక్చర్స్‌కు చెందిన లడ గురుదెన్ సింగ్ ట్వీట్ చేయగా... "ఉఫ్! ఆ తర్వాత నేను చాలామందికి సమస్యగా మారతాను. అప్పటి వరకూ వాళ్లను బతకనివ్వు" అని తాప్సీ బదులిచ్చారు.

రామస్వామి బయోపిక్

సాత్వికజైన్, అల్తాఫ్, శాంతిరావు, లావణ్య

అల్తాఫ్, శాంతిరావు, లావణ్యారెడ్డి, సాత్వికజైన్ హీరోహీరోయిన్లుగా రామ్‌నారాయణ్ దర్శకత్వంలో రూపుదిద్దుకొంటున్న చిత్రం 'బట్టల రామస్వామి బయోపిక్'. సతీష్‌కుమార్ ఐ నిర్మాత. ఇటీవల ప్రారంభమైన షూటింగ్‌లో సంగీత దర్శకుడు ఆర్.పి. పట్నాయక్ ఫస్ట్‌లుక్ విడుదల చేశారు. కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడం కోసం ఈ సినిమా తీస్తున్నాం. కమర్షియల్ అంశాలతో రూపుదిద్దుకొంటున్న చిత్రమిది. వచ్చే వారం నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కథ, మాటలు, పాటలు: వాసుదేవమూర్తి, సంగీతం, దర్శకత్వం: రామ్‌నారాయణ్.

ఆంధ్రజ్యోతి

బిజినెస్

హైదరాబాద్ • సోమవారం 4 నవంబరు 2019

andhrajyothibusiness@gmail.com

3400 బ్యాంకు బ్రాంచిల మూసివేత

ఇండోర్: బ్యాంకుల కన్సాలిడేషన్ ప్రక్రియలో భాగంగా 26 ప్రభుత్వ రంగ బ్యాంకులు గత ఐదేళ్ల కాలంలో 3400 బ్రాంచిలు మూసివేయడం లేదా ఇతర బ్రాంచిల్లో విలీనం చేయడం జరిగిందని సమాచార హక్కు చట్టం కింద ఆర్‌బీఐ తెలిపింది. వాటిలో గరిష్ఠంగా 2568 బ్రాంచిలు (75 శాతం) దేశంలోనే అతి పెద్దదైన ఎస్‌బీఐకి చెందినవేకావడం విశేషం. నీముచ్‌కు చెందిన చంద్ర శేఖర్ గౌడ్ ఆర్‌బీఐకి సమాచార హక్కు చట్టం కింద ఈ ప్రశ్న పంపారు. 10 పీఎస్‌బీలను నాలుగు మెగా బ్యాంకులుగా మార్చే ప్రక్రియ పురోగమన పథంలో ఉండగానే ఈ ఆర్‌టీఐ ప్రశ్న వచ్చింది. ఈ విలీనాన్ని బ్యాంకు ఉద్యోగుల సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ ప్రక్రియ పూర్తయితే కనీసం ఏడు వేల బ్రాంచిలు మూతపడతాయని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం అన్నారు. ఆయా బ్యాంకుల వ్యాపారం సైతం దెబ్బ తింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

డిసెంబరుకల్లా రూ.8,462 కోట్ల ఈక్విటీ

బోర్డులోనూ కొత్త మదుపరులకు చోటు: యెస్ బ్యాంక్ సీఈఓ

ముంబై: యెస్ బ్యాంక్ ఆర్థిక కష్టాలు కొలిక్కి వస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఈక్విటీ షేర్ల కేటాయింపు ద్వారా వచ్చే డిసెంబరుకల్లా 120 కోట్ల డాలర్ల (సుమారు రూ.8,462 కోట్లు) నిధులు సమీకరించే కార్యక్రమం పూర్తవుతుందని బ్యాంకు భావిస్తోంది. బ్యాంకు సీఈఓ రవనీత్ గిల్ ఈ విషయం వెల్లడించారు. ఈ పెట్టుబడులు సమకూర్చే ఇన్వెస్టర్‌కు బ్యాంకు డైరెక్టర్ల బోర్డులోనూ చోటు దక్కుతుందన్నారు. నిధుల కోసం చూస్తున్న యెస్ బ్యాంకుకు 300 కోట్ల డాలర్ల (సుమారు రూ.21,156 కోట్లు) నిధులు సమకూర్చేందుకు ఇన్వెస్టర్లు ముందుకు వచ్చినట్టు సమాచారం. ఒక ఉత్తర అమెరికా దేశానికి చెందిన ఒక కుటుంబం యెస్ బ్యాంక్ ఈక్విటీలో 120 కోట్ల డాలర్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిందని సమాచారం. ఈ నేపథ్యంలో బ్యాంక్ సీఈఓ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం.

ఓపెన్ ఆఫర్ వర్తించదు

ఉత్తర అమెరికా కుటుంబం ఆఫర్‌ను ఆమోదిస్తే బ్యాంకు ఈక్విటీలో ఆ కుటుంబానికి 33 శాతం వాటా లభిస్తుందని సమాచారం. అయితే ఇంత పెద్ద మొత్తం ఇన్వెస్ట్ చేసినా బ్యాంకు ఓటింగ్ హక్కుల్లో మాత్రం 15 శాతం మించి కొత్త ఇన్వెస్టర్‌కు ఇచ్చేందుకు బ్యాంకు సుముఖంగా లేదు. దీంతో సెబీ 'ఓపెన్' ఆఫర్ నిబంధనలూ వర్తించవని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. వీటన్నిటిపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు యెస్ బ్యాంకు డైరెక్టర్ల బోర్డు వచ్చే వారం సమావేశం అవుతోంది.



హనుంగ్ టాయ్స్ ప్రమోటర్ అరెస్టు

న్యూఢిల్లీ: అప్పుల్లో కూరుకుపోయిన హనుంగ్ టాయ్స్ ప్రమోటర్ అశోక్ కుమార్ బన్సాల్, ఆయన భార్య అంజు బన్సాల్‌లను ఢిల్లీ విమానాశ్రయంలో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) జారీ చేసిన లుక్‌ఔట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) మేరకు వీరిని అధికారులు ఆదివారంనాడు అదుపులోకి తీసుకోవడం గమనార్హం. హనుంగ్ టాయ్స్ అండ్ టెక్స్‌టైల్ లిమిటెడ్‌కు పంజాబ్ నేషనల్ బ్యాంకు సారథ్యంలోని 15 రుణదాతల కన్సార్షియం రూ.2,300 కోట్ల రుణం ఇచ్చింది. ఇందులో పీఎన్‌బీ వాటాయే రూ.599 కోట్లు ఉంది. ఈ నేపథ్యంలో పీఎన్‌బీ ఇప్పటి వరకు 13 ఎల్‌ఓసీలను జారీ చేసింది. వీటిలో ఒకటి శనివారంనాడు హనుంగ్ టాయ్స్ ప్రమోటర్‌కు వ్యతిరేకంగా జారీ అయింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం దుబాయ్ నుంచి వస్తున్న బన్సాల్ దంపతులను అధికారులు అదుపులోకి తీసుకున్నట్టు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి.

ఆదిత్య బిర్లా గ్రూప్ స్వర్ణోత్సవ సమావేశంలో మోదీ ప్రసంగం

పన్ను నిబంధనలు మరింత సరళం

పెట్టుబడుల ఆకర్షణే మా ప్రధాన లక్ష్యం: ప్రధాని మోదీ

బ్యాంకాక్: దేశ పన్నుల వ్యవస్థలో మరిన్ని సంస్కరణలకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు కనిపిస్తోంది. పెట్టుబడుల ఆకర్షణ కోసం దేశంలో పన్నుల నిబంధనలను మరింత సరళీకృతం చేస్తామని థాయ్‌లాండ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ ప్రకటించారు. ప్రజలకు ఇబ్బంది లేని రీతిలో పన్నుల వ్యవస్థ ఉండాలన్న లక్ష్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దీంతో జీడీపీ వృద్ధి రేటును గాడిలో పెట్టేందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవలే కంపెనీలపై ఆదాయ పన్ను రేటును పది శాతం వరకు తగ్గించారు. ప్రధాని తాజా వ్యాఖ్యలతో పన్నుల 'భారం' మరింత తగ్గించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు భావిస్తున్నారు. థాయ్‌లాండ్‌లో ఆదిత్య బిర్లా గ్రూపు వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఇదే మంచి అవకాశం

భారత్‌లో పెట్టుబడులకు ఇదే సరైన సమయమని ప్రధాని మోదీ అన్నారు. 'మా దేశంలో పన్ను రేట్లు, అధికారుల అలసత్వం, అవినీతి, ఆశ్రిత పక్షపాతం తగ్గిపోతున్నాయి. ఇదే సమయంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు(ఎఫ్‌డీఐ)లు, వ్యాపార సానుకూలత, ఉత్పాదకత, నివాస యోగ్యత పెరుగుతున్నాయి. భారత్‌లో పెట్టుబడులకు ఇదే మంచి తరుణం' అన్నారు. గత 20 సంవత్సరాల్లో భారత్‌కు వచ్చిన ఎఫ్‌డీఐలో సగం (28,600 కోట్ల డాలర్లు) గత ఐదేళ్లలోనే వచ్చిన విషయాన్ని ప్రధాని గుర్తు చేశారు.

అదే మా లక్ష్యం

వచ్చే ఆరేళ్లలో భారత్‌ను ఐదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని ప్రధాని మరోసారి ప్రకటించారు. '2014లో మా ప్రభుత్వం అధికారం చేపట్టినపుడు భారత ఆర్థిక వ్యవస్థ దాదాపు రెండు లక్షల కోట్ల డాలర్లు ఉండేది. అంటే స్వాతంత్ర్యం సంపాదించిన 65 ఏళ్లలో మా ఆర్థిక వ్యవస్థ పరిమాణం కేవలం రెండు లక్షల కోట్ల డాలర్లు. కేవలం అయిదేళ్లలో దీన్ని మూడు లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేర్చాం' అన్నారు.

తగ్గనున్న వ్యక్తిగత ఆదాయ పన్ను!

ప్రధాని తాజా వ్యాఖ్యలతో ఈసారి ప్రభుత్వం ఏ పన్నుల భారం తగ్గిస్తుందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రభుత్వం ఇప్పటికే కార్పొరేట్ పన్ను 10 శాతం వరకు తగ్గించింది. దీంతో ఈసారి వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్ల తగ్గింపుకే ప్రభుత్వం మొగ్గు చూపుతుందని భావిస్తున్నారు. వస్తు, సేవల డిమాండ్ క్షీణించడమే, ఇటీవల జీడీపీ వృద్ధి రేటు నీరసించడానికి ప్రధాన కారణం. దీంతో వ్యక్తిగత ఆదాయ పన్ను రేట్ల భారం తగ్గించి, వినియోగదారుల చేతికి మరిన్ని నిధులు సమకూర్చి, వృద్ధి రేటు పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని భావిస్తున్నారు.

'ఆర్‌సెప్'పై ఇంకా కొలిక్కిరాని చర్చలు?

- భారత్‌ను వెంటాడుతున్న చైనా డంపింగ్ భయాలు
- వచ్చే ఏడాది వరకు చర్చలకు గడువు!

ఆసియాన్ నాయకులతో ప్రధాని మోదీ

బ్యాంకాక్: ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (ఆర్‌సెప్)పై చర్చలు ఇంకా ఒక కొలిక్కిరాలేదు. చైనా వస్తువుల డంపింగ్ ప్రమాదం నుంచి మరిన్ని రక్షణలు, హామీలు కావాలని భారత్ కోరటమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. నిజానికి ప్రస్తుతం థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరుగుతున్న సమావేశంలోనే ఈ చర్చలు పూర్తి చేయాలని ముందు భావించారు. అయితే ఈ ఒప్పందాన్ని అడ్డుపెట్టుకుని చైనా మరింతగా తన వస్తువులను భారత మార్కెట్‌లో కుమ్మరించే ప్రమాదం ఉందని, దీనిపై అత్యంత అప్రమత్తంగా ఉండాలని, దేశీయ పరిశ్రమతోపాటు వ్యవసాయ రంగం, విపక్షాల నుంచీ మోదీ సర్కార్‌పై ఒత్తిడి పెరిగింది. దీంతో ఈ ఒప్పందంపై తొందరపడకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఆదివారం ఆసియాన్ సదస్సులో ప్రధాని మోదీ చేసిన ప్రసంగంలోనూ ఈ ఒప్పందం ప్రస్తావనే లేదు. దీనికి బదులు ప్రస్తుతం ఆసియాన్-భారత్ మధ్య ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, దాంతో వాణిజ్యపరంగా భారత్‌కు ఎదురవుతున్న ఇబ్బందుల్ని సరిదిద్దాల్సిన అవసరంపైనే ప్రధాని మోట్లాడారు. దీంతో ఆర్‌సెప్‌పై తొందరపడకూడదని భారత్ నిర్ణయించినట్టు భావిస్తున్నారు.

చైనా ఒత్తిడి

మరోవైపు ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకాక్ సదస్సులోనే ఆర్‌సెప్ ఒప్పందానికి తుది రూపం ఇవ్వాలని చైనా పట్టుదలతో ఉంది. ఇందుకోసం అవసరమైతే భారత్‌ను పక్కన పెట్టాలని కూడా నిర్ణయించింది. కొన్ని దేశాలు ఇందుకు అనుకూలంగానే ఉన్నా, కొన్ని ఆగ్నేయాసియా దేశాలు మాత్రం ఇందుకు సుముఖంగా లేవు. ఈ విషయంలో చైనాకు వంత పాడితే ఆర్‌సెప్‌లోనూ చైనా పెత్తనం చేసే ప్రమాదం ఉందని ఈ దేశాలు భయపడుతున్నాయి. దీంతో వచ్చే ఏడాది వియత్నాంలో జరిగే సదస్సు వరకు ఆర్‌సెప్ చర్చలు పొడిగించాలని నిర్ణయించాయి.

ఆర్‌సెప్ అంటే?

ఆగ్నేయాసియా దేశాల (ఆసియాన్) కూటమిలోని పది దేశాలతోపాటు భారత్, చైనా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలన్నీ కలిసి ఆర్‌సెప్ వాణిజ్య కూటమి ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. ఇది అమల్లోకి వస్తే ప్రపంచంలో సగం జనాభా, ప్రపంచంలోని 30 శాతం జీడీపీ ఉన్న దేశాలకు ప్రాతినిధ్యం లభించినట్టవుతుంది. ఈ ఒప్పందం ద్వారా తమ పాడి ఉత్పత్తులను భారత మార్కెట్‌లో చౌకగా కుమ్మరించవచ్చని ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలు ఆశలు పెట్టుకున్నాయి. అమెరికాతో వాణిజ్య యుద్ధం నేపథ్యంలో తన చౌక ఉత్పత్తులను మరింత దూకుడుగా భారత మార్కెట్‌లో కుమ్మరించవచ్చని చైనా ఆశలు పెట్టుకుంది. ఒప్పందం ప్రకారం ఈ మూడు దేశాల నుంచి దిగుమతయ్యే సరుకులపై ప్రస్తుతం ఉన్న సుంకాలను భారత్ 74 శాతం తగ్గించాలి. అదే జరిగితే దేశంలోని కొన్ని పరిశ్రమల మనుగడే ప్రమాదంలో పడుతుందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో ఆర్‌సెప్ ఒప్పందంపై తొందరపడకూడదని ప్రభుత్వం నిర్ణయించినట్టు భావిస్తున్నారు.

ముందు బీఎస్-6 పెట్రోల్ కార్లు తెస్తాం : ఆడీ

న్యూఢిల్లీ: జర్మనీ లగ్జరీ కార్ల కంపెనీ ఆడీ.. బీఎస్-6 నిబంధనలకు అనుగుణంగా ఉన్న పెట్రోల్ కార్లనే ముందు మార్కెట్లోకి తీసుకురావాలనుకుంటోంది. అంతేకాకుండా ప్రత్యామ్నాయ ఇంధన టెక్నాలజీతో కూడిన వాహనాలకు ప్రాధాన్యం ఇస్తామని చెబుతోంది. ఈ నేపథ్యంలో పూర్తిగా డీజిల్ ఇంజన్ల నుంచి వైదొలగే అవకాశం లేదని అంటోంది. ఇటీవలే కంపెనీ ఎనిమిదోతరం ఏ6 సెడాన్‌ను మార్కెట్లోకి తెచ్చింది. ఇందులో హైబ్రిడ్ టెక్నాలజీ ఉంది. రానున్న కాలంలో మరిన్ని హైబ్రిడ్స్, ప్లగ్ ఇన్ హైబ్రిడ్ వాహనాలను మార్కెట్లోకి తీసుకురావాలనుకుంటోంది. "అన్ని మోడళ్లలోనూ బీఎస్-6తో కూడిన పెట్రోల్ కార్లను తెస్తాం. అయితే డీజిల్ కార్లు పూర్తిగా ఉండవని చెప్పలేం" అని ఆడీ ఇండియా హెడ్ బల్బిర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు. రానున్న కాలంలో పెట్రోల్ కార్లతో పాటు ఎలక్ట్రిక్ కార్లను కూడా తీసుకువస్తామన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి బీఎస్-6 నిబంధనలు అమల్లోకి రానున్న విషయం తెలిసిందే ఈ నిబంధనలు అమల్లోకి వచ్చిన తర్వాత డీజిల్ వాహనాలను విక్రయించమని ఇప్పటికే మారుతీ సుజుకీ, రెనో కంపెనీలు ప్రకటించాయి. భవిష్యత్ ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాలదే కాబట్టి డీజిల్ టెక్నాలజీ నుంచి వైదొలగనున్నట్టు ఇంతకు ఆడీ కూడా పేర్కొంది. మైల్డ్ హైబ్రిడ్స్, ప్లగ్ ఇన్ హైబ్రిడ్స్ వంటి టెక్నాలజీలపై కూడా దృష్టిసారించాల్సిన అవసరం ఉందని, ఇతర టెక్నాలజీలపై కూడా తాము ప్రయోగం చేస్తామని ధిల్లాన్ తెలిపారు.

పబ్లిక్ ఇష్యూకు సౌదీ అరామ్కో

- ప్రపంచంలోనే అతిపెద్ద ఐపీఓ!

రియాద్: తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా స్టాక్ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నట్టు సౌదీ అరేబియన్ ఆయిల్ కంపెనీ (సౌదీ అరామ్కో) ఆదివారంనాడు ప్రకటించింది. ఇది కంపెనీ చరిత్రలో ఒక మైలురాయి అని కంపెనీ పేర్కొంది. త్వరలోనే ప్రారంభం కానున్న ఈ ఐపీఓ ప్రపంచంలోనే అతిపెద్దది కావడానికి అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే పబ్లిక్ ఇష్యూ ద్వారా ఎన్ని షేర్లను విక్రయించే అవకాశం ఉందన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రపంచ చమురు మార్కెట్లో సౌదీ అరామ్కో వాటా 10 శాతంగా ఉంది. ఈ కంపెనీ పబ్లిక్ ఇష్యూ ఇంతకు ముందే రావాల్సి ఉంది. కానీ కంపెనీ మార్కెట్ విలువ ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల జాప్యం జరిగింది. ఇప్పుడు కంపెనీ మార్కెట్ విలువ 1.7 లక్షల కోట్ల డాలర్లుగా ఉండవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. కాగా కంపెనీ తొలుత ఐదు శాతం వాటాను రెండు ఎక్స్ఛేంజీల ద్వారా విక్రయించే అవకాశం ఉందని భావిస్తున్నారు. తొలుత తడావుల్ సౌదీ ఎక్స్ఛేంజీలో రెండు శాతం, ఆ తర్వాత విదేశీ ఎక్స్ఛేంజీలో మూడు శాతం వాటాను విక్రయించాలని భావిస్తున్నారట. అయితే విదేశీ మార్కెట్ వివరాలు మాత్రం వెల్లడి కాలేదు.

భారత్ సారథిగా దక్షిణాసియా జోరు: ఐఎంఎఫ్

వాషింగ్టన్: ప్రపంచ వృద్ధిలో దక్షిణాసియా కేంద్రంగా మారే దిశగా అడుగులు వేస్తోందని, ఇందుకు భారత్ సారథ్యం వహిస్తోందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పేర్కొంది. 2040నాటికి ప్రపంచ వృద్ధిలో దక్షిణాసియా మూడింట ఒకవంతు వాటాను కలిగి ఉండనుందని అంచనా వేస్తోంది. ఈ మేరకు ఐఎంఎఫ్ తాజా పరిశోధనా పత్రం పేర్కొంది. దక్షిణాసియాలో ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లు లేవు. ఐఎంఎఫ్ పేర్కొన్న దక్షిణాసియా దేశాల్లో భారత్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, భూటాన్, మాల్దీవులు ఉన్నాయి. దక్షిణాసియా దేశాల్లో సరళీకరణ పరిస్థితులున్నాయని, మౌలికసదుపాయాలు మెరుగుపడేందుకు తగ్గిన కృషి జరిగిందని ఐఎంఎఫ్ పేర్కొంది. అంతేకాకుండా యువత, భారీ స్థాయిలో ఉన్న కార్మిక శక్తి వంటి అంశాలతో ఈ ప్రాంతం 2040నాటికి ప్రపంచ వృద్ధిలో మూడింట ఒకవంతు వాటాను కలిగి ఉండే అవకాశం ఉందని తెలిపింది. 2030నాటికి ఈ ప్రాంతంలోని 15 కోట్లకు పైగా ప్రజలు కార్మిక మార్కెట్లోకి ప్రవేశిస్తారని పేర్కొంది. ఇదే దక్షిణాసియా ప్రాంత సామర్థ్యానికి కీలకంగా మారుతుందని వెల్లడించింది.

చైనా ఎక్స్‌పోకు భారత్

బీజింగ్: చైనాలోని షాంఘైలో మంగళవారం నుంచి జరగనున్న అంతర్జాతీయ ఇంపోర్ట్ ఎక్స్‌పో (సీఐఐఈ)లో గౌరవ అతిథి దేశాల్లో ఒకటిగా భారత్ పాల్గొననుంది. వాణిజ్య శాఖ కార్యదర్శి అనూప్ వధావన్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం భారత్ తరపున ఈ ఎక్స్‌పోలో పాల్గొననుంది. ఎక్స్‌పోలో పాల్గొనే దేశాల ప్రతినిధులు, తమ ఎగుమతుల నాణ్యతపై చైనాకు వివరించే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా ఫార్మా, ఐటీ, వ్యవసాయం తదితర ఉత్పత్తుల ఎగుమతులపై భారత్ ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా.. 15 దేశాల గౌరవ అతిథి దేశాలుగా పాల్గొననున్నాయి. ఈ నెల 10 వరకూ జరగనున్న ఎక్స్‌పోకు సుమారు 170 దేశాల నుంచి ప్రతినిధులను చైనా ఆహ్వానించింది. ఈ ఎక్స్‌పోలో ఆకట్టుకున్న దేశం నుంచి ప్రభుత్వం దిగుమతులు చేసుకునేందుకై స్థానిక ఎగ్జిమ్ బ్యాంకు సుమారు రూ.3 లక్షల కోట్ల రుణాన్ని సిద్ధంగా ఉంచిందని చైనా అధికారిక వార్తా సంస్థ జిన్హువా వెల్లడించింది.

3న ఫారం గేటు అమ్మకం ధరలు

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.60		నెక్ (100 గుడ్లు)	
హైదరాబాద్	401	4వ తేదీకి..	
బెంగళూరు	420	విశాఖపట్నం	400
విజయవాడ	400	వరంగల్	404
గోదావరి	400	చెన్నై	430
నమక్కల్	415	చిత్తూరు	413
		ముంబై	454

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	82	విజయవాడ	81
వరంగల్	82	గుంటూరు	82
మహబూబ్‌నగర్	82	ఒంగోలు	83
కరీంనగర్	82	చిత్తూరు	89
కర్నూలు	82	నెల్లూరు	89
విశాఖపట్నం	66	అనంతపురం	85
గోదావరి	76		

టెక్ వ్యూ

గరిష్ఠ స్థాయిల్లో పరీక్ష

వి సుందర్ రాజా

నిఫ్టీ గత వారంలో పాజిటివ్ ధోరణిలో ప్రారంభమై 11950 వరకు వెళ్లి మైనర్ రియాక్షన్ సాధించింది. కాని చివరి మూడు రోజుల్లో ఇంట్రాడే గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్త ట్రెండ్ సాధించింది. వారం మొత్తం మీద లాభంతో గరిష్ఠ స్థాయిలో నిలకడగా ముగిసింది. టెక్నికల్‌గా ప్రధాన ట్రెండ్ ఎగువకే ఉన్నా ప్రధాన నిరోధ స్థాయిలు 12000-12100కి చేరువవుతోంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. 11100 స్థాయి నుంచి ర్యాలీలో ప్రవేశించిన నిఫ్టీ 800 పాయింట్లు లాభపడి గరిష్ఠ స్థాయిల్లో నిలకడ ధోరణి ప్రదర్శిస్తోంది. తదుపరి దిశ తీసుకునే ముందు స్వల్పకాలిక కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఏర్పడవచ్చు. మరోసారి జీవిత కాల గరిష్ఠ స్థాయి 12100 వరకు వెళ్లే ఆస్కారం కనిపిస్తోంది. ఇదే స్వల్పకాలిక, మధ్యకాలిక నిరోధ స్థాయి. మరోసారి ఈ స్థాయిలో పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు : మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించినట్టయితే మైనర్ నిరోధం 11940 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 12020. ఆ పైన పటిష్ఠంగా ముగిసినప్పుడే మరింత అప్‌ట్రెండ్ ఏర్పడుతుంది. మరో ప్రధాన నిరోధం 12100. జూన్ 4న ఏర్పడిన గరిష్ఠ స్థాయి ఇదే.

బేరిష్ స్థాయిలు: 12000 వద్ద విఫలమైతే కన్సాలిడేషన్ లేదా కరెక్షన్‌కు ఆస్కారం ఉన్నట్టు సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు 11840. అంతకన్నా దిగజారితే మైనర్ కరెక్షన్ మరింతగా కొనసాగుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 11700. భద్రత కోసం ఇక్కడ రికవరీ తప్పనిసరి. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ ప్రమాదం ఏర్పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ : ఈ సూచీకి ఎగువన పలు నిరోధాలున్నాయి. గత కొద్ది వారాల్లో 27600 నుంచి అప్‌ట్రెండ్‌లో 30400 వరకు పురోగమించింది. ప్రధాన నిరోధం 30800. ఇదే సెప్టెంబరు 23న ఏర్పడిన గరిష్ఠస్థాయి. మరింత అప్‌ట్రెండ్ కోసం అంతకన్నా పైన నిలదొక్కుకోవాలి.

స్వల్పకాలిక వ్యూహం : 12100 పైన నిలదొక్కుకుంటే గట్టి స్టాప్‌లాస్‌తో స్వల్పకాలిక ట్రేడర్లు స్వల్పకాలిక బై పొజిషన్లు తీసుకోవచ్చు.

పాటర్న్ : 12100 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు. కరెక్షన్‌లో ప్రవేశిస్తే 11700 వద్ద 'అడ్డంగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద గట్టి మద్దతు కనిపిస్తోంది. సాధారణ పరిస్థితుల్లో ఈ స్థాయి వరకు రాకపోవచ్చు. మార్కెట్ స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితిలో ఉన్నందు వల్ల గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తత అవశ్యం.

టైమ్ : ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి రివర్సల్ ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం:	11940,11975
మద్దతు:	11880, 11840

www.sundartrends.in

అస్ట్రో గైడ్

ఈ వారానికి 12150 పైన బుల్లిష్

(నవంబరు 4-8 తేదీల మధ్య వారానికి)

గత వారం నిఫ్టీ : 11890 (+307)

డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 11918-11605 పాయింట్ల మధ్యన కదలాడి 307 పాయింట్ల లాభంతో 11890 వద్ద వారం గరిష్ఠ స్థాయిలో పాజిటివ్‌గా ముగిసింది.

- వచ్చే బుధ, శుక్రవారాల నడుమ చంద్రుడు కుంభ, మీన రాశుల్లో సంచరించే సమయంలో ఏర్పడే వచ్చే మూడు వారాలకు కీలకం.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 11517, 11256, 11354, 11328 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- నిఫ్టీ మరోసారి అన్ని డిఎంఏల కన్నా పైకి వచ్చింది. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా (డెత్‌క్రాస్) దిగువనే ఉండడం దీర్ఘకాలిక ట్రెండ్ బేరిష్‌గా ఉందనేందుకు సంకేతం. ఈ వారాంతంలో 12150 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి : 12150 **బ్రేక్‌డౌన్ స్థాయి : 11650**

నిరోధ స్థాయిలు : 12140, 12115, 12190 (11965 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు : 11740, 11665, 11590 (11815 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన...

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

గ్రహగతులు

- కర్కాటకంలోని శ్రవణం పాదం 1 నుంచి మీనంలోని ఉత్తరాభాద్ర పాదం 1 మధ్యలో చంద్ర సంచారం
- తులలోని స్వాతి పాదం 4 నుంచి పునర్వసు పాదం 1 మధ్యలో రవి సంచారం
- వృశ్చికంలోని విశాఖ పాదం 4లో వక్రగతిలో బుధ సంచారం
- వృశ్చికంలోని అనూరాధ పాదం 2-3 మధ్యలో శుక్ర సంచారం
- కన్యలోని చిత్త పాదం 1-2 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 3లో తుల నవాంశలో శని సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 4 నుంచి ధనుస్సులోని మూల పాదం 1 మధ్యలో మేష నవాంశలో బృహస్పతి సంచారం
- మిథునంలోని ఆర్ద్ర పాదం 4లో రాహువు, ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 2లో కేతువు సంచారం

ప్రారంభ సెషన్ మెరుగు (సోమవారానికి)

తిథి : కార్తీక శుక్ల అష్టమి

నక్షత్రం, అప్రమత్తం : శ్రవణం; పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర నక్షత్ర జాతకులు, కుంభ, మిథున రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 9.33

ధోరణి : నిఫ్టీ ఫ్యూచర్స్ మెరుగ్గా ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటల వరకు అదే ధోరణిలో ట్రేడవుతూ ఆ తర్వాత 1.55 వరకు నిస్తేజం/నిలకడగా ఉండి తదుపరి చివరి వరకు నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం : నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 12 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 11930, 11965

మద్దతు స్థాయిలు : 11850, 11815

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

మీరే సరిగా పాలిస్తే...

"మాకు సమయం ఇవ్వరా... అని వైసీపీ నేతలు అడుగుతున్నారు. మీకు సమయం ఇచ్చాం. జగన్ అద్భుతమైన పాలన అందిస్తే నేను రాజకీయాలు వదిలేసి సినిమాలు చేసుకుంటాను. సగటు రాజకీయ నాయకులు నిజంగా ప్రజలపట్ల బాధ్యతగా ఉండుంటే... నేను పార్టీ పెట్టాల్సిన అవసరమే ఉండేది కాదు. రాష్ట్రాన్ని పరిపాలించడం ఎంత కష్టమో నాకు తెలుసు. జగన్‌పై నాకు వ్యక్తిగతంగా ఎలాంటి ద్వేషం లేదు. ఆయన గొప్ప నాయకుడైతే సంతోషిస్తాను. అదే సమయంలో... ప్రజలను ఇబ్బంది పెడితే ఎదురు తిరగడంలో నాకంటే బలవంతుడు కూడా ఎవరూ ఉండరని తెలుసుకోవాలి."

నన్ను అభిమానించే ప్రధాని...: నన్ను అభిమానించే, ప్రేమగా పిలిచే ప్రధాని నరేంద్ర మోదీతో... కేవలం ప్రత్యేక హోదా కోసమే విభేదించాను. ప్రజలంతా హోదాను వదిలేసినా... నేను మాత్రం దాని కోసం పోరాడుతూనే ఉన్నాను.

- పవన్ కల్యాణ్

మీ బతుకులు మాకు తెలియదా!

మంత్రులు బొత్స సత్యనారాయణ, కన్నబాబుపై పవన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. "కన్నబాబును రాజకీయాల్లోకి తెచ్చింది నాగబాబు. ఈ రోజు ఆయన మమ్మల్ని విమర్శిస్తున్నారు. మీ బతుకులు మాకు తెలియదా!" అని మండిపడ్డారు. ఇక... తన గురించి మాట్లాడొద్దంటూ బొత్స కోరారని తెలిపారు. "బొత్స నాకు వ్యక్తిగతంగా బాగా తెలుసు. ఆయన్ను వ్యక్తిగతంగా ఏమీ అనను కానీ.. ఆయన విధివిధానాలనే వ్యతిరేకిస్తా. ఆయనకు అధికారం మాత్రమే కావాలి. 2004లో నేను విజయనగరం వెళ్లినప్పుడు తనను ఏమీ అనొద్దంటూ ఎవరితోనో కబురు పంపించారు" అని తెలిపారు.

బహిరంగ సభకు హాజరైన జనం

ఇదేమి సర్కార్?

పోటెత్తిన జనం

- మద్దిలపాలెం నుంచి పాత జైలు రోడ్డు వరకు.. రెండున్నర కి.మీ. సాగిన జనసేనాని యాత్ర
- భారీగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు
- భవన నిర్మాణ కార్మికులు కూడా..

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇసుక కొరతను నిరసిస్తూ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదివారం విశాఖలో నిర్వహించిన లాంగ్ మార్చ్‌కు జనం పోటెత్తారు. మద్దిలపాలెం జంక్షన్‌లోని తెలుగుతల్లి విగ్రహం వద్ద నుంచి పాత జైలు రోడ్డులోని మహిళా కళాశాల ఎదురుగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం వరకు సాగిన ఈ యాత్రలో వేల మంది అభిమానులు, కార్యకర్తలు, భవన నిర్మాణ కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకే మద్దిలపాలెం జంక్షన్ జనసంద్రమైంది. అంతకుముందు విశాఖ విమానాశ్రయం నుంచి సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో మద్దిలపాలెం చేరుకున్న పవన్.. అప్పటికే అక్కడ వేచిఉన్న జనసేన, టీడీపీ నేతలు నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడితో మాట్లాడారు. అనంతరం లాంగ్ మార్చ్‌ను ప్రారంభించారు. కొద్ది దూరం నడిచిన తర్వాత అభిమానుల తోపులాటతో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. దీంతో పవన్ వాహనంపైకి ఎక్కి ర్యాలీని కొనసాగించారు. మద్దిలపాలెం నుంచి రామాటాకీస్, ఆశీల్‌మెట్ట జంక్షన్ మీదుగా సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరాన ఉన్న పాత జైలు రోడ్డుకు చేరుకోవడానికి గంటన్నర సమయం పట్టింది. ఐదు రోడ్ల కూడలితో చాలా విశాలంగా వుండే రామాటాకీస్ జంక్షన్ జనసంద్రాన్ని తలపించింది.

పార్కింగ్‌కు ఆంక్షలు

లాంగ్‌మార్చ్‌కు తరలివచ్చే వాహనాల పార్కింగ్‌కు పోలీసులు ఆంక్షలు పెట్టడంపై కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మద్దిలపాలెం పక్కనే ఉన్న ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో పార్కింగ్‌కు అవకాశం ఇవ్వకుండా.. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎంవీపీ కాలనీ ఆళ్వార్‌దాస్ స్టేడియంలో పెట్టుకోవాలని పోలీసులు ఆదేశించారు. అంత దూరాన వాహనాలను పార్క్ చేసి రావడానికి నాయకులు, కార్యకర్తలు ఇబ్బందులు పడ్డారు. కాగా.. పవన్‌కు భద్రత విషయంలోనూ పోలీసులు అలక్ష్యంగా వ్యవహరించారని జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ మద్దిలపాలెం చేరుకున్న వెంటనే వేల మంది అభిమానులు ఆయన్ను చూడడానికి ముందుకు దూసుకొచ్చారు. పోలీసులు ఆయనకు రక్షణగా నిలవకపోవడంతో తోపులాట జరిగింది. ప్రైవేటు సెక్యూరిటీ, జనసైనికులు నిలువరించేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు.

ముగ్గురు యువకులకు షాక్

లాంగ్‌మార్చ్‌లో చిన్న అపశ్రుతి చోటు చేసుకుంది. సభ కుడివైపు ఉన్న బారికేడ్లకు అనుసంధానించిన వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో బారికేడ్లు పట్టుకుని ఉన్న ముగ్గురు యువకులు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. జనసేన నాయకులు, పోలీసులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వీరిలో రమణారెడ్డి(16) పరిస్థితి తీవ్రంగా ఉండడంతో ఆరిలోవ హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి మెరుగుపడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

సాయిరెడ్డి... శుక్రవారం!

విజయ సాయిరెడ్డిపై 'మ్యాన్ ఫ్రైడే' (సేవకుడు) అంటూ పవన్ విరుచుకుపడ్డారు. అంటే... ప్రతి శుక్రవారం కోర్టుకు వెళ్లేవారన్నారు. "రాబర్ట్ లూయిస్ స్టీఫెన్‌సన్ ఒక కథ రాశారు. అందులో ఒక పాత్రధారి 'మ్యాన్ ఫ్రైడే'. విజయసాయి రెడ్డి కూడా జగన్‌కు అంతే. ప్రతి శుక్రవారం కోర్టుకు వెళ్లే వారే మ్యాన్ ఫ్రైడేలు. ఇలాంటి వారికి ప్రజలే అంతిమ తీర్పు చెబుతారు" అని తెలిపారు.

(మొదటి పేజీ తరువాయి)

న్యూటన్ సిద్ధాంతం" అని తెలిపారు. 151 సీట్లు వచ్చినా దీనికి అతీతులు కాదని స్పష్టం చేశారు. ఇసుక కొరతను రెండు వారాల్లో పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించారు. లేనిపక్షంలో అఖిలపక్షంతో కలిసి తదుపరి ఉద్యమానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంఘీభావంగా ఆదివారం విశాఖపట్నంలో నిర్వహించిన 'లాంగ్‌మార్చ్'లో పవన్ పాల్గొన్నారు. ఆ తర్వాత పాత జైలు రోడ్డులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పవన్ ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇసుక సమస్యపై ఢిల్లీకి వెళ్లి ప్రధానితో పాటు బీజేపీ నేతలకు వివరిస్తానని తెలిపారు. "వర్షాల వల్ల ఇసుక తీయలేకపోతున్నామంటున్నారు. వర్షాలేమైనా కొత్తా? ఉత్తరప్రదేశ్, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో వరదలు వచ్చాయి. అక్కడ ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులు చచ్చిపోతున్నారా? ఒక్క ఏపీలోనే ఎందుకు చనిపోతున్నారు?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రోడ్లపైకి రావడం ప్రజలకు సరదా కాదని.. ఇప్పుడు ఇంత పెద్ద సంఖ్యలో జనం వీధుల్లోకి వచ్చారంటే ప్రభుత్వం విఫలమైందని, సరిగా పనిచేయడంలేదని అర్థమని తెలిపారు. "ఏకంగా 36 మంది భవన నిర్మాణ కార్మికులు చనిపోయారని తెలిసి ఎంతో బాధ, ఆవేదన కలిగింది. ప్రభుత్వాలున్నది ప్రజల సమస్యలు పరిష్కరించడానికే. ఇసుక ఆగిపోయిందంటే... అభివృద్ధికూడా ఆగిపోయినట్లే. ఈ విషయాన్ని వైసీపీ నేతలు అర్థంచేసుకోవాలి" అని హితవు పలికారు.

శ్రమ విలువ తెలుసు...

భవన నిర్మాణ కార్మికుల కష్టం తనను బలంగా తాకిందని పవన్ కల్యాణ్ తెలిపారు. "నేను శ్రామికుడిని. పని చేసే వాడిని. శ్రామికుడి కష్టం నాకు తెలుసు. భవన నిర్మాణ కార్మికుల కష్టం నను బలంగా తాకింది. పనిచేసే వాడిలో దేవుడిని చూడాలని మా నాన్న చెప్పారు. నాకు భవన నిర్మాణ కార్మికుల్లో దేవుడు కనిపిస్తున్నాడు. కూలీలు ఏ రోజుకు ఆరోజు పని చేసి సంపాదించుకుంటారు. ఇంటికి వచ్చేటప్పుడు నాన్న తినడానికి ఏదో తెస్తాడని పిల్లలు ఎదురు చూస్తారు. వాళ్ల కష్టం మీకు తెలుసా? తట్టలు మోసీ మోసీ వారి వెన్నెముక వంగిపోతుంది. వారే లేకుంటే... ఈ భవనాలన్నీ ఉంటాయా!?" అని భావోద్వేగంతో ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారికంగా నమోదైన భవన నిర్మాణ కార్మికులు 19.70 లక్షల మంది ఉన్నారని తెలిపారు. మొత్తంగా 35 లక్షల మంది ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఇసుక కొరతతో నిర్మాణాలు ఆగిపోయినందుకు జరుగుతున్న నష్టం వైసీపీకి తెలియడంలేదని మండిపడ్డారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిలో రూ.1200 కోట్లు ఉన్నాయని... అందులో నుంచి ఒక్కో కార్మికుడికి రూ.50 వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికులకు రూ.5 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో తాను అమరావతి వీధుల్లో నడుస్తానని హెచ్చరించారు. ఇసుక సమస్య పరిష్కారానికి తగిన విధానాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని... మంత్రులకు జీత భత్యాలు తీసుకునే నైతిక అర్హత లేదని తెలిపారు.

చంద్రబాబుపై కోపంతో లక్షలాది మంది ప్రజలను బాధపెట్టడం సరికాదన్నారు. తమ పోరాటానికి మద్దతు పలికిన బీజేపీ, సీపీఐ, సీపీఎం, లోక్‌సత్తా, బీఎస్పీలకు ధన్యవాదాలు తెలిపారు. సంఘీభావంగా తమ పార్టీ నేతలను సమావేశానికి పంపిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మరణించిన కార్మికుల ఆత్మశాంతి కోసం కొద్దిసేపు మౌనం పాటించారు.

ఇది మన దురదృష్టం

ప్రతి శుక్రవారం కోర్టుకు వెళ్లే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని పవన్ అన్నారు. "ఆర్థిక నేరాభియోగాలపై కోర్టుకు వెళ్లే వ్యక్తికి... తప్పు చేసే వారిని శిక్షించే నైతిక అర్హత ఉంటుందా? ప్రతి శుక్రవారం కోర్టుకు హాజరయ్యే విజయ సాయిరెడ్డికి నన్ను విమర్శించే నైతిక అర్హత ఉందా?" అని పవన్ నిలదీశారు. "మీరు ఢిల్లీకి వెళ్లి ఏ స్థాయి వ్యక్తులతో మాట్లాడతారో, నాలుగు గోడల మధ్య ఏం చేస్తారో, వారు ఏమనుకుంటారో అన్నీ నాకు తెలుసు. కానీ... సంస్కారం ఉంది కాబట్టి ఆ వివరాలు సభలో చెప్పడంలేదు" అని తెలిపారు. ఎన్నికల్లో నిలబడి ఓడుదుకులు తట్టుకోలేని, దేశానికి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులను రాజ్యసభ సభ్యులుగా పంపిస్తారని... కానీ, సూట్‌కేసు కంపెనీలు పెట్టే విజయసాయిరెడ్డిని రాజ్యసభలో కూర్చోవడం మన దురదృష్టమని అన్నారు. "విజయసాయిరెడ్డి నా గురించి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలకు భయపడను. నేను రెండు సార్లు ఓడిపోయినందున నిర్మాణ కార్మికుల సమస్య గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని ఆయన అంటున్నారు. అంబేడ్కర్, కాన్షీరాం కూడా ఓడిపోయారు. విజయసాయి రెడ్డి జైలుకు ఎందుకు వెళ్లారు? ప్రజాసేవ చేసి వెళ్లారా? సూట్‌కేసు కంపెనీలు పెట్టి, అక్రమ సంపాదనను విదేశాలకు పంపి, జైలుకెళ్లిన వాళ్లు మనకు నాయకులు కావడం దురదృష్టం. నువ్వు పరిధి దాటితే, ఎక్కువగా చిందులేస్తే తాట తీసి కింద కూర్చోబెడతా! బలమైనవారు, దేశాన్ని పరిపాలించే వారు నాకు తెలుసు" అని హెచ్చరించారు. తన డీఎన్ఏ గురించి మాట్లాడే హక్కు వైసీపీ నేతలకు లేదన్నారు. 'నాది ఏ డీఎన్ఏ అని మీ అమ్మాయి పెళ్లికి పిలిచారు? ఇప్పుడు 151 సీట్లు వచ్చాయని కళ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు.

ప్రజలకే దత్త పుత్రుడిని

'టీడీపీకి బీ-టీమ్, చంద్రబాబుకు దత్త పుత్రుడు' అంటూ వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలను పవన్ తిప్పికొట్టారు. తాను ప్రజలకు మాత్రమే దత్తపుత్రుడినని తెలిపారు. "టీమ్-బి అయితే ఎన్నికల ముందే టీడీపీతో కలిసేవాడిని. కొన్ని సీట్లు తీసుకుని గెలిచేవాడిని. రాజకీయ వ్యూహాలు నాకూ తెలుసు. కానీ... ఆశయమనే పిచ్చితనం నాలో ఉంది" అని తెలిపారు.

ఐదు నెలలుగా పనుల్లేవు

- ప్రభుత్వ తప్పుడు నిర్ణయంతో కార్మికులకు ఇక్కట్లు: నాదెండ్ల
- ప్రశ్నిస్తే తప్పుడు కేసులు: రాపాక
- సీఎం ఉన్నాడా.. కళ్లు మూసుకున్నాడా: బాబ్జీ

విశాఖపట్నం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇసుకపై ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయం వల్ల భవన నిర్మాణ రంగంపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికులు 5 నెలల నుంచి పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జనసేన నేత నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం విశాఖ సభలో ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉండాలన్న ఉద్దేశంతోనే లాంగ్ మార్చ్‌కు పిలుపిచ్చినట్లు తెలిపారు. తెలంగాణలో 48 వేల మంది ఆర్టీసీ కార్మికులకు కోసం విపక్షాలన్నీ ఏకమై ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నాయని, అదేమాదిరిగా ఇక్కడ లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికుల కోసం ఐక్యంగా పోరాడాలన్న ఉద్దేశంతో అన్ని ప్రతిపక్షాలను కలుపుకొని లాంగ్‌మార్చ్ నిర్వహించామని చెప్పారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని పనులను ఆపేసి.. అన్నిటికీ వైసీపీ జెండా రంగులు వేయడమే ప్రధాన ఎజెండాగా పెట్టుకుందని జనసేన ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఎద్దేవా చేశారు. జనసేన లాంగ్ మార్చ్‌కు పిలుపిచ్చిన వెంటనే ఇసుక వారోత్సవాలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్పిందని, అప్పటి వరకు కార్మికుల కష్టాలు ప్రభుత్వానికి తెలియవా అని ప్రశ్నించారు. ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయకుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు వైసీపీ అధినేత జగన్ ప్రతిచోటా 'నేను ఉన్నాను.. నేను విన్నాను' అని చెప్పేవారని, భవన నిర్మాణ కార్మికులు ఐదు నెలలుగా పనులు లేక రోడ్డున పడి అల్లాడుతుంటే 'అసలు ఉన్నావా? ఉన్నా కళ్లు మూసుకున్నావా' అని ప్రశ్నిస్తున్నామన్నారు.

36 మంది ఆత్మహత్యలు

- మా కోసం పవన్ రావడం సంతోషం
- ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘ అధ్యక్షుడు రాజు

గత ఐదు నెలల్లో రాష్ట్రంలో 36 మంది భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంఘ అధ్యక్షుడు రాజు తెలిపారు. అయితే వారంతా కుటుంబ గొడవలు, మతిభ్రమించి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెబుతుండడం దుర్మార్గమని సభలో చెప్పారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో ఉన్న నిధుల నుంచి కొంత మొత్తాన్ని తీసి.. కార్మికులకు చెల్లించి ఆదుకోవాలని ఆయన కోరారు. ఆత్మహత్య చేసుకున్న కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 'భవన నిర్మాణ రంగంపై ఆధారపడి 33 రకాల పనులు చేసే 85 లక్షల మంది కార్మికులు ఐదు నెలలుగా ఇసుక కొరతతో పనులు లేక రోడ్డున పడ్డారు. లక్షలాది మంది కార్మికుల ఘోషను ప్రభుత్వానికి తెలియజేయడానికి పవన్ కల్యాణ్ ముందుకు రావడం ఆనందంగా ఉంది' అని తెలిపారు.

ఐదు నెలల్లో అధోగతి పాల్జేశారు!

- లారీ ఇసుక 50 వేలా?.. తులం బంగారం ధరా?
- భవన నిర్మాణ కార్మికుల్ని హేళనగా మాట్లాడతారా?
- మంత్రులపై అయ్యన్న ఆగ్రహం.. రాష్ట్రంలో శాడిస్టు ప్రభుత్వం
- కల్లుతాగిన కోతుల్లా మంత్రులు.. వారిది పూటకోమాట: అచ్చెన్న

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐదు నెలల్లో రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు అన్నారు. ఇసుక కోసం ఉద్యమాలు చేసే పరిస్థితి రావడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో గాంధీజీ ఉప్పు సత్యాగ్రహం చేస్తే.. నేడు రాష్ట్రంలోని దుర్మార్గుడి పాలనలో ఇసుక సత్యాగ్రహం చేసే పరిస్థితి వచ్చిందన్నారు. ఆదివారమిక్కడ జనసేన సభలో ఆయన, మరో టీడీపీ సీనియర్ నేత కె.అచ్చెన్నాయుడు ప్రసంగించారు. లారీ ఇసుక రూ.40-50 వేలకు బ్లాక్‌లో కొనాల్సి వస్తోందని.. ఇది తులం బంగారంతో సమానమని చెప్పారు. తన 37 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇటువంటి దౌర్భాగ్యమైన పాలనను ఎన్నడూ చూడలేదన్నారు. 'ఇసుకపై ఆధారపడి పని చేసుకుని బతుకుతున్న లక్షలాది మంది కూలీలు రోడ్డునపడ్డారు. రోజువారీ వడ్డీలు కట్టలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న భవన నిర్మాణ కార్మికుల గురించి మంత్రులు హేళనగా మాట్లాడడం దుర్మార్గం. 14 నెలలు జైలులో ఉన్నవారికి ప్రజా సమస్యలు ఏం తెలుసు? విశాఖలోని మానసిక వైద్యశాలలో చికిత్స పొందతున్న వారిలో ఎవరిని తీసుకెళ్లి సీఎం కుర్చీలో కూర్చోబెట్టినా జగన్ కంటే బాగా పాలిస్తారు.దొంగలు రాజ్యం ఏలుతుంటే, ప్రజల కోసం పోరాడేవారిపై కేసులు నమోదు చేయడం దారుణం' అని మండిపడ్డారు. విశాఖలో భూ ఆక్రమణలపై తమ ప్రభుత్వ హయాంతో సిట్ వేశామని, సీబీఐతో విచారణ జరపాలని అప్పట్లో విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారని, కానీ ఇప్పుడు రెండో సిట్ ఎందుకు వేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మీకు, మీ నాయకుడికి దమ్ముంటే సీబీఐతో విచారణ జరిపించాలన్నారు. జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు జనసేన భవిష్యత్‌లో ఎటువంటి కార్యక్రమాలు చేసినా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. రాష్ట్రంలో శాడిస్టు ప్రభుత్వం ఉందని, ప్రతిపక్షాల ఆందోళనలను భగ్నం చేయడానికి యత్నిస్తోందని అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. కల్లు తాగిన కోతుల మాదిరిగా రాష్ట్ర మంత్రులు పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎప్పుడు ఏ పార్టీ తరపున పోటీ చేస్తాడో తెలియని విశాఖ జిల్లా మంత్రి.. పవన్‌ను చంద్రబాబు దత్తపుత్రుడని విమర్శించడం శోచనీయమని ముత్తం శెట్టి శ్రీనివాసరావును ఉద్దేశించి అన్నారు.

ఇసుక కొరతను నిరసిస్తూ నెల్లూరులో జనసేన నేతలు ఆదివారం నిరాహార దీక్ష తలపెట్టారు. కేతంరెడ్డి వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాకుళం నుంచి ఒకవైపు డబ్బు కట్టలు పెట్టి.. మరోవైపు ఇసుకను ఉంచి తూకం వేసి అమ్మకాలు సాగించారు. దీనికిముందు ర్యాలీ చేశారు. -నెల్లూరు(బీవీనగర్)

భవన నిర్మాణ కార్మికుల మృతికి సంతాప సూచకంగా మౌనం పాటిస్తున్న పవన్‌కల్యాణ్, నాగబాబు, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు తదితరులు

గ్రామంలో పోలీసుల పహారా

వైసీపీ కార్యకర్తల వీరంగం

బీజేపీ కార్యకర్తలపై దాడి.. 11 మందికి గాయాలు

రణస్థలం, నవంబరు 3: శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం బంటుపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి వైసీపీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. బీజేపీ కార్యకర్తలపై మూకుమ్మడిగా దాడిచేశారు. ఈ ఘటనలో బీజేపీకి చెందిన 11 మంది కార్యకర్తలు గాయపడ్డారు. ఆదివారం ఉదయం గ్రామంలో వైసీపీ నాయకుల ఆత్మీయ కలయిక సమావేశాన్ని నిర్వహించారు. దీనికి మంత్రి ధర్మాన కృష్ణదాస్‌తో పాటు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ వేదికకు ఎదురుగా ఉన్న కొందరు బీజేపీ కార్యకర్తల ఇళ్లపై ఆ పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు ఉన్నాయి. అయితే, ఆత్మీయ కలయిక సమావేశం ముగిసిన తర్వాత రాత్రి 8 గంటల సమయంలో కొందరు వైసీపీ కార్యకర్తలు బీజేపీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి పార్టీ జెండాలు, ఫ్లెక్సీలను తొలగించాలని గొడవపడ్డారు. దీనికి వారు నిరాకరించడంతో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో వైసీపీ కార్యకర్తలు బీజేపీ కార్యకర్తలపై దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో బీజేపీ మద్దతుదారులు కాకి చిన్నారావు, కాకి ఆదినారాయణ, కాకి పడివాడు, కాకి నర్సమ్మ, మల్లీశ్వరి, శిరీష, ఆదిలక్ష్మి, లలిత, భవాని, రాంబాబు, దుర్గాప్రసాద్ గాయపడ్డారు. అలాగే కిటికీ అద్దాలను, ఓ ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని పార్టీ నాయకుడు నడుకుదిటి ఈశ్వరరావు బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన జిల్లా ఎస్పీ అమ్మిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

జగన్ మేలుకో.!

- అదానీ, రిలయన్స్ తరలిపోతున్నాయ్
- పెట్టుబడులు వెళ్లిపోతున్నాయ్: దేవధర్

అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రూ.70 వేల కోట్ల పెట్టుబడితో భారీ డేటా సెంటర్‌ను పెట్టేందుకు ముందుకొచ్చిన అదానీ సంస్థ.. దానిని ఇప్పుడు హైదరాబాద్‌కు మార్చేస్తుండడంతో బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ దేవధర్ ఆదివారం ట్విటర్‌లో స్పందించారు. 'రూ.70 వేల కోట్ల అదానీ డేటా-సోలార్ ప్రాజెక్టు పెట్టుబడులు, రూ.15 వేల కోట్ల రిలయన్స్ ఎలక్ట్రానిక్ పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్ నుంచి తరలిపోతున్నాయ్.. రాష్ట్ర సొంత ఆదాయం జీతాలకు, అప్పుల వడ్డీలకు చాలడం లేదు.. నవరత్నాలకు సంపాదించి ఖర్చు పెట్టాలి కానీ.. అప్పులు చేసి కాదు.. మేలుకో జగన్.!' అని పేర్కొన్నారు.

త్రిపుర తరహాలో తిష్ఠ!

- ఆంధ్రలో సొంతగా బలోపేతమే లక్ష్యం
- బీజేపీ అధినాయకత్వం వ్యూహం
- ప్రజాసమస్యలపై ప్రజాక్షేత్రంలోకి తరచూ కేంద్ర మంత్రుల రాక
- సీనియర్ నేతలు, ఎంపీలు కూడా..
- శ్రేణుల్లో పెరిగిన ఉత్సాహం
- నడ్డా పర్యటన తర్వాత కమిటీలు

అమరావతి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'అగర్తలాలో ఆసరా లేని పరిస్థితి నుంచి అయిదేళ్లలోనే త్రిపురలో అధికారం కైవసం చేసుకున్నాం. కమ్యూనిస్టుల కంచుకోటను బద్దలు కొట్టి పీఠమెక్కాం.. ఆంధ్రప్రదేశ్‌లో కూడా అధికారంలోకి రావడం ఏ మాత్రం కష్టం కాదు..' అని బీజేపీ అధినాయకత్వం భావిస్తోంది. ప్రజా సమస్యలే ఆయుధాలుగా.. మోదీ ప్రభుత్వ పాలనే ఆలంబనగా ఏపీ సచివాలయానికి రహదారులు వేసుకోవాలని భావిస్తోంది. తదనుగుణంగా అనుసరించాల్సిన ఎత్తుగడలపై పార్టీ రాష్ట్ర నాయకత్వానికి మార్గనిర్దేశం చేస్తూ క్షేత్రస్థాయిలో కార్యకర్తల్ని ఉత్తేజితుల్ని చేసేందుకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. ఫలితంగా మూడు నెలల క్రితం వరకూ విలేకరుల సమావేశాలు, ప్రకటనలకే పరిమితమైన రాష్ట్ర నాయకత్వం.. ఇప్పుడు పల్లెల్లోకి వెళ్తోంది. ఇళ్ల తలుపులు తడుతూ జనం సమస్యలు తెలుసుకుంటోంది. టీడీపీతో పాటు తమ కార్యకర్తలపైనా గ్రామాల్లో దాడులు జరుగుతున్నా.. కేసులు పెడుతున్నా వెనక్కి తగ్గకుండా ప్రజా సమస్యలపై పోరాటం సాగిస్తోంది. నిజానికి వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు నెలల వరకూ ఎలాంటి విమర్శలు చేయరాదని బీజేపీ రాష్ట్ర నేతలు నిర్ణయించుకున్నారు. కానీ జగన్ సీఎం అయ్యాక జరిగిన కొన్ని పరిణామాలు ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ప్రజావేదిక కూల్చివేత, రాజధాని మార్పు ప్రకటనలు.. కొత్త ఇసుక విధానం తెస్తామంటూ ఉన్న రీచ్‌లను మూసివేయడం.. ఇసుక కొరత తీవ్రతరం కావడం.. ప్రభుత్వం ఏమీ చేయకపోవడం.. భవన నిర్మాణ కార్మికుల ఆత్మహత్యలు.. పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోతుండడం తదితర పరిణామాలు జనంలో తీవ్ర అసంతృప్తికి దారితీశాయి. వీటిని సానుకూలంగా మలుచుకుని రాష్ట్రంలో బలపడేందుకు రాష్ట్ర కమలనాథులు పోరుబాట ఎంచుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నుంచి అనంతపురం జిల్లా వరకు పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. ఇక్కడి పరిస్థితులు కేంద్ర నాయకత్వం దృష్టికి వెళ్లడంతో రాష్ట్ర నేతలకు దన్నుగా కేంద్ర మంత్రులను, పార్టీ సీనియర్ నేతల్ని రంగంలోకి దించుతోంది. పార్టీ నేతలు, కేడర్‌ను క్షేత్ర స్థాయికి పంపేందుకు 'మన్ మే బాపూ' కార్యక్రమం తీసుకొచ్చింది. గాంధీజీ 150వ జయంత్యుత్సవాల్లో భాగంగా సంకల్ప యాత్రలు చేపట్టారు. దాదాపు నెలపాటు ప్రజల్లో విస్తృతంగా పర్యటించి.. 13 జిల్లాల్లో అక్టోబరు 31 వరకూ కార్యక్రమాన్ని కొనసాగించారు. పోలవరం ప్రాజెక్టును సందర్శించి వాస్తవాలతో కూడిన నివేదికను కేంద్ర జల శక్తి శాఖకు సమర్పించామని.. జగన్ ప్రభుత్వం రైతులకు ఇస్తున్న రైతు భరోసా మొత్తం రూ. 13,500లో కేంద్రం వాటా రూ.6 వేలని ప్రజలకు తెలియజెప్పామని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. జమ్మూకశ్మీరుకు 370 అధికరణ రద్దు, దాని ఫలితాలు, ఆర్థికంగా వెనకబడిన అగ్రవర్ణాలకు పది శాతం రిజర్వేషన్ మొదలైన అంశాలను యువతలోకి తీసుకెళ్లేందుకు బీజేవైఎం యూనివర్సిటీలు, విద్యా సంస్థల్లో సమావేశాలు, సదస్సులు నిర్వహించింది. వీటిలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్ కూడా పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు సదానంద గౌడ, పురుషోత్తం రూపాలా, రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, సుజనాచౌదరి, టీజీ వెంకటేశ్, కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ జయప్రకాశ్ నారాయణ తదితర నేతలు కూడా రాష్ట్రంలో పర్యటించారు. ఈ కార్యక్రమాలు తమ శ్రేణుల్లో ఉత్సాహం తెచ్చాయని బీజేపీ నేతలు అంటున్నారు. ఇసుక సమస్యపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విశాఖలో నిర్వహించిన లాంగ్‌మార్చ్‌కు మద్దతిచ్చినా.. బీజేపీ సొంతగా సోమవారం విజయవాడలో భారీ ధర్నా నిర్వహిస్తోంది. అలాగే పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా ఈ నెల 10న చేపట్టిన విజయవాడ పర్యటనను విజయవంతం చేయాలని నిర్ణయించింది. అనంతరం జిల్లా, క్షేత్రస్థాయి కమిటీల నియామకానికి.. నెలాఖరుకల్లా రాష్ట్ర కమిటీ ఏర్పాటుకు సమాయత్తమవుతోంది.

సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ

వైసీపీ గూండాల దౌర్జన్యాలను ఎదుర్కొంటాం

- 5నెలల పాలనలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకత
- ఇసుక కొరత సృష్టించి కార్మికులను బజారుపాలు
- జగన్ రాక్షస పాలనపై ఉద్యమిస్తాం: కన్నా

కడప(మారుతీనగర్)/రేణిగుంట, నవంబరు 3: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ గూండాల దౌర్జన్యాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. వైసీపీ రౌడీమూక, గూండాల ఆగడాలను సమర్థంగా ఎదుర్కొంటామన్నారు. ఆదివారం తిరుపతి విమానాశ్రయంలోనూ, కడపలోని వైఎస్ఆర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలోనూ కన్నా మాట్లాడారు. కులాలు, మతాలు, పార్టీలకతీతంగా ప్రధాని మోదీ దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు 130 సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. కేంద్ర పథకాలకు సీఎం జగన్ కొత్తపేర్లు పెట్టి వాటిని తానే అందిస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ కార్యకర్తలకే ఉద్యోగాలిస్తూ పాలన సాగిస్తున్న తీరు సరైంది కాదన్నారు. కేవలం ఐదునెలల పాలనలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. ఇతర పార్టీల నాయకులను పార్టీ మారాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, మారని వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్న తీరు దారుణమన్నారు. అవినీతిరహిత పాలన అందిస్తానంటూ తేనె పలుకులు పలికి ప్రస్తుతం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఇసుక కొరత సృష్టించి లక్షలాది మంది కార్మికులను బజారుపాలు చేశారని కన్నా విమర్శించారు. ఇసుకపై బీజేపీ మొట్టమొదట ఉద్యమం చేపట్టి విజయవాడలో ధర్నాకు పిలుపునిచ్చామని గుర్తుచేశారు. ఇటీవల రాజంపేట పరిధిలోని తాళ్లపాకలో ఇసుక అక్రమ రవాణా అవుతోందని చెప్పిన వ్యక్తిపై వైసీపీ గూండాలు దాడులకు తెగబడడం దారుణమన్నారు. జగన్ సాగిస్తున్న రాక్షస పాలనకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అయినా, ఎవరైనా కార్యక్రమాలు చేపడితే బీజేపీ సంఘీభావం తెలియజేస్తుందన్నారు. అంతకుముందు కన్నా, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి సమక్షంలో టీడీపీకి చెందిన కడప మాజీ కార్పొరేటర్లు సర్దారి, బాలకొండయ్య, కృష్ణతో పాటు వందమందికి పైగా బీజేపీలో చేరారు.

కనెక్ట్ టు ఆంధ్రా!

- సామాజిక బాధ్యత విరాళాల సేకరణకు కొత్త సంస్థ
- స్మార్ట్‌ఏపీ ఫౌండేషన్ స్థానంలో ఏర్పాటుకు నిర్ణయం
- ఛైర్మన్‌గా సీఎం జగన్... వెయ్యి కోట్ల స్వీకరణ లక్ష్యం

అమరావతి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యత కింద దాతల నుంచి విరాళాలు సేకరించి అభివృద్ధి, సంక్షేమం చేసేందుకు 'కనెక్ట్ టు ఆంధ్రా' పేరుతో ఒక సంస్థను నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వం ప్రారంభించిన 'స్మార్ట్ ఏపీ ఫౌండేషన్' పేరు మార్చి, కొత్తపేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిసింది. సీఎం జగన్ ఛైర్మన్‌గా వ్యవహరించే కనెక్ట్ టు ఆంధ్రా ఫౌండేషన్‌కు సలహా మండలిని కూడా నియమిస్తారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో సామాజిక బాధ్యత కింద పలు కంపెనీలు రూ.62.59కోట్లు ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చాయి. మరో రూ.13.3కోట్లు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద పథకాల అమలుకు విరాళంగా అందించాయి. వీటితో పాటు ప్రపంచ వ్యాప్తంగా పేరున్న దాతృత్వ సంస్థలు, ప్రసిద్ధ పారిశ్రామికవేత్తలు, రాష్ట్ర ప్రముఖులు... ఇలా అందరి నుంచి విరాళాలు సేకరించి ఆ సొమ్మును పేదల అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ కార్యక్రమం కింద రూ.వెయ్యి కోట్లు విరాళంగా స్వీకరించాలనేది లక్ష్యంగా చెబుతున్నారు.

ఇకపై.. ఏటా డీఎస్సీ

- ఎంఈవోలకు పదోన్నతులు: మంత్రి సురేశ్ హామీ

సదస్సులో మాట్లాడుతున్న మంత్రి సురేశ్, హాజరైన ఎంఈవోలు

విజయవాడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహించనున్నట్టు విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ తెలిపారు. ఆదివారం విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో 'ప్రభుత్వ విద్యా సంస్కరణలపై రాష్ట్రస్థాయి సదస్సు' నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు హాజరైన మంత్రి సురేశ్ మాట్లాడుతూ, విద్యాశాఖలోని టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల్లో ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ప్రభుత్వం 'నాడు-నేడు' కార్యక్రమం కింద క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న కార్యక్రమాలు సమర్థంగా పూర్తి చేసేందుకు మండల విదాశాఖాధికారుల వ్యవస్థను పటిష్టం చేయనున్నట్టు చెప్పారు. ఎంఈవోలకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్ ఇచ్చేందుకు, ఎంఈవోలకు సీనియారిటీ ప్రాతిపదికన జిల్లా ఉప విద్యాశాఖాధికారులుగా పదోన్నతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు కృషి చేస్తామన్నారు. అన్ని పాఠశాలల్లో 'నో బ్యాగ్ డే' అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. మండల విద్యాశాఖాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆదూరి వెంకటరత్నం మాట్లాడుతూ, ఎంఈవోల డిమాండ్లను మంత్రికి వివరించారు. ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోదా కోసం అందర్నీ కలుపుకెళ్లాలి

- ప్రభుత్వానికి చలసాని శ్రీనివాస్ సూచన

అనంతపురం, నవంబరు 3: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే విషయంలో ప్రభుత్వం పార్టీలకతీతంగా అందర్నీ కలుపుని వెళ్లాలని ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాస్ అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం కేంద్రంపై పోరాడాల్సిన బాధ్యతను ప్రభుత్వం భుజానికెత్తుకోవాలని ఆయన సూచించారు. అనంతపురంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రం విషయంలో కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను మంజూరు చేయకుండా కక్ష సాధింపు ధోరణిని అవలంబిస్తోందన్నారు. జాతీయస్థాయి పరీక్షల్లో గుజరాతీ భాషను చేర్చిన కేంద్రం.. దేశంలోనే ఎక్కువ మంది మాట్లాడే తెలుగు భాషను ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆరు నెలలు గడువు ఇచ్చామని.. సీఎం జగన్ ఇకనుంచైనా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని కేంద్రంపై రాష్ట్రానికి రావాల్సిన హక్కుల కోసం పోరాడాలని సూచించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం కేంద్రంపై మరింత ఒత్తిడి పెంచేందుకు డిసెంబరు మొదటి వారంలో అనంతపురంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు.

ఆరు నెలలైనా.. కాళ్ల పారాణి ఆరలేదా?

- అలా అనడానికి సిగ్గుపడాలి
- మాజీ మంత్రి దేవినేని ఉమ ధ్వజం

విజయవాడ(వన్‌టౌన్), నవంబరు 3: అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా కాళ్లకు పారాణి ఆరలేదనడానికి సీఎం జగన్, మంత్రులు సిగ్గుపడాలని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమ మండిపడ్డారు. ముఖ్యమంత్రి అనుభవరాహిత్యంతో ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చుకుంటున్నారని.. సీఎం, మంత్రులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం విజయవాడలో ఆయన మాట్లాడారు. '1న జీఏడీ ముఖ్య కార్యదర్శికి చీఫ్ సెక్రటరీ ఇచ్చిన షోకాజ్ నోటీసులపై సీఎం వివరణ ఇవ్వాలి. అనంతపురం నుంచి ఇసుక బెంగళూరు తరలిపోతోంది. కంచికచర్ల మార్కెట్ యార్డులో పట్టుబడ్డ ఇసుక లారీలకు పర్మిట్లు పుట్టించి హైదరాబాద్ తరలిస్తున్నారు. భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇవేవీ సీఎంకు కనిపించడం లేదా? ఆయన మీడియా ముందుకు వచ్చి ఇసుకపై ఎందుకు మాట్లాడడం లేదు? అన్ని రాష్ట్రాల్లో వానలు పడడం లేదా? వరదలు రావడం లేదా? అయినా ఇసుక దొరుకుతోంది కదా! ఆరు నెలల్లో మంచి ముఖ్యమంత్రి అవుతానన్న జగన్ ఏమీ కాలేకపోయారు. మీడియాకు భయపడి 938 జీవోను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పక్కన పెడితే ఆ జీవోకు నగిషీలు చెక్కి జీవో 2430గా ఇచ్చి అప్రకటిత ఎమర్జెన్సీ సృష్టించారు. చివరకు పత్రికలకు కూడా కులాలు ఆపాదిస్తున్నారు. ఈ ప్రభుత్వాన్ని జగన్ మీడియా పునరావాస ప్రభుత్వంగా మార్చారు' అని దుయ్యబట్టారు.

దళితులపై అత్యాచారాలు 100% నిజమే

- హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ బాలకృష్ణన్

విజయవాడ, నవంబరు 3: దేశంలో ఎస్సీ, ఎస్టీ మహిళలు, యువతులపై జరుగుతున్న అత్యాచారాలు 100% నిజమైనవేనని జాతీయ మానవ హక్కుల కమిషన్‌ఛైర్మన్ జస్టిస్ కేజీ బాలకృష్ణన్ అన్నారు. ఆలిండియా దళిత్ రైట్స్ ఫోరమ్, దళిత్ శోషన్ ముక్తి మంచ్, ఎన్‌డీయంజే సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణన్ మాట్లాడుతూ, అత్యాచారానికి గురైనవారు బలహీనులు, అత్యాచారాలు చేసేవాళ్లు ఆర్థికంగా, రాజకీయంగా బలవంతులని పేర్కొన్నారు. కేసులు పెట్టకుండా భయపెడతారని, ప్రలోభపెడతారని, పోలీసుల్ని కూడా ప్రభావితం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యాచార నేరస్థుల్ని, తప్పుడు కేసులు పెట్టేలా పోలీసులు ప్రోత్సహిస్తున్నారని, కేసుల్ని సెటిల్‌మెంట్ దిశగా తీసుకు వెళ్తున్నారని అన్నారు.

డీపీఆర్‌లు సమర్పించినా.. నాన్చుడే..!

(మొదటి పేజీ తరువాయి)

వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా.. పారిశ్రామికవేత్తలు సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లు సమర్పించినా భూ కేటాయింపులు చేయడం లేదు. దీంతో పరిస్థితులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన ఉన్నాయి.

కంపెనీల పక్క చూపులు..

గత ప్రభుత్వ హయాంలోనే పలు కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడతామంటూ ఒప్పందం చేసుకున్నాయి. తర్వాత తాము స్థాపించే కంపెనీ పెట్టుబడి ఎంత? ఎంత పెట్టుబడి పెడతాం? ఎంతమందికి ఉద్యోగాలు కల్పిస్తాం.. తదితర వివరాలతో డీపీఆర్‌లు సమర్పించాయి. వాటిని ఏపీఐఐసీ పరిశీలించి ఆయా కంపెనీలకు భూములు కేటాయించాల్సి ఉండగా.. నత్తనడకన వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి. పలు కంపెనీలకు నెలల తరబడి భూ కేటాయింపులు చేయడం లేదు. దీంతో కొన్ని కంపెనీలు ప్రత్యామ్నాయం చూసుకుంటున్నాయి. ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయేందుకు సమాయత్తమవుతున్నాయి. ప్రోత్సాహకరంగా లేదనే భావనతో మరికొన్ని సంస్థలు పెట్టుబడి ప్రతిపాదనలపై మౌనంగా ఉండిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, ఉద్యోగాల కల్పనకూ ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఫుడ్‌ప్రాసెసింగ్ నుంచి గృహోపకరణాల వరకు..

రాష్ట్రంలో వినూత్నమైన టెక్నాలజీతో విద్యుత్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒక సంస్థ ముందుకొచ్చింది. రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. డీపీఆర్ కూడా సమర్పించింది. పెట్టుబడులు పెట్టేందుకు అంతా సిద్ధం చేసుకుంది. కానీ ఇప్పుడా కంపెనీ తెలంగాణకు వెళ్లిపోయేందుకు సిద్ధమైనట్లు సమాచారం. గత ఐదు నెలలుగా ఆ కంపెనీతో మాట్లాడకపోవడం, భూ కేటాయింపు చేయడం, ప్రోత్సాహకర వాతావరణం లేకపోవడంతో.. తెలంగాణకు తరలిపోవడానికి రంగం సిద్ధం చేసుకుందని అంటున్నారు. మరోవైపు ఉత్తరాంధ్రలో ఒక ఫుడ్‌ప్రాసెసింగ్ సంస్థ భారీ ఎత్తున పెట్టుబడులు పెడతానని ముందుకొచ్చి ఎంవోయూ కుదుర్చుకుంది. దేశంలోనే ప్రసిద్ధి చెందిన ఆ సంస్థకు త్వరితగతిన భూమి కేటాయించి నిర్మాణ కార్యక్రమాలు ప్రారంభించే ప్రక్రియ మాత్రం మొదలుకాలేదు. గృహావసరాలకు చెందిన ఓ ఉత్పత్తుల సంస్థ కూడా తిరుపతిలో భూమి కేటాయిస్తే ప్లాంటు పెడతామని గతంలోనే ఒప్పందం చేసుకుంది. అదీ ఇంతవరకూ ట్రాక్ ఎక్కలేదు. మరో ప్రసిద్ధ కంపెనీని ఎన్నికల ముందు తాత్కాలికంగా ఒక సెజ్‌లో రెడీ టు స్టార్ట్ పద్ధతిలో ప్రారంభింపజేశారు. అదే సంస్థ తమకు బయట భూకేటాయింపు చేస్తే విస్తరణ చేస్తామని అప్పట్లోనే ఎంవోయూ చేసుకుంది. ఇంతవరకూ ఆ పని జరగలేదు. పలు చిన్నా, పెద్ద కంపెనీలకు ఇలాంటి పరిస్థితే ఎదురవడంతో అవి కూడా రాష్ట్రంలో పరిస్థితి ఇంతే అనుకుని నిరుత్సాహానికి గురై.. ప్రత్యామ్నాయాలు చూసుకుంటున్నాయని అంటున్నారు.

అవైతే ఏళ్లు.. ఇవైతే నెలలే!

వాస్తవానికి ఒక కొత్త కంపెనీతో మాట్లాడి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ఒప్పించేందుకు ఎక్కువ సమయం పడుతుంది. ఒక్కోసారి నెలలు.. సంవత్సరాలు కూడా పట్టొచ్చు. కానీ ఇప్పటికే ఎంవోయూలు కుదిరి.. డీపీఆర్‌లు సమర్పించిన కంపెనీలను ప్రారంభానికి సిద్ధం చేసేందుకు అధిక సమయం పట్టకపోవచ్చు. ఆయా కంపెనీలకు భూములు కేటాయించి ప్రోత్సహిస్తే అవి ముందుకు పరుగెట్టేందుకు అవకాశముంటుంది. కానీ డీపీఆర్‌ల మీద రకరకాల అనుమానాలతో గానీ.. మరేవైనా కారణాలతో గానీ.. భూ కేటాయింపులు ఆలస్యమవుతున్నాయన్న ఆరోపణలున్నాయి. డీపీఆర్‌లు ఏపీఐఐసీ చేతిలోనే ఉంటాయి. అంతా సక్రమంగా ఉందా..? ఏమైనా తేడా ఉందా..? పెట్టుబడులు పెట్టే సత్తా ఉందో లేదో అన్నీ పరిశీలించుకోవచ్చు. లేకుంటే ఏదైనా ఒక ఏజెన్సీకి ఆ పని అప్పగించవచ్చు. పెట్టుబడులను పెట్టించే పనిని వేగవంతం చేయాల్సింది పోయి.. మీనమేషాలు లెక్కించడం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా నష్టం కలుగుతోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. పెట్టుబడులు ఆగడం-ఆలస్యం అవడం వల్ల జరగాల్సిన అభివృద్ధి, రావలసిన ఉద్యోగాలు.. అన్నింటికీ గండిపడుతోందని అంటున్నారు.

ఆ అధికారి తీరుతో..

పరిశ్రమలు, పెట్టుబడులు పెట్టేందుకు వచ్చేవారిని ఆకట్టుకునేందుకు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పోటీ నెలకొంది. దేశంలోనూ అన్ని రాష్ట్రాలు ప్రోత్సాహకాలివ్వడానికి పోటీపడుతున్నాయి. ఒక కంపెనీ వస్తే ఉద్యోగాల కల్పన, దీర్ఘకాలంలో ఆర్థిక వృద్ధి, అదే సమయంలో పెట్టుబడి అనుకూల వాతావరణం ఏర్పడితే మరిన్ని కంపెనీలు వస్తాయన్న ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వాలు సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తున్నాయి. ఇటీవల ఒక ప్రసిద్ధ కంపెనీ యజమాని మన రాష్ట్రంలో ఓ ఉన్నతాధికారిని కలిసేందుకు వెళ్లారు. అయితే సదరు ఉన్నతాధికారి వ్యవహరించిన తీరుతో ఆ కంపెనీ యజమాని నొచ్చుకుని.. బాధతో, ఆగ్రహంతో వెనక్కి వెళ్లిపోయినట్లు తెలిసింది. దీనిపై రాజకీయ వర్గాల్లోనూ చర్చ జరిగింది. ఈ అంశంపై వివరణ తీసుకునేందుకు పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి కోసం ప్రయత్నించినా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

అంతా నా ఇష్టం!

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టంగా వివరించారు. ప్రవీణ్ ప్రకాశ్ ఉద్దేశపూర్వకంగానే పైఅధికారుల ఆదేశాలు బేఖాతరు చేశారని తెలిపారు. వారంలోగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. కేబినెట్ ఎజెండా తయారీలో, మంత్రివర్గ సమావేశంలో చర్చకు రావాల్సిన అంశాలను పొందుపరచడంలో ప్రవీణ్ బిజినెస్ రూల్స్ పాటించలేదని, వీటికి సంబంధించి సీనియర్ అధికారులు ఇచ్చిన ఆదేశాలనూ ఖాతరుచేయలేదని పేర్కొన్నారు. మెమోలో ఉన్న వివరాల ప్రకారం... వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డుల ఫైలును కేబినెట్ అజెండాలో పొందుపరిచేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ప్రవీణ్ ఫైలు పంపారు. అయితే, ఆ ఫైలుకు ఆర్థిక శాఖ ఆమోదం తీసుకుని తిరిగి పంపాలని ఆదేశిస్తూ సీఎస్ వెనక్కి పంపారు. కానీ, అవేమీ పాటించకుండా ఆ ఫైలును ప్రవీణ్ ప్రకాశ్ నేరుగా కేబినెట్ ముందు ప్రవేశపెట్టాడు. బిజినెస్ రూల్స్‌లోని రూల్ 7(2) ప్రకారం.. సెక్రటరీ ఒక ఫైలుపై సంబంధిత శాఖ నుంచి తప్పనిసరిగా ఆమోదాలు తీసుకోవాలి. వైఎస్సార్ లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డుల ఫైలుకు ఆర్థిక శాఖ ఆమోదం తీసుకోలేదు. పైగా దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టమైన సూచనలు ఇచ్చినా... ఆ ఆదేశాలను తుంగలో తొక్కి ఆ ఫైలును కేబినెట్ ముందు ప్రవేశ పెట్టారు. మంత్రివర్గ సమావేశంలో గ్రామన్యాయాలయాల ఫైలు పెట్టాలని న్యాయశాఖకు ముఖ్యమంత్రి జగన్ నుంచి ఆదేశాలు అందాయి. ఆ ఫైలుపై సీఎం సంతకం కూడా జరిగిపోయింది. దీనికి సంబంధించిన మెమోను జీఏడీలోని కేబినెట్ విభాగానికి అందజేశారు. అయినప్పటికీ గత నెల 16వ తేదీ, 30వ తేదీ ల్లో జరిగిన కేబినెట్ సమావేశాల్లో గ్రామ న్యాయాలయాల ప్రతిపాదన ఫైలును ప్రవేశపెట్టడంలో ప్రవీణ్ ప్రకాశ్ విఫలమయ్యారు. న్యాయశాఖ కార్యదర్శి విజ్ఞప్తి చేసినప్పటికీ ఆయన మంత్రివర్గ భేటీకి ఆ ఫైలు తీసుకురాలేదు. ఆ ప్రతిపాదనలను నిలుపుదల చేసే అధికారం ఆయనకు ఈ ఫైలును కేబినెట్‌లో పెట్టకూడదని ఒకవేళ సీఎం కార్యాలయం నుంచి ప్రవీణ్ ప్రకాశ్‌కు మౌఖిక ఆదేశాలేమైనా అందిఉంటే.. ఆ విషయాన్ని సీఎస్ దృష్టికి తీసుకురావాలి. కానీ అలా జరగలేదు. నిర్ణయాలు తీసుకోవడంలో, ఫైళ్ల సర్క్యులేషన్‌లో ప్రవీణ్ ప్రకాశ్ నిబంధనలు పాటించలేదని, ఉద్దేశపూర్వకంగా పై అధికారుల ఆదేశాలు బేఖాతరు చేశారని.. తద్వారా ఏఐఎస్ కండక్ట్ రూల్స్ 1968ను ఉల్లంఘించారని సీఎస్ మె మోలో పేర్కొన్నారు. వీటన్నిటికీ వారంలోగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

ధూల్‌పేట కుర్రాడు.. బిగ్‌బాస్ విజేత

- రాహుల్ సిప్లిగంజ్‌కు సీజన్ త్రీ కిరీటం
- చిరంజీవి చేతుల మీదుగా రూ.50లక్షల ప్రైజ్‌మనీ
- అద్దె ఇంట్లో ఉంటున్నాం.. ఇల్లు కొని పేరెంట్స్‌కు గిఫ్ట్‌గా ఇస్తా: రాహుల్

బంజారాహిల్స్/కార్వాన్/హైదరాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పాతబస్తీ ధూల్‌పేటకు చెందిన కుర్రాడు ప్రతిష్ఠాత్మక రియాలిటీ షో బిగ్‌బాస్ విజేతగా నిలిచాడు. ఏమాత్రం అంచనాల్లేకుండా పోటీలోకి దిగి.. ఎన్నోసార్లు ఎలిమినేషన్‌లో నిలిచి.. ఒకసారి ఫేక్ ఎలిమినేషన్‌కు గురైన సినీ గాయకుడు, 'రంగస్థలం ఫేం' రాహుల్ సిప్లిగంజ్ అనూహ్యంగా బిగ్‌బాస్ సీజన్ త్రీ విన్నర్‌గా నిలిచారు. ఫైనలిస్టులుగా ఉన్న ఐదుగురు.. యాంకర్ శ్రీముఖి, సినీ నటుడు వరుణ్ సందేశ్, డ్యాన్స్ మాస్టర్ బాబా బాస్కర్, టీవీ నటుడు అలీ రజాలను వెనక్కి నెట్టి ప్రైజ్‌మనీ కొట్టేశాడు. 105 రోజుల పాటు సాగిన ఈ రియాలిటీ షోలో ఆదివారం విజేతను ప్రకటించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ నటుడు చిరంజీవి చేతుల మీదుగా రాహుల్ రూ.50లక్షల ప్రైజ్‌మనీని అందుకున్నారు. శ్రీముఖి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ డబ్బుతో ఏం చేస్తావు? అని రాహుల్‌ను కార్యక్రమ ప్రయోక్త అక్కినేని నాగార్జున ప్రశ్నించగా.. 'నేను ఇప్పటిదాకా నా తల్లిదండ్రుల కోసం ఏమీ చేయలేదు. మేం అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఈ డబ్బుతో ఓ ఇల్లు కొని పేరెంట్స్‌కు బహుమతిగా ఇస్తాను' అని చెప్పాడు. ధూల్‌పేటకు చెందిన రాహుల్ వృత్తిరీత్యా బార్బర్. ఆయనకు సోదరి, సోదరుడు ఉన్నాడు. రంగస్థలం సినిమాలో ఓ పాట పాడి ప్రేక్షక హృదయాలను గెలుచుకున్నారు. నగరంలో జరిగే హనుమాన్ జయంతి, వినాయక చవితి వేడుకలపై రాహుల్ చేసిన వీడియో సాంగ్స్ యువతను బాగా ఆకట్టుకున్నాయి.

ప్రైవేటు రూట్లో టీ ఆర్టీసీ

- కేసీఆర్ ప్రకటనతో కసరత్తు మొదలు
- నలుగురు కార్మికులు విధుల్లోకి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

టీఎస్ఆర్టీసీలో 5,100 ప్రైవేటు బస్సులకు రాష్ట్ర మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది! ఇదే విషయాన్ని సీఎం కేసీఆర్ ప్రకటించారు. వెన్వెంటనే అధికార యంత్రాంగం కొత్త విధానానికి రూపకల్పన చేస్తోంది. నష్టాలను పంచుకుంటేనే లాభాలు వచ్చే రూట్లల్లో బస్సులు తిరగడానికి ప్రైవేట్ వారికి అవకాశం ఇచ్చేలా దీనిని రూపొందిస్తున్నట్టు తెలుస్తోంది. లాభసాటి రూట్లలో బస్సులను నడపడం ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని నష్టం వచ్చే రూట్లలో తిరిగే బస్సులపై ఖర్చు చేసేలా కొత్త పాలసీని తీసుకు రానున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆయా రూట్లలో ప్రైవేట్ బస్సులకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ నోటిఫై చేయడానికి ముందే ప్యాకేజీలుగా రూట్లను విభజించాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపాయి. అధిక లాభం వచ్చే ఒక రూట్‌ను, నష్టం వచ్చే మరో రూట్‌ను కలిపి ఒక ప్యాకేజీగా నిర్ణయించే అవకాశం ఉందని వెల్లడించాయి. మొత్తం మూడు కేటగిరీలవారీగా రూట్లను విభజిస్తున్నారు. లాభం వచ్చే రూట్లు, నష్టం వచ్చే రూట్లు, లాభనష్టాలు సమానంగా ఉండే రూట్లుగా గుర్తిస్తున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా నలుగురు ఆర్టీసీ కార్మికులు విధుల్లో చేరారు. ఈ మేరకు వారు డిపోలలో ఆదివారం అంగీకారపత్రాలు అందజేశారు. ఉప్పల్ డిపోలో అకౌంట్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న కేశవ కృష్ణ, సిద్దిపేట డిపోకు చెందిన బాలవిశ్వేశ్వర రావు, కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆర్టీసీ డ్రైవర్ సయ్యద్ అహ్మద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సత్తుపల్లి డిపోకు చెందిన మూబిన్ అనే డ్రైవర్ విధుల్లో చేరారు.

‘పారిస్ మాస్టర్’.. నొవాక్

పారిస్: సెర్బియా టెన్నిస్ యోధుడు నొవాక్ జొకోవిచ్ పారిస్ మాస్టర్స్ టోర్నమెంట్‌లో రికార్డుస్థాయిలో ఐదోసారి చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన సింగిల్స్ ఫైనల్లో టాప్‌సీడ్ నొవాక్ 6-3, 6-4తో కెనడా యువ కెరటం డెనిస్ షపోవలోవ్‌ను ఓడించి ట్రోఫీ అందుకున్నాడు. జొకోవిచ్‌కు ఇది 34వ మాస్టర్స్ టైటిల్.

బంగ్లా ఆటగాడు ముష్ఫికర్ రహీమ్ (60 నాటౌట్) విజయానందం

సొంత గడ్డపై ప్రత్యర్థి భారత్ భీకర ఫామ్‌లో ఉంది. దీనికి తోడు వారిపై ఇప్పటి దాకా ఆడిన ఎనిమిది టీ20ల్లో ఒక్క విజయం కూడా లేదు. అటు చూస్తే సూపర్ స్టార్ ఆల్‌రౌండర్ షకీబల్‌తో పాటు ఓపెనర్ తమీమ్ ఇక్బాల్ లేకుండానే బరిలోకి దిగాల్సిన పరిస్థితి. కానీ బంగ్లా టైగర్స్ పోరాడారు. ముందుగా పటిష్ఠమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన భారత్‌ను ఓ మాదిరి స్కోరుకే కట్టడి చేయగా ఆ తర్వాత సీనియర్ బ్యాట్స్‌మన్ ముష్ఫికర్ రహీమ్ తుదికంటా క్రీజులో నిలిచి ఆడిన అద్వితీయ ఇన్నింగ్స్‌తో బంగ్లాదేశ్ మ్యాచ్‌ను చిరస్మరణీయంగా ముగించింది. అటు భారత్ పేలవ ఫీల్డింగ్ కూడా ప్రత్యర్థికి కలిసివచ్చింది.

థ్రిల్లర్ ఇచ్చారు

తొలి టీ20లో భారత్‌పై బంగ్లా గెలుపు

ముష్ఫికర్ రహీమ్ అర్ధసెంచరీ

రోహిత్ శర్మ (9)

న్యూఢిల్లీ: అంతర్జాతీయ టీ20ల్లో భారత్‌పై ఎట్టకేలకు బంగ్లాదేశ్ జట్టు బోణీ చేసింది. స్టార్ ఆటగాళ్లు లేకపోవడంతో ఎలాంటి అంచనాలు లేకుండానే బరిలోకి దిగిన ఈ జట్టు రోహిత్ సేనకు గట్టి షాకే ఇచ్చింది. ఆదివారం జరిగిన తొలి టీ20లో ముష్ఫికర్ రహీమ్ (43 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 60 నాటౌట్) బాధ్యతాయుత ఇన్నింగ్స్ కారణంగా బంగ్లాదేశ్ 7 వికెట్ల తేడాతో నెగ్గింది. దీంతో మూడు టీ20ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో ఉంది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 148 పరుగులు చేసింది. ధవన్ (42 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 41), పంత్ (26 బంతుల్లో 3 ఫోర్లతో 27) ఫర్వాలేదనిపించగా వాషింగ్టన్ సుందర్ (5 బంతుల్లో 2 సిక్సర్లతో 14 నాటౌట్), క్రునాల్ (8 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్ 15 నాటౌట్) చివర్లో వేగం చూపారు. షఫీయుల్, అమీనుల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో బంగ్లాదేశ్ 19.3 ఓవర్లలో 3 వికెట్లకు 154 పరుగులు చేసి నెగ్గింది. సౌమ్య సర్కార్ (35 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 39) రాణించాడు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ముష్ఫికర్ రహీమ్ నిలిచాడు.

ముష్ఫికర్ హవా: ఓమాదిరి లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బంగ్లా కూడా తొలి ఓవర్లోనే ఓపెనర్ లిటన్ దాస్ (7) వికెట్‌ను కోల్పోయింది. అరంగేట్ర ఓపెనర్ మహ్మద్ నయీమ్ (26) ఆత్మవిశ్వాసంతో ఆడిన ఆటకు తోడు, ముష్ఫికర్ రహీమ్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టు గట్టెక్కింది. తొలి వికెట్ పడిన తర్వాత నయీమ్, సౌమ్య సర్కార్ కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ఐదో ఓవర్‌లో నయీమ్ 6,4తో చెలరేగాడు. ఆ తర్వాత సౌమ్య సర్కార్ కూడా బ్యాట్ ఝుళిపించడంతో పవర్‌ప్లేలో జట్టు 45 పరుగులు సాధించగలిగింది. ఎనిమిదో ఓవర్‌లో చాహల్ కీలక వికెట్ సాధించాడు. జోరు మీదున్న నయీమ్ భారీ షాట్‌కు వెళ్లి లాంగాన్‌లో ధవన్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో రెండో వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. పదో ఓవర్‌లో ముష్ఫికర్ రహీమ్ ఎల్బీ కోసం భారత్ గట్టిగా అప్పీల్ చేసినా రివ్యూ కోరలేదు. కానీ, రీప్లేలో బంతి అతడి ప్యాడ్‌కు తాకినట్టు తేలింది. ఆ తర్వాత సౌమ్య, ముష్ఫికర్ జోడీ భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. బౌండరీల సహాయంతో రన్‌రేట్‌ను తగ్గించుకుంటూ భారత శిబిరంలో ఆందోళన నింపారు. వీరి జోరుతో 16 ఓవర్లలోనే బంగ్లా వంద పరుగులు దాటింది. కానీ 17వ ఓవర్‌లో సౌమ్య సర్కార్‌ను ఖలీల్ అహ్మద్ క్లీన్ బౌల్డ్ చేయడంతో భారత్ పోటీలోకొచ్చింది. మరుసటి ఓవర్‌లోనే ముష్ఫికర్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను డీప్ మిడ్‌వికెట్‌లో క్రునాల్ వదిలేశాడు. ఆ ఓవర్‌లో అతడు 2 ఫోర్లు బాదాడు.

నాలుగు బంతుల్లో నాలుగు ఫోర్లు..: ఇక విజయానికి 12 బంతుల్లో 22 పరుగులు అవసరమైన దశలో ముష్ఫికర్ రహీమ్ ఒక్కసారిగా గేరు మార్చాడు. ఖలీల్ వేసిన 19వ ఓవర్‌లో అతడు శివాలెత్తి వరుసగా నాలుగు ఫోర్లు బాదడంతో మొత్తం 18 పరుగులు వచ్చాయి. దీంతో భారత్ ఓటమి ఖాయమై పోగా కావాల్సిన నాలుగు పరుగులను ఆఖరి ఓవర్‌లో మహ్మదుల్లా సిక్సర్‌తో సాధించాడు.

జోరంతా చివర్లోనే..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు వికెట్ నుంచి పెద్దగా సవాల్ ఎదురుకాకపోయినా పరుగులు తీసేందుకు ఇబ్బందిపడింది. దీనికి తోడు బంగ్లా జట్టు తొలి ఓవర్‌లోనే భారీ షాక్ ఇచ్చింది. ఓపెనర్ ధవన్ 15 ఓవర్లపాటు క్రీజులో ఉన్నా మెరుపులు లేకపోయాయి. అయితే ఆఖరి రెండు ఓవర్లలో క్రునాల్, వాషింగ్టన్ సుందర్ జోరుతో 30 పరుగులు రాగా జట్టు గౌరవప్రదమైన స్కోరును సాధించింది. అంతకుముందు ఇన్నింగ్స్ మొదటి బంతినే బౌండరీగా మలిచిన కెప్టెన్ రోహిత్ (9)ను అదే ఓవర్ చివరి బంతికి షఫీయుల్ ఓ కట్టర్ ద్వారా ఎల్బీ చేశాడు. దీనిపై రోహిత్ రివ్యూకు వెళ్లినా లాభం లేకపోయింది. ఆతర్వాత రాహుల్ (15) రెండు ఫోర్లు, ధవన్ ఓ ఫోర్‌తో భారత్ పవర్‌ప్లేలో 35 పరుగులు చేయగలిగింది. కానీ ఏడో ఓవర్‌లోనే రాహుల్ షార్ట్ కవర్‌లో మహ్మదుల్లాకు తేలికైన క్యాచ్ ఇచ్చాడు. ఈ దశలో లోకల్ బాయ్ శ్రేయాస్ అయ్యర్ (22) ఉన్న కాసేపు అదరగొట్టాడు. తానెదుర్కొన్న రెండో బంతినే లాంగాఫ్‌లో భారీ సిక్సర్‌గా మలిచిన అతడు తొమ్మిదో ఓవర్‌లోనూ మరో సిక్స్ సాధించాడు. కానీ ఇదే దూకుడుతో అమీనుల్ ఇస్లాం ఓవర్‌లో బౌండరీ లైన్ దగ్గర క్యాచ్ అవుటయ్యాడు. మరోవైపు ధవన్ ఆరంభం నుంచే ఆచితూచి ఆడడంతో పరుగుల వేగం ఆశించిన రీతిలో సాగలేదు. దీంతో 14 ఓవర్లలో స్కోరు 85/3గానే ఉంది. ఎట్టకేలకు 15వ ఓవర్‌లో ధవన్ సిక్సర్ బాదినా అదే ఓవర్‌లో రెండో రన్ కోసం పిలిచిన రిషభ్ పంత్ ఆ తర్వాత వెనక్కి వెళ్లడంతో రనౌట్ కావాల్సి వచ్చింది. అలాగే ఎన్నో అంచనాలతో అరంగేట్రం చేసిన శివమ్ దూబే (1) తీవ్రంగా నిరాశపరిచాడు. ఇక వేగంగా ఆడే క్రమంలో పంత్ (27) కూడా పెవిలియన్‌కు చేరాడు. ఈ దశలో భారత్ 18.2 ఓవర్లలో 120/6 స్కోరుతో దయనీయంగా కనిపించింది. కానీ 19వ ఓవర్‌లో క్రునాల్ ఓ ఫోర్, వాషింగ్టన్ సుందర్ సిక్స్ బాదడంతో 14 పరుగులు వచ్చాయి. ఆఖరి ఓవర్‌లో ఇద్దరూ చెరో సిక్సర్ బాది 16 పరుగులు రాబట్టి జట్టును కాస్త మెరుగైన స్థితిలో నిలబెట్టారు. ఈజోడీ ఏడో వికెట్‌కు 10 బంతుల్లో 28 పరుగులు జోడించింది.

స్కోర్‌బోర్డు

భారత్: రోహిత్ (ఎల్బీ) షఫీయుల్ 9; ధవన్ (రనౌట్) 41; రాహుల్ (సి) మహ్మదుల్లా (బి) అమీనుల్ ఇస్లాం 15; శ్రేయాస్ అయ్యర్ (సి) నయీమ్ (బి) అమీనుల్ ఇస్లాం 22; రిషభ్ పంత్ (సి) నయీమ్ (బి) షఫీయుల్ 27; శివమ్ దూబే (సి అండ్ బి) అఫీఫ్ హొస్సేన్ 1; క్రునాల్ (నాటౌట్) 15; వాషింగ్టన్ సుందర్ (నాటౌట్) 14; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 148/6. వికెట్ల పతనం:** 1-10, 2-36, 3-70, 4-95, 5-102, 6-120. **బౌలింగ్:** షఫీయుల్ ఇస్లాం 4-0-36-2; అల్ అమీన్ హొస్సేన్ 4-0-27-0; ముస్తాఫిజుర్ 2-0-15-0; అమీనుల్ ఇస్లాం 3-0-22-2; సౌమ్య సర్కార్ 2-0-16-0; అఫీఫ్ హొస్సేన్ 3-0-11-1; మొసద్దెక్ హొస్సేన్ 1-0-8-0; మహ్మదుల్లా 1-0-10-0.

బంగ్లాదేశ్: లిటన్ దాస్ (సి) రాహుల్ (బి) దీపక్ చాహర్ 7; మహ్మద్ నయీమ్ (సి) ధవన్ (బి) చాహల్ 26; సౌమ్య సర్కార్ (బి) ఖలీల్ అహ్మద్ 39; ముష్ఫికర్ రహీమ్ (నాటౌట్) 60; మహ్మదుల్లా (నాటౌట్) 15; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 19.3 ఓవర్లలో 154/3. వికెట్ల పతనం:** 1-8, 2-54, 3-114. **బౌలింగ్:** దీపక్ చాహర్ 3-0-24-1; వాషింగ్టన్ సుందర్ 4-0-25-0; ఖలీల్ 4-0-37-1; చాహల్ 4-0-24-1; క్రునాల్ 4-0-32-0; దూబే 0.3-0-9-0.

1 అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా కోహ్లీ (2,450)ని రోహిత్ (2,452) అధిగమించాడు.

1 భారత్ తరపున అత్యధిక (99) అంతర్జాతీయ టీ20లు ఆడిన బ్యాట్స్‌మన్ రోహిత్.

1000 అంతర్జాతీయ క్రికెట్‌లో ఇది వెయ్యో టీ20 మ్యాచ్

చాంపియన్.. లక్ష్యసేన్

భారత స్టార్ ఖాతాలో వరుసగా రెండో వరల్డ్ టూర్ టైటిల్

సార్‌బ్రూకెన్ (జర్మనీ): భారత బ్యాడ్మింటన్ యువ కెరటం లక్ష్యసేన్ అంతర్జాతీయ వేదికపై మరోసారి మెరిశాడు. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన 18 ఏళ్ల ఈ కుర్రాడు జర్మనీలో జరిగిన సార్‌లోర్‌లక్స్ ఓపెన్‌లో చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఎనిమిదో సీడ్ లక్ష్యసేన్ 17-21, 21-18, 21-16తో చైనాకు చెందిన వెంగ్ హంగ్ యాంగ్‌పై విజయం సాధించాడు. ఇటీవల అద్భుతంగా రాణిస్తోన్న లక్ష్యసేన్‌కు ఇది వరుసగా రెండో వరల్డ్ టూర్ సూపర్ 100 టైటిల్ కావడం విశేషం. అంతేకాదు..ఈ సీజన్‌లో అతనికిది వరుసగా మూడో టైటిల్. ఈ టోర్నీకి ముందు అతను బెల్జియం ఇంటర్నేషనల్ చాలెంజ్, డచ్ ఓపెన్ సూపర్ టూర్ 100 టైటిళ్లు గెలిచాడు.

మార్షల్ ఆర్ట్స్ నిపుణుడు సిద్దిఖ్‌కు జపాన్ ‘కమెండేషన్’

ప్రదానం చేసిన కాన్సుల్ జనరల్

సిద్దిఖ్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న జపాన్ కాన్సుల్ జనరల్ కొజిరో ఉచియామా

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి): ప్రముఖ మార్షల్ ఆర్ట్స్ నిపుణుడు డా.సయ్యద్ మహ్మద్ సిద్దిఖ్ మహమూదికి జపాన్ ప్రభుత్వ ప్రశంసాపత్రం (కమెండేషన్) లభించింది. హైదరాబాద్‌లో గోల్డెన్ డ్రాగన్ స్కూల్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్‌ను స్థాపించిన సిద్దిఖ్ గత 33 ఏళ్లుగా ఎంతో మందిని యుద్ధ విద్యలలో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారు. ఈక్రమంలో ఆయన భారత్-జపాన్ మధ్య పరస్పర సహకారానికి, స్నేహపూర్వక సంబంధాలకు తోడ్పడుతున్నారు. దీంతో ఆయనకు ఈ కమెండేషన్ ప్రకటించారు.. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో జపాన్ కాన్సుల్ జనరల్ కొజిరో ఉచియామా ఈ అవార్డును సిద్దిఖ్‌కు అందజేశారు. మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తూనే విద్యార్థులు, శిక్షణార్థులను సిద్దిఖ్ తీర్చిదిద్దుతున్న తీరు అమోఘమని కొజిరో కొనియాడారు.

బాగా ఆడుతుంటే.. యో-యోతో పనేంటి?

న్యూఢిల్లీ: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, కోచ్ రవిశాస్త్రిపై మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ మరోసారి పరోక్షంగా విమర్శనాస్త్రాలు సంధించాడు. క్రికెటర్‌గా బాగా రాణిస్తుంటే యో-యో టెస్ట్‌తో పనేమిటని ప్రశ్నించాడు. టీమిండియాకు ఎంపికలో యో-యో టెస్ట్‌ను ప్రామాణికం చేయడం కెప్టెన్ కోహ్లీ, కోచ్ రవిశాస్త్రి హయాంలో ప్రారంభమైన సంగతి తెలిసిందే. కేన్సర్ బారినుంచి బయటపడ్డాక క్రికెట్‌లో పునరాగమనం చేసిన యువరాజ్‌ను యో-యో టెస్ట్ పాస్‌కాలేదంటూ పలుమార్లు జట్టుకు దూరం పెట్టారు. 2017లో వెస్టిండీస్ టూర్ నుంచి వచ్చాక ఇదే కారణంతో యువీని జట్టుకు ఎంపిక చేయలేదు. ఈ నేపథ్యంలో సమయమొచ్చినప్పుడల్లా యో-యో టెస్ట్‌పై అతడు అంసతృప్తి ప్రకటిస్తూనే ఉన్నాడు. తనను జట్టునుంచి తొలగించిన సమయంలో బీసీసీఐ చీఫ్‌గా గంగూలీ ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదని యువీ వ్యాఖ్యానించాడు.

మెరిసిన నీషమ్, గప్టిల్

రెండో టీ20లో కివీస్ గెలుపు

వెల్లింగ్టన్: సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ బోణీ చేసింది. జేమ్స్ నీషమ్ (42), మార్టిన్ గప్టిల్ (41) మెరపడంతో.. రెండో టీ20లో కివీస్ 21 పరుగులతో ఇంగ్లండ్‌పై గెలిచి 1-1తో సిరీస్‌ను సమం చేసింది. తొలుత కివీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 176 పరుగులు సాధించింది. నీషమ్, గప్టిల్‌తో పాటు గ్రాండ్‌హోమ్ 28, రాస్ టేలర్ 28 రన్స్‌తో రాణించారు. క్రిస్ జోర్డాన్ 3, సామ్ కర్రాన్ 2 వికెట్లు తీశారు. ఛేదనలో ఇంగ్లండ్ 19.5 ఓవర్లలో 155 పరుగులకే ఆలౌటై ఓటమి పాలైంది. డేవిడ్ మలాన్ (39), క్రిస్ జోర్డాన్ (36), కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ (32) పోరాడినా పరాజయం తప్పలేదు. ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’ మిచెల్ శాంట్నర్ (3/25), టిమ్ సౌథీ (2/25), హెర్బర్ట్ సన్ (2/34) ప్రత్యర్థి పతనాన్ని శాసించారు.

భళా.. బార్టీ

ఆసీస్ స్టార్‌కు డబ్ల్యూటీఏ ఫైనల్స్ టైటిల్

షెన్‌జెన్ (చైనా): ప్రపంచ మహిళల టెన్నిస్ నెంబర్‌వన్ ఆష్లే బార్టీ సీజన్ ముగింపు టోర్నీ అయిన ప్రతిష్ఠాత్మక డబ్ల్యూటీఏ ఫైనల్స్ చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన సింగిల్స్ ఫైనల్లో ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ బార్టీ (ఆస్ట్రేలియా) 6-4, 6-3తో డిఫెండింగ్ చాంపియన్ ఎలీనా స్విటోలినా (ఉక్రెయిన్)ను వరుససెట్లలో చిత్తుచేసి ట్రోఫీ అందుకుంది. నెంబర్‌వన్ హోదాలో ఉండి ఈ టైటిల్ నెగ్గిన తొలి క్రీడాకారిణిగా బార్టీ రికార్డు సృష్టించింది. డబుల్స్ టైటిల్‌ను డిఫెండింగ్ చాంపియన్ క్రిస్టీనా (ఫ్రాన్స్)-తిమియా (హంగేరి) జోడీ నిలబెట్టుకొంది. ఫైనల్లో క్రిస్టీనా ద్వయం 6-1, 6-3తో బార్బరా స్ట్రికోవా (చెక్ రిపబ్లిక్)-నీ నూ వీ (తైవాన్) జోడీని ఓడించి ట్రోఫీ అందుకుంది.

గోల్ కీపర్లే హైలైట్

గోల్ లేకుండా ముగిసిన జంషెడ్‌పూర్, బెంగళూరు మ్యాచ్

జంషెడ్‌పూర్: మ్యాచ్ ఆసాంతం హోరాహోరీగా సాగినా గోల్స్ మాత్రం నమోదు కాలేదు. ఆదివారం జంషెడ్‌పూర్, బెంగళూరు జట్ల మధ్య జరిగిన ఐఎస్ఎల్ మ్యాచ్ గోల్స్ లేకుండా 0-0తో డ్రాగా ముగిసింది. డిఫెండింగ్ చాంప్ బెంగళూరుకు ఇది వరుసగా మూడో డ్రా. ఇరుజట్ల గోల్ కీపర్లు సుబ్రతాపాల్ (జంషెడ్‌పూర్), గుర్‌ప్రీత్ సింగ్ సంధూ (బెంగళూరు) అద్భుతమైన సేవ్‌లు మ్యాచ్‌కు హైలైట్‌గా నిలిచాయి. బంతిని దాటించడానికి ఫార్వర్డ్‌లు ఎంత ప్రయత్నించినా కీపర్లు గోడలా అడ్డుగా నిలిచారు. ఫస్టాఫ్‌లో సుబ్రతా పాల్ ఎంటర్‌టైన్ చేస్తే.. సెకండాఫ్‌లో సంధూ అందరి దృష్టినీ ఆకర్షించాడు.

ఆసీస్-పాక్ తొలి టీ20 వర్షార్పణం

సిడ్నీ: మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా పాకిస్థాన్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. మొదట పాక్ 15 ఓవర్లలో 107/5 స్కోరు చేసింది. ఈ దశలో వర్షం రావడంతో మ్యాచ్‌ను 15 ఓవర్లకు కుదించారు. బాబర్ ఆజమ్ (59 నాటౌట్), మహ్మద్ రిజ్వాన్ (31) రాణించారు. స్టార్క్, రిచర్డ్‌సన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఆసీస్ విజయ లక్ష్యాన్ని 15 ఓవర్లలో 119గా నిర్దేశించారు. ఛేదనలో ఓపెనర్లు ఫించ్ (37 నాటౌట్), వార్నర్ (2 నాటౌట్) జోరుతో ఆసీస్ 3.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 41 పరుగులతో గెలుపుదిశగా దూసుకెళ్లింది. కానీ, ఈ సమయంలో మొదలైన వర్షం ఎంతకీ ఆగకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు.

సిరెంజ్‌లు కలిగి ఉన్న అథ్లెట్లపై బహిష్కరణ వేటు

జాతీయ జూనియర్ అథ్లెటిక్స్

గుంటూరు: ‘నో నీడిల్ పాలసీ’ని అమలు చేస్తున్న భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) ఇద్దరు అథ్లెట్లను పోటీల నుంచి బహిష్కరించింది. నాగార్జున యూనివర్సిటీలో జరుగుతున్న జాతీయ జూనియర్ చాంపియన్‌షిప్స్‌లో సిరెంజ్‌లు, చిన్నచిన్న బాటిల్స్ కలిగి ఉన్నందుకు చండీగఢ్‌కు చెందిన ప్రకాష్ సింగ్, రాజస్థాన్‌కు చెందిన ధనంజను పోటీల నుంచి బహిష్కరించినట్టు ఏఎఫ్ఐ ఓ ప్రకటనలో తెలిపింది. కాగా, తొలి రోజు పోటీల్లో అండర్-20 పురుషుల 10000 మీ. పరుగులో గుర్‌ప్రీత్ (హరియాణా), మహిళల 5000 మీ.లో సీమ (హిమాచల్‌ప్రదేశ్) విజేతలుగా నిలిచారు. లాంగ్‌జంప్‌లో సంద్రబాబు (కేరళ) 6.16 మీ. దూకి వ్యక్తిగత రికార్డుతో స్వర్ణం సాధించాడు. బాలుర అండర్-16 డిస్కస్ త్రోలో అరవింద్ శర్మ 50.16 మీ. విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ టోర్నీ కోసం అథ్లెట్లకు సంబంధించిన బయోమెట్రిక్ కార్డులను ఏఎఫ్ఐ అందజేసింది. దీనివల్ల అథ్లెట్ల వయసు తనిఖీలు చేయించుకోవాల్సిన అవసరం లేదు.

ప్రసంగిస్తున్న గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్

హాకీ అభివృద్ధికి కృషి చేస్తా..!

గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్

ఏఎన్‌యూ (గుంటూరు): భవిష్యత్తులో హాకీ ప్రాభవం తగ్గకుండా చూడాల్సిన బాధ్యత క్రీడాకారులు, ప్రభుత్వాలపై ఉన్నదని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. వర్సిటీ డైక్‌మెన్ ఆడిటోరియంలో రాష్ట్ర హాకీ వార్షికోత్సవం, అవార్డుల ప్రదాన కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ.. హాకీ అభివృద్ధికి, పునర్‌వైభవానికి కృషి చేస్తానన్నారు. అకాడమీల ఏర్పాటు, ఆస్ట్రోటర్ఫ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఆధునిక సదుపాయాల కల్పన అవసరమని, ప్రభుత్వంతో చర్చించి వాటి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ హాకీ సంఘం చీఫ్ ముకేష్‌కుమార్ మీనా, కలెక్టర్ శామ్యూల్ ఆనంద్‌కుమార్, వీసీ ఆచార్య కె. రామ్‌జీ, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ షరీనాబేగం, తాత్కాలిక రిజిస్ట్రార్ రోశయ్య, ఒలింపియన్ సత్తిగీత, ఏపీ హాకీ డైరెక్టర్ నిరంజన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ కోటేశ్వరమ్మ, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

30 ఏళ్లుగా చీర కట్టులో!

ఇంట్లో వరుస చావులు ఆగాలని చౌహాన్ స్త్రీ వేషం

లఖ్‌నవు, నవంబరు 3: ఈ ఫొటోలోని వ్యక్తి పేరు చింతాహరణ్ చౌహాన్ (66). పురుషుడు. ఊరు.. యూపీలోని హౌజ్‌ఖాస్ గ్రామం. 30ఏళ్లుగా మహిళల వస్త్రధారణలోనే ఉంటున్నాడు. పొడువాటి జడ, ఓ పెద్ద ముక్కెర.. జుంకాలు, గాజులు ధరించి నవ వధువులా కనిపిస్తాడు. ఓ మూఢ నమ్మకం అతడినీ వస్త్రధారణకు కట్టుబడేలా చేసింది. చౌహాన్‌కు 14ఏళ్లకు పెళ్లయింది. కొన్నాళ్లకే భార్య చనిపోయింది. ఆ తర్వాత మళ్లీ రెండు పెళ్లిళ్లు చేసుకున్నాడు. ఆ ఇద్దరూ చనిపోయారు. అంతేనా.. ఆయన తండ్రి, అన్న, తమ్ముడు.. మొత్తంగా స్వల్పకాలంలోనే 14మంది కుటుంబసభ్యులు మరణించారు. 1989లో తన రెండో భార్య కలలోకి వచ్చి.. చీర కట్టులో వధువు మాదిరిగా కనిపిస్తే, ఎప్పుడూ తనవెంటే ఉంటానని మాటిచ్చిందని.. అది మొదలు, చీర కట్టుకే కట్టుబడ్డానని చౌహాన్ చెప్పాడు. అప్పటి నుంచి తన కుటుంబసభ్యుల మరణాలు ఆగిపోయాయని.. తన ఆరోగ్యం కూడా మెరుగుపడిందని పేర్కొన్నాడు.

77 ఏళ్ల వయస్సులో ఐఐటీ నుంచి పీహెచ్‌డీ

ఢిల్లీ రిటైర్డ్ ఇంజనీర్ సుశీల్ కుమార్ ఘనత

న్యూఢిల్లీ, నవంబరు 3: కేంద్ర ప్రజా పనుల విభాగంలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసిన సుశీల్ కుమార్ ధావన్ తన 77 ఏళ్ల వయసులో ఐఐటీ ఢిల్లీ నుంచి శనివారం పీహెచ్‌డీ పట్టా పొందారు. అత్యధిక వయసులో ఈ ఘనత సాధించిన అతికొద్ది మంది వ్యక్తుల్లో ఒకరిగా నిలిచారు. ఐఐటీ ఢిల్లీ 50వ వార్షికోత్సవంలో ఆయనకు పీహెచ్‌డీని అందజేశారు. 1947లో సుశీల్ ఐదేళ్ల వయసు ఉన్నప్పుడే పంజాబ్ నుంచి ఢిల్లీకి వలస వచ్చారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల 18 ఏళ్లకే ఉద్యోగం చేయవలసి వచ్చింది. ఉద్యోగం చేస్తూనే తన చదువును కొనసాగించారు. చివరికి 77 ఏళ్ల వయసులో పీహెచ్‌డీ పట్టా పొంది తన కల నెరవేర్చుకొన్నారు. ప్రస్తుతం ఆయన ఇదే విద్యాసంస్థలో సివిల్ ఇంజనీరింగ్‌లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

నెట్‌లో పాక్ పాప్ సింగర్ నగ్న చిత్రాలు

ఐఎస్‌పీఆర్ డీజీతో వాగ్వాదమే కారణం!

ఇస్లామాబాద్, నవంబరు 3: పాకిస్థాన్ పాప్ సింగర్ రబీ పిర్జాదా నగ్న చిత్రాలు, వీడియోలు నెట్‌లో వైరల్‌గా మారాయి. పాకిస్థాన్ సైన్యానికి చెందిన ఇంటర్ సర్వీస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) డీజీ ఆసిఫ్ గఫూర్‌తో ఆమె వాగ్వాదానికి దిగడమే ఇందుకు కారణమనే విమర్శలను పాక్ నెటిజన్లు గుప్పిస్తున్నారు. కాగా.. ఆర్టికల్ 370 నిర్వీర్యం తర్వాత భారత ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేస్తూ ఆమె ట్విటర్‌లో వీడియోలు విడుదల చేశారు. అందులో కొండచిలువలు, మొసళ్లతో ఉన్న పిర్జాదా.. "మోదీ గారు.. మా మిత్రులను మీ వద్దకు పంపుతున్నాను. అవి మిమ్మల్ని నంజుకుంటాయి" అని వ్యాఖ్యానించారు. మరో సందర్భంలో 'కశ్మీర్‌కీబేటీ(కశ్మీర్ కూతురు)' అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఫిదాయీ (ఆత్మాహుతి దళం)గా తననుతాను పేర్కొంటూ నడుం చుట్టూ బాంబులు అమర్చుకున్న ఫొటోను ట్విటర్‌లో విడుదల చేశారు.

'మహా' రగడ!

(మొదటి పేజీ తరువాయి)

రేస్‌కోర్సును బుక్ చేసుకున్నారని తెలిసింది. అయినా ఇంతవరకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తానని బీజేపీ ఎందుకు ముందుకురాలేదు" అని ప్రశ్నించారు. శివసేనకు చెందిన వ్యక్తే ముఖ్యమంత్రి అవుతారని, శివాజీ పార్కులో ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిష్టంభన ఇలాగే కొనసాగితే రాష్ట్రపతి పాలన విధించక తప్పదన్న బీజేపీ నేతల హెచ్చరికపైనా ఆయన స్పందించారు. దమ్ముంటే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించి చూడాలని పార్టీ పత్రిక 'సామ్నా'లో రాసిన వ్యాసంలో సవాల్ విసిరారు. 'అహంకారం అనే బురదలో రథం కూరుకుపోయింది' అని బీజేపీని పరోక్షంగా విమర్శించారు. తమ డిమాండ్‌కు బీజేపీ ఒప్పుకోకపోతే ఎన్సీపీ, కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అసెంబ్లీలో బీజేపీ తన బలం నిరూపించుకోలేకపోతే... ప్రభుత్వ ఏర్పాటుకు రెండో అతి పెద్ద పార్టీగా శివసేన ముందుకొస్తుందని పేర్కొన్నారు. ఎవరు ప్రభుత్వం ఏర్పాటు చేస్తారో త్వరలోనే ప్రజలకు తెలుస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే వ్యాఖ్యానించారు. ఔరంగాబాద్ పర్యటనలో ఉన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. మరోవైపు సంజయ్ రౌత్ నుంచి 'జై మహారాష్ట్ర' అంటూ పలకరింపుగా తనకు వచ్చిన ఒక ఎస్ఎంఎస్‌ను ఎన్సీపీ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విలేకరులకు చూపించారు. రౌత్‌తో తాను మాట్లాడాలన్నది ఆ ఎస్ఎంఎస్ ఉద్దేశమని, ఆయనతో మాట్లాడతానని అజిత్ తెలిపారు. కాగా, ప్రతిష్టంభన తొలగిపోయి త్వరలో ప్రభుత్వం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఆశాభావం వ్యక్తం చేశారు. రెండున్నరేళ్లు సీఎం పదవిని పంచుకునేది లేదని, దేవేంద్రే అయిదేళ్లు సీఎంగా కొనసాగుతారని ఇప్పటికే బీజేపీ స్పష్టం చేసింది. అక్టోబరు 21న జరిగిన ఎన్నికల్లో బీజేపీ, శివసేన కలిసి పోటీ చేశాయి. 24న ఫలితాలు వెలువడ్డాయి. బీజేపీ 105, శివసేన 56 స్థానాలు గెలుచుకున్నాయి. ఎన్సీపీకి 54, కాంగ్రెస్‌కు 44 స్థానాలు దక్కాయి. 288 మంది సభ్యులు ఉన్న అసెంబ్లీలో బీజేపీ, శివసేనకు కలిపి మెజారిటీ వచ్చినా సీఎం పదవిపై పీటముడి పడింది.

జడ్జీల ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారు

వారిపై వేధింపులు బాధిస్తున్నాయి.. కాబోయే సీజేఐ బోబ్డే ఆవేదన

సోషల్ మీడియా తీరుపై ఆక్షేపణ

ప్రస్తుతానికి ఏమీ చేయలేమని వ్యాఖ్య

న్యూఢిల్లీ, నవంబరు 3: కొన్ని తీర్పులకు సంబంధించి సోషల్ మీడియాలో న్యాయమూర్తులపై చేస్తున్న విమర్శలు బాధిస్తున్నాయని సుప్రీం కోర్టు తదుపరి ప్రధానన్యాయమూర్తి జస్టిస్ శరద్ ఆనంద్ బోబ్డే అన్నారు. తమను వేధిస్తున్నారని న్యాయమూర్తులు ఆవేదన చెందుతుంటే పట్టించుకోకుండా ఉండలేమని చెప్పారు. ఈ నెల 18న సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌గా ప్రమాణం చేయనున్న జసిస్ బోబ్డే ఆదివారం ఓ వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. 'సోషల్ మీడియాలో న్యాయమూర్తుల ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారు. ఇది కోర్టుల పనితీరును ప్రభావితం చేస్తుంది. సామాజిక మాధ్యమాల్లో జడ్జీల తీర్పులనుగాక న్యాయమూర్తులను విమర్శించడం పరువునష్టం నేరం కిందకు వస్తుంది. జడ్జీలు కూడా మానవమాత్రులేనని గుర్తించాలి. న్యాయమూర్తులను వేధించడాన్ని ఎవరూ అంగీకరించరు.' అన్నారు. అయితే సోషల్ మీడియా విమర్శలను అడ్డుకోవడానికి ప్రస్తుతం సుప్రీం కోర్టు చేయగలిగిందేమీ లేదని నిస్సహాయత వ్యక్తం చేశా రు. ప్రజల, జడ్జీల ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని.. పైపెచ్చు భావ వ్యక్తీకరణ స్వే చ్ఛ లేదంటూ గగ్గోలు పెడుతున్నారని ఆక్షేపించారు. 'న్యాయం అనవసరంగా ఆలస్యం కాకూడదు. అనవసరంగా తొందర కూడా పడకూడదు. అలాగని తక్షణ న్యాయం ఉండాలని అనుకోరాదు. సకాలంలో న్యాయం అందాలి. అనవసర జాప్యం జరిగితే నేరాలు పెరగడానికి దారితీస్తుంది. ఆర్థిక దావాలను సత్వరమే పరిష్కరించకపోతే దౌర్జన్యాలు పెరుగుతాయి. కండబలం ప్రయోగించే అవకాశమూ ఉంది. చట్టపాలన క్షీణిస్తుంది. న్యాయవ్యవస్థ అవసరాలేంటో, మౌలిక వసతులలేమి గురించి ప్రభుత్వానికి బాగా తెలుసు. వసతుల కల్పనలో కేంద్రం, రాష్ట్రప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. సత్వర న్యాయానికి కృత్రి మ మేధను ఉపయోగించుకోవాలి. ఇది న్యాయమూర్తులకు బాగా ఉపకరిస్తుంది' అని సూచించారు. కీలక అంశాలపై ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనాన్ని శాశ్వతంగా ఏర్పాటు చేస్తారా? అని ప్రశ్నించగా.. ప్రస్తు త ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌కు దీనిపై నిర్దిష్ట అభిప్రాయాలు ఉన్నాయని, ఆయనెలా వ్యవహరిస్తారో చూడాల్సి ఉందని జస్టిస్ బోబ్డే బదులిచ్చారు. దేశంలోని పలు కోర్టుల్లో ఖాళీ జడ్జీల పోస్టుల భర్తీకి, మౌలిక వసతుల కల్పనకు జస్టిస్ గొగోయ్ చేపట్టిన చర్యలు ఫలవంతమయ్యేలా చూస్తానన్నారు. న్యాయవాదుల తీవ్ర వాదోపవాదాల నడుమ అయోధ్య కేసులో నిరంతరాయంగా రోజువారీ విచారణ ఎలా చేపట్టగలిగారని ప్రశ్నించగా.. సీటులో నుంచి లేవగానే దాని గురించి మరచిపోతానని బదులిచ్చారు.

అసోం భవిష్యత్‌కు ఎన్‌ఆర్‌సీ కీలకం

శరణార్థుల సంఖ్యపై దుష్ప్రచారం: జస్టిస్ గొగోయ్

న్యూఢిల్లీ, నవంబరు 3: జాతీయ పౌర పట్టిక (ఎన్‌ఆర్‌సీ) రూపకల్పనను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ గట్టిగా సమర్థించారు. అసోం భవిష్యత్‌కు ఇది కీలకమైన మౌలిక పత్రమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అక్రమ శరణార్థుల సంఖ్యపై తప్పుడుప్రచారాలతో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పెద్దఎత్తున హింసాకాండ చెలరేగిందని.. ప్రజల్లో భయాందోళనలు నెలకొల్పారని మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధి దెబ్బతిందని చెప్పారు. ఆదివారమిక్కడ సీనియర్ జర్నలిస్టు మృణాల్ తాలూక్దార్ రాసిన 'వలస పాలనానంతర అసోం (1947-2019)' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో జస్టిస్ గొగోయ్ మాట్లాడారు. అసోంలో ఎన్‌ఆర్‌సీపై ఏర్పాటైన ధర్మాసనానికి అదే రాష్ట్రానికి చెందిన గొగోయ్ ఆధ్వర్యం వహిస్తున్నారు. 'ఎన్‌ఆర్‌సీ ఆలోచన కొత్తదేం కాదు. ఇది 1951 నుంచే ఉంది. దానినే ఇప్పుడు నవీకరించే ప్రక్రియ జరుగుతోంది. దీనికి ముందు రాష్ట్రంలోని అక్రమ శరణార్థుల సంఖ్య పై తప్పుడు ప్రచారం సాగించారు. కొన్ని మీడియా సంస్థల నిర్లక్ష్యం, బాధ్యతారహిత కథనాల వల్ల పరిస్థితి మరింత దిగజారింది' అని ఆక్షేపించారు.

'భారత్-థాయ్' కనెక్టివిటీ పెంచుదాం

రక్షణ పరిశ్రమల్లోనూ పరస్పర సహకారం: మోదీ

థాయ్, ఇండోనేషియా, మయన్మార్ దేశాధినేతలతో భేటీ

మయన్మార్ కౌన్సెలర్ ఆంగ్ సాన్ సూకీతో ప్రధాని మోదీ కరచాలనం

బ్యాంకాక్, నవంబరు 3: రక్షణ రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవాలని భారత్, థాయ్‌లాండ్ నిర్ణయించాయి. రక్షణ పరిశ్రమల రంగంలో ఇరు దేశాలు మరింత సహకరించుకోవాలని తీర్మానించాయి. ఆదివారమిక్కడ ప్రధాని మోదీ థాయ్ ప్రధాని ప్రయుత్ చన్ ఓ చా మధ్య జరిగిన చర్చల్లో ఈ మేరకు నిర్ణయించారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య బంధాలను మరింత బలోపేతం చేయడంపైనా చర్చించారు. అలాగే భారత్, థాయ్ మధ్య కనెక్టివిటీని మరింత పెంచడంపైనా ఇరువురు నేతలు చర్చించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. మరోవైపు ఆసియాన్ సదస్సులో భాగంగా ప్రధాని మోదీ ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడోతోనూ భేటీ అయ్యారు. ఉగ్రవాదం, తీవ్రవాదంపై పోరులో కలిసి పనిచేయాలని తీర్మానించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణలోనూ కలిసి ముందుకు సాగాలని నిర్ణయించారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన విడోడోకు మోదీ శుభాకాంక్షలు తెలిపారు. వివిధ రంగాల్లో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత మెరుగుపర్చాలని నేతలిద్దరూ నిర్ణయించారు. వ్యూహాత్మక భాగస్వామిగా ఇండోనేషియాకు అత్యధిక ప్రాధాన్యమిస్తామని మోదీ తెలిపారు. వచ్చే ఏడాది భారత పర్యటనకు రావాలని విడోడోను ఆహ్వానించారు. మయన్మార్ కౌన్సెలర్ ఆంగ్ సాన్ సూకీతోనూ మోదీ నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు. అయితే, ఈ భేటీలో రోహింగ్యా ముస్లింల ప్రస్తావనపై సమాచారం లేదు.

డీప్ ఓషన్ మిషన్‌కు ఇస్రో మాడ్యూల్

చెన్నై, నవంబరు 3: మానవ సహిత సబ్‌మెర్సిబుల్ వాహనంతో సముద్ర గర్భంలోకి చొచ్చుకుపోవాలన్న భారత ఆశయం నెరవేరే దిశగా మరో అడుగు ముందుకు పడింది. డీప్ ఓషన్ మిషన్‌లో భాగంగా దీని కోసం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఒక క్రూ మాడ్యూల్‌ను అభివృద్ధి చేసిందని భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి మాధవన్ నాయర్ రాజీవన్ తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ రజతోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఆదివారం ఇక్కడకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇస్రో అభివృద్ధి చేసిన మాడ్యూల్ గురించి వెల్లడించారు. 'మానవ సహిత సబ్‌మెర్సిబుల్‌ను ఇస్రో విజయవంతంగా అభివృద్ధి చేసింది. అయితే అంతర్జాతీయ ఏజెన్సీకి పంపి కొన్ని పరీక్షలు నిర్వహించిన తర్వాత దాన్ని ధ్రువీకరించాల్సి ఉంది' అని మాధవన్ నాయర్ పేర్కొన్నారు. సబ్‌మెర్సిబుల్ వాహనం నీటిలో సబ్‌మెరైన్‌లా ప్రయాణిస్తుంది. అయితే సబ్‌మెరైన్‌లు సముద్ర గర్భంలో 200 మీటర్లకు మించి లోతుకు వెళ్లలేవు. సబ్‌మెర్సిబుల్ వాహనాల్లో సుమారు 6 వేల మీటర్ల లోతుదాకా వెళ్లవచ్చు. ఇస్రో తయారు చేసిన దీర్ఘ గోళాకార సబ్‌మెర్సిబుల్ వాహనంలో ముగ్గురు వ్యక్తులు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.

● 'పెగాసస్'పై కేంద్రానికి వాట్సాప్ వివరణ

న్యూఢిల్లీ, నవంబరు 3: సోషల్ మెసేజింగ్ యాప్ వాట్సాప్‌లోకి ఇజ్రాయిల్ స్పైవేర్ 'పెగాసస్'చొరబాటు అంశం మలుపులు తిరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా 1400 మందిపైగా కీలక వ్యక్తుల ఫోన్లను ఇజ్రాయిల్ నిఘా సంస్థ 'ఎన్ఎస్‌వో' పెగాసస్ ద్వారా ఏప్రిల్-మే నెలల్లో హ్యాక్ చేయడం.. ఇం దులో భారత ప్రముఖులూ ఉండటం.. ఇది సరిగ్గా సార్వత్రిక ఎన్నికల సమయంలో జరగడంతో రాజకీయ రంగు పులుముకుంటోంది. సోమవారంలోగా వివరణ ఇవ్వాలని వాట్సా‌ప్‌కు కేంద్రం నోటీసులివ్వగా సంస్థ కూడా వెంటనే బదులిచ్చింది. మరోవైపు తమ పార్టీ అగ్ర నేత ప్రియాంక, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్‌ల ఫోన్లు హ్యాక్ అయినట్లు వాట్సాప్ నుంచి సందేశం వచ్చిందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుర్జేవాలా తెలిపారు. ఊహాగానం కాంగ్రెస్ స్వభావమని బీజేపీ ఎద్దేవా చేసింది.

● 50 మంది కశ్మీరీ మిలిటెంట్ల ఇంటిబాట

శ్రీనగర్, నవంబరు 3: కశ్మీర్‌లో 15వ సైనిక పటాలం(చినార్ కార్ప్స్) చేప ట్టిన 'ఆపరేషన్ మా' ఫలిస్తోంది. ఏడాదిలో మిలిటెంట్ సంస్థలను వీడి 50 మంది కశ్మీరీ యువకులు ఇంటిబాట పట్టారని 15వ సైనిక పటాలం జన రల్ ఆఫీసర్ కమాండింగ్, లెఫ్టినెంట్ జనరల్ కన్వల్‌జీత్‌సింగ్ ధిల్లాన్ వెల్లడించారు. ఖురాన్ బోధనల ఆధారంగా మాతృమూర్తి సేవకు అంకితమ య్యేలా ఉగ్రవాదుల్లో మార్పు తేవడమే 'ఆపరేషన్ మా' లక్ష్యమన్నారు.

● కశ్మీర్‌లో రాజకీయ ఖైదీల తరలింపు?

శ్రీనగర్/ఇస్లామాబాద్, నవంబరు 3: కశ్మీర్‌లో చలి తీవ్రరూపు దాల్చింది. మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా శ్రీనగర్‌లోని సెంటార్ హోటల్‌లో ఉంటున్న 34 మంది రాజకీయ ఖైదీలు అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వారిని నగరంలో కట్టుదిట్టమైన భద్రతతో కూడిన కంటోన్మెంట్ ఏరియాలో ఉండే ఓ ప్రైవేటు హోటల్‌కు తరలించనున్నట్లు సమాచారం. మరోవైపు భారత్ ఇటీవల విడుదల చేసిన రాజకీయ మ్యాప్‌లను అంగీకరించబోమని పాకిస్థాన్ తెలిపింది.

● పేదరికంలోకి చైనా పల్లెలు..

బీజింగ్, నవంబరు 3: చైనాలోని గ్రామీణ ప్రాంతాలు పేదరికంలోకి దిగజారుతున్నాయి. ఆర్థిక మాంద్యం, అమెరికాతో కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం, నానాటికీ పెరుగుతున్న అర్బన్-రూరల్ వ్యత్యాసాలే దీనికి కారణం. చైనా వ్యవసాయ శాఖ అనుబంధ మేధోమథన సంస్థ 'బీజింగ్ ఓరియంట్ అగ్రి బిజినెస్ కన్సల్టెంట్' తాజా నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. 2014 నుంచి గ్రామీణుల ఆదాయం పడిపోతోందని, ఈ ఏడాది తొలి ఆరునెలల్లో మరో 20 శాతం దిగజారిందని నివేదిక తెలిపింది.

ఢిల్లీలో 37 విమానాల దారి మళ్లింపు

ప్రమాదకర స్థాయికి వాయు కాలుష్యం

న్యూఢిల్లీ, నవంబరు 3: ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. వాయు నాణ్యత సూచి (ఏక్యూఐ) 494గా నమోదైంది. మూడేళ్లలో ఇదే అత్యధికం. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఢిల్లీ విమానాశ్రయం దట్టమైన పొగమంచు గుప్పిట్లో చిక్కుకుంది. దీంతో ఇక్కడ దిగాల్సిన 37 విమానాలను జైపూర్, అమృత్‌సర్, లఖ్‌నవూ, ముంబైలకు దారిమళ్లించారు. ఈ ఎయిర్‌పోర్టు మీదుగా రాకపోకలు సాగించే మరో 550 విమాన సర్వీసులూ సగటున 60 నుంచి 180 నిమిషాలు ఆలస్యంగా నడిచాయి. ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో హెల్త్ ఎమర్జెన్సీ నేపథ్యంలో గురుగ్రామ్, ఫరీదాబాద్, నోయిడా, ఘజియాబాద్ జిల్లాల్లో పాఠశాలలకు నవంబరు 5 వరకు సెలవులు ప్రకటించారు. వాయు కాలుష్యం కట్టడికిగానూ ఉత్తరప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి తాజ్‌మహల్ పశ్చిమ గేటు వద్ద ఎయిర్ ప్యూరిఫయర్ వ్యాన్‌ను అందుబాటులో ఉంచింది. కాలుష్య తీవ్రతను తగ్గించేందుకు కేంద్ర కేబినెట్ సెక్రెటరీ రాజీవ్ గౌబ.. ఢిల్లీ, హరియాణా, పంజాబ్ ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపుతూ, రోజువారీ పరిస్థితిపై సమీక్షిస్తున్నారు. ఇక దేశ రాజధాని ప్రజలు ఊపిరి సలుపుకోలేని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారంటూ పర్యావరణ పరిరక్షణ సంఘాలు ప్రధాని మోదీకి ఓ లేఖ రాశాయి.

రాష్ట్రపతి భవన్ సమీపానికి ప్రధాని నివాసం!

రాజ్‌పథ్, పార్లమెంటుతో పాటే నిర్మాణం

హెచ్‌సీపీ సంస్థకే బాధ్యత అప్పగింత?

న్యూఢిల్లీ, నవంబరు 3: ప్రధానమంత్రి అధికార నివాసాన్ని లోక్ కల్యాణ్ మార్గ్ నుంచి రైసినా హిల్స్ దక్షిణ ప్రాంతంలోని డల్హౌసీ రోడ్ హట్‌మెంట్స్‌కు మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రపతి భవన్ కూడా అక్కడే ఉంది. దీని పునర్నిర్మాణ కాంట్రాక్టు బాధ్యతను కూడా అహ్మదాబాద్‌కు చెందిన హెచ్‌సీపీ డిజైన్ అనే ఆర్కిటెక్చర్ సంస్థకు అప్పగించనుంది. ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో), కొత్త పార్లమెంటు భవనం, కేంద్ర సెక్రెటేరియట్, రాజ్‌పథ్‌ల పునర్నిర్మాణ బాధ్యతను కూడా అదే సంస్థకు అప్పగించారు. అయితే, అన్ని రకాల భద్రతా చర్యలను పరిశీలించిన తర్వాతే పీఎంవో, ప్రధాని అధికారిక నివాసాల పునర్నిర్మాణంపై తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. "మేము నిర్మాణ సంస్థను ఎంపిక చేశాం. ఆ సంస్థ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను సమర్పిస్తుంది. కొత్త పార్లమెంటు, కార్యాలయాల భవన సముదాయంతో పాటు ఇతర నిర్మాణాలపై ప్రభుత్వ పెద్దలు, లోక్‌సభ స్పీకర్, ఇతర పెద్దలతో చర్చిస్తాం. జాతీయ భద్రతతో కూడిన ఈ ప్రాజెక్టుపై పలు దఫాలుగా చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటాం" అని అధికారులు పేర్కొన్నారు. కొత్త నిర్మాణాలను 'భారత ప్రజాస్వామ్య మ్యూజియం'గా తీర్చి దిద్దుతామని హెచ్‌సీపీ సంస్థ తెలిపింది. నార్త్ బ్లాక్‌ను 'ఇండియా ఎట్ 75'గా.. సౌత్ బ్లాక్‌ను 'ద మేకింగ్ ఆఫ్ ఇండియా' ప్రదర్శనగా వినియోగిస్తామని పేర్కొన్నది. నార్త్, సౌత్ బ్లాక్‌ల ముఖ ద్వారాలను కలపబోమని, ప్రస్తుత పార్లమెంటు భవనాన్ని కూల్చబోమని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి చెప్పారు.

భారత గగన్‌యాన్‌కు రష్యా 'లైఫ్'

న్యూఢిల్లీ, నవంబరు 3: భారత్ చేపట్టనున్న మానవ సహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'కు రష్యా సహకరించనుంది. అంతరిక్షంలో వ్యోమగాముల మనుగడకు ప్రత్యేక ఏర్పాట్లు(లైఫ్ సపోర్ట్), అంతరిక్ష నౌక వేడెక్కకుండా దోహదపడే ఉపకరణాలను అందించనుంది. ఇందుకోసం ఇస్రో, రష్యా అంతరిక్ష పరిశోధన సంస్థ రోస్కోస్‌మోస్ సబ్సిడరీ గ్లావ్‌కోస్‌మోస్ ఒప్పందం కుదుర్చుకున్నాయి.

బాబ్రీ పాపం పీవీదే!

'నాన్ ప్లేయింగ్' కెప్టెన్‌లా వ్యవహరించారు

హోంశాఖ ప్రణాళికను పక్కన పెట్టేశారు

అయోధ్యపై హోంశాఖ మాజీ కార్యదర్శి మాధవ్ గోడ్బెలే సంచలన పుస్తకం

న్యూఢిల్లీ, నవంబరు 3: రాజీవ్‌గాంధీ, పీవీ సింగ్, పీవీ నరసింహారావు... అయోధ్య వివాదం పరిష్కారం కాకపోవడానికి, బాబ్రీ మసీదు విధ్వంసానికీ ఈ ముగ్గురే కారణమని కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి మాధవ్ గోడ్బెలే ఆరోపించారు. అయోధ్యపై తీర్పు వెలువడనున్న కీలక సమయంలో... ఆయన రాసిన కొత్త పుస్తకంలోని వివరాలు బయటికి వచ్చాయి. 'బాబ్రీ మసీద్-రామ్‌మందిర్ డైలమా: యాసిడ్ టెస్ట్ ఫర్ ఇండియాస్ కాన్‌స్టిట్యూషన్' అనే ఈ పుస్తకంలో పీవీ నరసింహారావుపై ఆయన సంచలన ఆరోపణలు చేశారు. బాబ్రీ కూల్చివేతకు ముందు కేంద్ర హోంశాఖ సిద్ధం చేసిన సమగ్ర, అత్యవసర ప్రణాళికను పీవీ ఆమోదించలేదని తెలిపారు. "ప్రధానిగా ఒక దృఢమైన రాజకీయ నిర్ణయం తీసుకుని ఉంటే... రామాయణంలో ఈ మహాభారతం జరిగేదే కాదు" అని వ్యాఖ్యానించారు. "కీలకమైన టెస్ట్ మ్యాచ్‌లో పీవీ ప్రధానమైన పాత్ర పోషించారు. దురదృష్టవశాత్తూ ఆయన నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌గా మిగిలిపోయారు" అని విమర్శించారు. అంతకుముందు... బాబ్రీ మసీదుకు ముప్పు పొంచి ఉందని తెలిసినప్పటికీ రాజీవ్‌గాంధీ, వీపీ సింగ్ తగిన విధంగా స్పందించి చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని మాధవ్ గోడ్బెలే ఆరోపించారు. "రాజీవ్ హయాంలో అయోధ్య సమస్యకు ఆచరణీయ రాజీ పరిష్కారాలు సూచించినప్పటికీ ఆయన పట్టించుకోలేదు. ఈలోపు ఇరుపక్షాలు తమ వాదనలపై మరింత పట్టుబిగించి, భీష్మించుకు కూర్చున్నాయి. బాబ్రీ మసీదు, దాని చుట్టుపక్కల ప్రాంతాలను వీపీ సింగ్ ప్రత్యేక ప్రాంతంగా పరిగణించి కేంద్రం పరిధిలోకి వచ్చేలా ఆర్డినెన్స్ జారీ చేశారు. ఈ విషయంలో ఆయన నిక్కచ్చిగానే ఉన్నారు. ఇక... పీవీ హయాంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 356ను ప్రయోగించి వివాదాస్పద కట్టడాన్ని కేంద్రం స్వాధీనం చేసుకునేలా కేంద్ర హోంశాఖ ఒక ప్రణాళిక రచించింది. అందుకు న్యాయమంత్రిత్వ శాఖ కూడా అంగీకరించి, కేబినెట్ నోట్ సిద్ధం చేసింది. దీనిని కేబినెట్ కార్యదర్శికి, ప్రధాని ముఖ్య కార్యదర్శికి, సీనియర్ సలహాదారుకు, హోంమంత్రికి 1992 నవంబరు 4వ తేదీన అందించారు. కేంద్ర పారామిలిటరీ బలగాలను రంగంలోకి దించి, బాబ్రీ మసీదు కట్టడంతో పాటు, చుట్టుపక్కల ప్రాంతాలను స్వాధీనం చేసుకుని, పూర్తి భద్రత కల్పించాలన్నది ఆ ప్రణాళిక. కరసేవకులు అక్కడికి చేరుకోకముందే ఈ ప్రణాళికను ఆకస్మికంగా, మెరుపువేగంతో అమలు చేయాలని నోట్‌లో తెలిపారు. దీని అమలుకు వీలుగా ఆర్టికల్ 356 కింద రాష్ట్రపతి పాలన విధించాలని కూడా సూచించారు. కానీ... రాజ్యాంగం కేంద్రానికి ఇచ్చిన అధికారాలపై పీవీ మరో విధంగా ఆలోచించారు. సుప్రీంకోర్టుకు, జాతీయ సమగ్రత మండలి (ఎన్ఐసీ)కి యూపీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీనే విశ్వసించారు" అని మాధవ్ గోడ్బెలే తెలిపారు. దీంతో అప్పటి కల్యాణ్ సింగ్ ప్రభుత్వానికి 'స్వేచ్ఛ' ఇచ్చినట్లయిందన్నారు. "కరసేవకులను యూపీ సర్కారు అనుమతించడం, వారు శాంతి భద్రతలను తమ అదుపులోకి తీసుకోవడం, వివాదాస్పద కట్టడాన్ని కూల్చివేయడం జరిగిపోయాయి. రాజ్యాంగబద్ధ విధులను నిర్వర్తించడంలో రాష్ట్ర సర్కారు వైఫల్యమే దీనికి కారణం" అన్నారు. పరిస్థితి తీవ్రతను గ్రహించి కేంద్రానికి తెలపడంలో అప్పటి గవర్నర్ బి.సత్యనారాయణరెడ్డి విఫలమయ్యారని, పైగా రాష్ట్రపతి పాలన అవసరం లేదని చెప్పారని తెలిపారు. మాధవ్ గోడ్బెలే కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా ఉన్నప్పుడే 1993 మార్చిలో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు.

జగ్దాలే

జేబులో రూ.3 ఉన్న వ్యక్తికి 40వేల కట్ట దొరికితే అప్పగించాడు!

వెయ్యి నజరానా ఇవ్వబోగా తిరస్కరణ

పుణె, నవంబరు 3: పైసా మే పరమాత్మ అంటారు! ఈ విషయంలో నిజాయితీని ఆశించడమే దండగ అనుకునే రోజులివి! రోడ్డు మీద రూ.100 నోటు కనిపిస్తే.. ఎవరైనా చప్పున తీసుకొని దాచుకుంటారు. అయితే, జేబులో కేవలం మూడు రూపాయలే ఉన్న ఆ వ్యక్తికి రూ.40వేల కట్ట దొరికింది. అతడు ఆ డబ్బును దాచుకోలేదు. వెతికి వెతికి మరీ కోల్పోయిన వ్యక్తికి ఆ డబ్బును అప్పగించాడు! మహారాష్ట్రలో సతారా నియోజకవర్గం పరిధిలోని ధహివాడీ బస్టాండ్‌లో ఈ ఘటన వెలుగుచూసింది. నిజాయితీగా డబ్బును అప్పగించిన ఆ వ్యక్తి 54 ఏళ్ల జగ్దాలే. భార్యకు శస్త్ర చికిత్స చేయించేందుకు డబ్బు తీసుకెళుతూ బస్టాండ్‌లో పారేసుకొని వెతుకుతున్న వ్యక్తికి జగ్దాలే డబ్బు తెచ్చివ్వగానే ప్రాణం లేచొచ్చింది. 'ఇంద.. తీసుకో' అంటూ ఆయన వెయ్యి రూపాయలు ఇవ్వబోగా జగ్దాలే తీసుకోలేదు. పైగా ఏమన్నాడో తెలుసా? 'నేను మా సొంతూరు వెళుతున్నాను సార్. నా వద్ద మూడు రూపాయలే ఉన్నాయి. అవి బస్సు చార్జీకి సరిపోవు. రూ.7 ఇవ్వండి చాలు' అని చెప్పి.. ఆ మొత్తమే తీసుకున్నాడు. జగ్దాలే నిజాయితీ తెలిసి అమెరికాలో ఉంటున్న రాహుల్ బార్జే అనే వ్యక్తి చలించిపోయాడు. 5 లక్షల నగదు ఇవ్వబోగా జగ్దాలే సున్నితంగా తిరస్కరించాడు. సతారా బీజేపీ ఎమ్మెల్యే శివేంద్ర రాజే భోంస్లే, మాజీ ఎంపీ ఉదయం రాజే భోస్లే ఆయన్ను సన్మానించారు. వారు కూడా నగదు బహుమతి ఇవ్వబోగా జగ్దాలే 'నాకేమీ వద్దు సార్ ప్లీజ్' అంటూ వారించడం విశేషం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

epaper.andhrajyothy.com